సంచలన వార్తలకు
నేడు
TELUGU DAILY
బుధవారం-30.4.2025 | హైదరాబాద్ సంపుటి -3 సంచిక-3 | పేజీలు -8 వెల: రూ.2
www.nedudailynews.com

## సీజేఐగా జస్టిస్ గవాయ్

న్యూఢిల్లీ : జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ మే 14న భారత సుప్రీం కోర్టు 52వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆ యన నియామకానికి సంబంధించి మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. భారత న్యాయశా ఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఇం దుకు సంబంధించిన వివరాలను ఎక్స్ ద్వారా వెల్లడించారు. 'భారత రాజ్యాం గం ద్వారా సంక్రమించిన అధికారాల మేరకు గవాయ్‌ని మే 14 నుంచి భారత సుప్రీం కోర్టు ప్ర ధాన న్యాయమూర్తిగా నియమించడం ఆనందంగా ఉంది' అని మంత్రి ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం సీజేఐగా విధులు నిర్వర్తిస్తున్న సంజీవ్ ఖన్నా మే 13న పద వీ విరమణ చేయనున్నారు.
52వ సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్న బీఆర్ గవా య్ 6 నెలల పాటు మాత్రమే ఆ పోస్టు లో కొనసాగనున్నారు. నవంబర్ 2025 లో గవాయ్ పదవీకాలం పూర్తవనుంది. బాలకృష్ణన్ అనంతరం సీజేఐగా పదవి చేపట్టనున్న రెండో దళిత వ్యక్తి గవాయ్ కావడం గమనార్హం. సుప్రీం కోర్టులో వి ధులు నిర్వర్తిస్తున్న సీనియర్ న్యాయమూర్తిని సీజేఐ పదవికి సిఫారసు చేస్తారు.

## కాంగ్రెస్ బీజేపీ పోస్టర్ వార్

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్ర దాడిపై కాంగ్రెస్, బీజేపీ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు పతాకస్థాయికి చేరాయి. మంగళవారం పోస్టర్ యుద్ధానికి దిగాయి. పసుపు రంగు కుర్తా పైజామా, నల్లటి బూట్లు ధరించిన ప్రధాని చిత్రాన్ని తల లేకుండా కాంగ్రెస్ సోమవారం రాత్రి 'ఎక్స్'లో పోస్టుచేసింది. దాని కింద 'బాధ్యత వహించాల్సిన సమయంలో మాయమయ్యారు' అనే సందేశం పెట్టింది. బీజేపీ మంగళవారం.. కాంగ్రెస్‌పై విరుచుకుపడింది. రాహుల్‌గాంధీ పాకిస్థాన్ మిత్రుడంటూ బీజేపీ అధికార ప్రతినిధి ఆర్‌పీ సింగ్ ట్వీట్ చేయడమేగాక.. వీపు వెనుక కత్తి దాచుకుని ఉన్న రాహుల్ చిత్రాన్ని పోస్టు చేశారు. పహల్గాం ఉగ్ర ఘటన తర్వాత కేంద్రం ఏర్పాటు చేసిన అఖిల పక్ష సమావేశంలో ప్రధాని పాల్గొనకపోవడంపై కాంగ్రెస్ తరచూ విమర్శలు చేస్తోంది. ఆ క్రమంలోనే తాజా పోస్టర్‌ను పోస్టు చేసింది. కాంగ్రెస్ సంపూర్ణంగా పాకిస్థాన్‌కు మద్దతిస్తోందని.. ఆ పార్టీని 'లష్కరే పాకిస్థాన్ కాంగ్రెస్'గా అభివర్ణించింది. అఖిల పక్ష సమావేశంలో ఐక్యత గురించి ఆ పార్టీ నొక్కిచెప్పిందని.. కానీ ఆ పార్టీ నేతలు పాక్‌తో చర్చలు జరపాలంటున్నారని ఆక్షేపించింది. 'తలలేని మొండెం'.. ఆ పార్టీ ఉగ్ర సిద్ధాంతంగా మారిందని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా మీడియా సమావేశంలో ధ్వజమెత్తారు.

# ఆర్మీకి ఫ్రీ హ్యాండ్

- సమయం, స్పందన, లక్ష్యంపై త్రివిధ దళాలకే అధికారం
- ఉగ్రవాదులను పెంచి పోషించే వాళ్లను పాతాళంలోకి తొక్కేస్తాం
- పహల్గాంపై కీలక భేటీలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు
- నేడు వరుస భేటీలు
- సీసీఎస్‌తోపాటు మోదీ నేతృత్వంలో రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీ

3



న్యూఢిల్లీ : పహల్గాం ఉగ్రదాడి నిందితులపై చర్యలు తీసుకునే క్రమంలో త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛను ఇస్తున్నట్టు ప్రధాని మోదీ పేర్కొన్నారని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. మంగళవారం న్యూఢిల్లీ లోని ప్రధాని నివాసంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కే త్రిపాఠి, ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్‌లతో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది.
దాదాపు 90 నిమిషాల పాటు జరిగిన ఈ భేటీలో జరిగింది. ఉగ్రవాదం అణచివేతే దేశ సంకల్పమని మోదీ ఉద్ఘాటించినట్టు తెలుస్తోంది. భారత త్రివిధ దళాల శక్తి సామర్థ్యాలపై ప్రధాని విశ్వాసం వ్యక్తంచేశారు. పహల్గాం ఉగ్రదాడిపై ప్రతిస్పందించే విషయంలో అనుసరించే పద్ధతులు, లక్ష్యాలు, సరైన సమయాన్ని నిర్ణయించే విషయంలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ను ఇచ్చినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.
బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ భేటీ జరగనున్న నేపథ్యంలో ఈ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. పహల్గాం దాడి నిందితులను శిక్షిం చేందుకు భద్రతా బలగాలు


# పెగాసస్ ఉపయోగిస్తే తప్పేంటి?



- సామాన్య పౌరులపై ఉపయోగిస్తే దర్యాప్తునకు ఆదేశిస్తాం
- దేశభద్రత ముఖ్యం నివేదికను బహిర్గతం చేయబోం
- సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు
- పెగాసిస్‌పై తదుపరి విచారణను జూలై 30కి వాయిదా

3

హైదరాబాద్, నేడున్యూస్: దేశ వ్యతిరేక శక్తులపై ప్రభుత్వం స్పైవేర్‌ను వినియోగిస్తే తప్పేముందని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. జాతీయ భద్రతా ప్రయోజనాల కోసం ఓ దేశం స్పైవేర్‌ను కలిగి ఉండటం తప్పులేదని అత్యున్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. పెగాసస్ స్పైవేర్‌ను వినియోగించి దేశంలోని పాత్రికేయులు, పౌరసమాజ ప్రముఖులపై నిఘా పెట్టారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేసింది.
స్పైవేర్‌ను ఉపయోగిస్తోందా లేదా అన్న విషయాన్ని కేంద్రం స్పష్టంగా చెప్పాలని పిటిషనర్ తరఫున న్యాయవాది కోరారు. అంతేకాకుండా ఈ ఆరోపణలపై దర్యాప్తు జరిపి సాంకేతిక నిపుణుల బృందం నివేదిక కోసం సర్వోన్నత న్యాయస్థానం గతంలో ఆదేశించిందని గుర్తుచేశారు. ఇప్పటివరకూ ఆ నివేదిక అందలేదని ధర్మాసనం దృష్టికి తెచ్చిన పిటిషనర్ దాన్ని వెంటనే బహిర్గతం చేయాలని కోరారు. ఈ క్రమంలోనే దీనికి బదుల్చిన ధర్మాసనం ఓ దేశం స్పైవేర్‌ను వినియోగిస్తే గనుక అందులో తప్పేముందని వ్యాఖ్యానించింది. అయితే, దాన్ని ఎలా, ఎవరిపై ఉపయోగించారన్న దాని గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. పౌర సమాజంపై కాకుండా దేశ వ్యతిరేక శక్తులపై దీన్ని వినియోగిస్తే గనుక అందులో ఏ తప్పు లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. దేశ భద్రత విషయంలో రాజీపడకూడదని, ఒకవేళ సామాన్య పౌరులపై ఉపయోగిస్తే గనుక దానిపై దర్యాప్తు జరిపిస్తామని చెప్పింది.



# ఎన్డీఎస్ఏ కాదు.. ఎన్‌డీఏ నివేదిక

2

- ఎన్డీఎస్ఏ నివేదికలో ఆ విషయం ఎక్కడాలేదు
- సీడబ్ల్యూసీ సూచన మేరకే మేడిగడ్డలో ప్రాజెక్టు
- మంత్రి ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై హరీశ్ ఆగ్రహం

హైదరాబాద్, నేడున్యూస్: మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో అవినీతి జరగలే దని, ప్రాజెక్టులో అవినీతి జరిగినట్టు ఎన్డీఎస్ఏ తన నివేదికలో ఎక్కడా చెప్పలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. ఎన్డీఎస్ఏ నివేదికపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పినవన్నీ అబద్ధాలే అన్నా రు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సందర్భంగా ఆయన ప్రయాస, అపసోపాలు చూస్తే జాలి కలిగిందన్నారు.
కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదికపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి హరీశ్‌రావు కౌంటర్ ఇచ్చారు. తమ పార్టీ రజతోత్సవ సభ విజయవంతం అయినందున దాని నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు.
మేడిగడ్డ బ్యారేజీలో దెబ్బతిన్న ఏడో బ్లాకును రిపేర్ చేయవచ్చని ఎన్డీఎస్ఏ చెప్పిందన్నారు. అందువల్ల వెంటనే మరమ్మతులు చేసి రైతులకు నీళ్లు అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్టు పేర్కొన్నారు. గతంలో ఎన్డీఎస్ఏ బిల్లును లోక్‌సభలో ఉత్తమ్ వ్యతిరేకించారని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఇప్పుడేమో అది గొప్పదని మాట్లాడుతున్నారని ఇలా మాట్లాడటం

# ఎన్డీఎస్ఏ నివేదికనే తప్పుపడతారా?

- కమీషన్లకు కక్కుర్తిపడే అంచనాల పెంపు
- డీపీఆర్‌లు అనేకసార్లు మార్చారు
- రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ల నివేదిక బుట్టదాఖలు
- నిజం ఒప్పుకుని బీఆర్ఎస్ నేతలు క్షమాణలు చెప్పాలి
- తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు
- ఎన్డీఎస్ఏ నివేదికపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో మంత్రి ఉత్తమ్ మండిపాటు

2



హైదరాబాద్, నేడున్యూస్: కమీషన్లకు కక్కుర్తిపడే కాళేశ్వరం ప్రాజెక్టు అంచనాలను కేసీఆర్ భారీగా పెంచారని నీటిపారుద ల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఇందులో భాగంగానే ప్రాజెక్టు డీపీఆర్‌ల ను అనేకసార్లు మార్చేశారని విమర్శించారు. ఐదుగురు రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్లు అభ్యంతరం తెలిపినా తుమ్మిడిహట్టిని కాదని మేడిగడ్డ వద్ద బ్యారేజీని నిర్మించారని దుయ్యబట్టారు.
కాళేశ్వరాన్ని చేపట్టేందుకే పెద్దమనిషి (కేసీఆర్) ప్రాణ హిత-చేవెళ్ల ప్రాజెక్టు డిజైన్‌ను ఇష్టారాజ్యంగా మార్చేశారని మండిపడ్డారు. రూ.80 వేల కోట్లతో ప్రాజెక్టును నిర్మిస్తామని చెప్పి, రూ.లక్ష కోట్లు అప్పు చేశారని విమర్శించారు. కేసీఆర్ చీఫ్ ఇంజినీర్‌గా అవతారమెత్తి కనీసం డీపీఆర్ కూడా లేకుండా ప్రాజెక్టును నిర్మించి సర్వనాశనం చేశారన్నారు.
కేసీఆర్ ఎలా చెప్తే అలా నిర్మించడంతో చివరకు ప్రాజెక్టు పనికి రాకుం డా పోయిందన్నారు. ఈ బ్యారేజీలను ఉపయోగించుకునే పరిస్థితి లేదని, వాటిని తిరిగి ఉప యోగంలోకి తేవాలనే దానిపై అధ్యయనం చేయాల్సి ఉంటుందని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) తేల్చి చెప్పిందన్నారు. ఎన్డీఎస్ఏ నివేదిక మేరకే తమ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం సెక్రటేరియట్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణలో చోటు చేసుకున్న లోపాలపై ఎన్‌డీఎస్ఏ ఇచ్చిన నివేది కపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరంపేరుతో లక్షల కోట్లు నాశనం చేసి, రాష్ట్ర రైతాంగాన్ని, ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసిందన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేనంత హోరమైన మానవ నిర్మిత విపత్తును సృష్టించి అపఖ్యాతిని మూటగట్టు కున్న బీఆర్ఎస్ ప్రభుత్వ అసమర్థతను ఈ నివేదిక స్పష్టంగా వివరించిందన్నారు.



# హైకోర్టుకు ఐపీఎస్‌లు

- భూదాన్ భూముల వ్యవహారంపై జస్టిస్ భాస్కర్‌రెడ్డి తీర్పును సవాల్ చేసిన మహేశ్ భగవత్, స్వాతి లక్రా, సౌమ్యా మిశ్రా
- నిషేధిత జాబితాలో 27 మంది అధికారుల భూములు

2

హైదరాబాద్, నేడున్యూస్: భూదాన్ భూము ల వ్యవహారంపై పలువురు ఐపీఎస్ అధికారులు మంగళవారం హైకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై ఇటీవల విచారణ చేపట్టిన హైకోర్టు సింగిల్ బెంచ్ ధర్మాసనం 27 మంది అధికారులకు సంబంధించిన భూములను నిషేధిత జాబి తాలో పెట్టాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జస్టిస్ భాస్కర్‌రెడ్డి సింగిల్ బెంచ్ ధర్మాసనం తీర్పు వెలువరించింది.
ఈ తీర్పును సవా ల్ చేస్తూ తాజాగా కొందరు ఐపీఎస్ అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. వారిలో ఐపీఎస్‌లు మహేశ్ భగవత్, స్వాతి లక్రా, సౌమ్యా మిశ్రా ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూదాన్ భూముల కబ్జా, అక్రమాలపై దర్యాప్తు చేసి నిజాలు నిగ్గు తేల్చడానికి సీబీఐ, ఈడీలతో విచారణ జరిపించాలని కోరుతూ మహేశ్వరం మండలానికి చెంది న బిర్ల మల్లేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.
దీనిపై జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి ఏప్రిల్ 24న విచారణ చేపట్టారు. తీర్పు వెలువడే వరకు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రా మంలోని సర్వే నంబర్లు 181, 182, 194, 195 సర్వే నంబర్లలోని భూములను తదుపరి తీర్పు వెలువడే వరకు నిషేధిత జాబితాలో చేర్చాలని ఆదేశాలు జారీ చేశారు. అదీగాక ఆరోపణల తీవ్ర త దృశ్యా పిటిషనర్ తన పిటిషన్‌ను ఉపసంహరించుకునే అవకాశాన్ని ఇవ్వడం లేదని పేర్కొంది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ తదుపరి విచారణను వేసవి

# ఆర్టీసీలో సమ్మె సైరన్

- తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మె బాట
- మే 7 నుంచి నో డ్యూటీ
- డిమాండ్ల పరిష్కారం చేయాలన్న టీజీఎస్‌ఆర్టీసీ ఐకాస



2

హైదరాబాద్, నేడున్యూస్: తెలంగాణ ఆర్టీసీలో సమ్మె భేరీకి టీజీఎస్‌ఆర్టీసీ ఐకాస సన్నాహం చేస్తోంది. టీజీఎస్‌ఆర్టీసీ ఐకాస ఆధ్వర్యంలో ఆర్టీసీ పరిరక్షణ-ప్రభుత్వ హామీలు-ఆర్టీసీలో సమ్మె అంశాలపై జాతీయ కార్మిక సంఘాలతో హిమాయత్ నగర్ ఏఐటీయూసీ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆర్టీసీ కార్మిక సమస్యల పరిష్కారం కోసం మే 7న తెల్లవారుజాము నుంచి సమ్మెకు పిలుపునిచ్చినట్లు ఐకాస చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం. థామస్ వెల్లడించారు.
ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని వారు డిమాండ్ చేశారు. గత 2023లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేస్తున్నట్లు గెజిట్ ముద్రించిందని తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విలీనం చేస్తామని వారి మేనిఫెస్టోలో పెట్టి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. 17 నెలలు గడుస్తున్నా ఉద్యోగుల విలీనం జరగలేదన్నారు.

# ఆర్టికల్ 317 రద్దుతో అభివృద్ధి పథంలో కశ్మీర్

- ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు ప్రధాని మోదీ ప్రయత్నం
- పార్టీ రాష్ట్ర పదాధికారుల సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

2



# నేడు టెన్త్ ఫలితాలు

- మెమోల్లో గ్రేడ్ల స్థానంలో మార్కులు
- పాఠశాల విద్యా శాఖ నిర్ణయం.. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం
- ఈసారి జారీ చేయనున్న మెమోల్లోనే అమలుకు నిర్ణయం
- విద్యార్థులపై ఒత్తిడి పెంచే నిర్ణయాన్నితీసుకోవడం ఏమిటని విమర్శలు
- నేడు ఫలితాలు విడుదల చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2

హైదరాబాద్, నేడున్యూస్: రాష్ట్రంలో లక్షలా ది మంది విద్యార్థులు ఎప్పుడెప్పుడా అని ఉత్కంఠ తో ఎదురుచూస్తోన్న పదో తరగతి పరీక్షల ఫలితా ల విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఈ ఫలి తాలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి బుధవారం (ఏప్రిల్ 30) మధ్యాహ్నం ఒంటి గంటకు రవీంద్రభారతిలో విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ పరీక్షల విభాగం ఓ ప్రకటనలో వెల్లడించింది.



# నేడు టెన్త్ ఫలితాలు

పదో తరగతి మెమోల్లో గ్రేడుల స్థానంలో మళ్లీ మార్కులు కనిపించనున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ తీసుకున్న నిర్ణయానికి ప్రభుత్వం తాజాగా అనుమతి ఇచ్చింది. మార్చిలో జరిగిన పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలను బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు సీఎం రేవంత్ రెడ్డి రవీంద్రభారతిలో విడుదల చేయనున్నారు. కాగా, ఈ ఫలితాలకు సంబంధించిన మెమోల్లో మార్కులనే పేర్కొననున్నారు. అలాగే, 20 ఇంటర్నల్ మార్కులకూ ఇంతవరకూ గ్రేడింగ్ విధానమే ఉండగా.. దీని స్థానంలో మార్కులు ప్రకటించనున్నారు. కొత్త మెమో నమూనాను పాఠశాల విద్యా శాఖ మంగళవారం విడుదల చేసింది. ఈసారి సబ్జెక్టుల వారీగా మార్కులు ఇస్తామని అందులో అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థి ఫలితాలను పాస్, ఫెయిల్ అని స్పష్టంగా పేర్కొననున్నారు. అయితే, విద్యావేత్తలు, తల్లిదండ్రులు, విద్యా సంఘాలు ఎవరితోనూ సంప్రదించకుండా విద్యా శాఖ ఏకపక్షంగా, అనూహ్యంగా ఈ నిర్ణయం తీసుకుందనే విమర్శలు తీవ్ర స్థాయిలో వ్యక్తమవుతున్నాయి.

విద్యార్థులపై మార్కుల ఒత్తిడిని తగ్గించాలని విద్యావేత్తలు, మానసిక నిపుణులు కోరుతుంటే.. వారిపై మరింత ఒత్తిడిని పెంచే నిర్ణయాన్ని విద్యా శాఖ తీసుకోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. నిజానికి, విద్యార్థులపై మార్కుల ఒత్తిడిని తగ్గించాలన్న ఉద్దేశంతోనే దశాబ్దంన్నర కిందట ఉమ్మడి రాష్ట్రంలో మార్కుల విధానాన్ని తొలగించి గ్రేడింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. 2009-10 విద్యా సంవత్సరం నుంచి దీనిని అమల్లోకి తెచ్చారు. ఉదాహరణకు.. 91-100 మధ్యలో ఎన్ని మార్కులు వచ్చినా ఏ-1 గ్రేడ్ ఇచ్చేవారు. 81-90 మార్కులకు ఏ-2; 71-80కి బి-1, 61-70కి బి-2, 51-60 సి-1, 41-50 సి-2, 35-40 డి, 35 మార్కులు తగ్గితే గ్రేడ్-ఈ ఇచ్చేవారు. మొత్తం మార్కుల స్థానంలో సీజీపీఏ (క్యుములేటివ్ గ్రేడింగ్ పాయింట్ యావరేజ్) సైతం గ్రేడింగ్‌లోనే ప్రకటించేవారు. విద్యార్థులపై మానసిక ఒత్తిడి లేకుండా చేయడమే దీని ప్రధాన ఉద్దేశం. అప్పటి ప్రభుత్వం విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలు, తల్లిదండ్రులు, విద్యార్థులతో చర్చించి గ్రేడింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. అయితే, అకస్మాత్తుగా దీనిని తొలగిస్తూ విద్యా శాఖ నిర్ణయం తీసుకోవడం, ప్రభుత్వం అనుమతి ఇవ్వడం విద్యార్థులు, తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలను ఆశ్చర్యానికి గురిచేసింది. అసలు కొత్త విధానం ప్రారంభించడం వెనక ప్రభుత్వ ఉద్దేశం ఏమిటని నిలదీస్తున్నారు.




# ఆర్టీసీలో సమ్మె సైరన్

ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చినా నేటికి ఆ హామీ అమలు జరగలేదన్నారు.

2017 వేతన సవరణ జరిపినా ఉద్యోగులకు రావలసిన బకాయిలు నేటికీ చెల్లించలేదని, వేతన సవరణ పాక్షికంగానే జరిగిందని, కొత్త అలవెన్సులు అమలులోకి రాలేదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఫేమ్ పథకం ద్వారా ఆర్టీసీలకు ఎలక్ట్రిక్ బస్సులను అద్దె బస్సులుగా సరఫరా చేస్తోందని దీనివల్ల ఆర్టీసీ ఉనికికి ప్రమాదం ఏర్పడిందని తెలిపారు. ఈ ఎలక్ట్రిక్ బస్సులను ఆ పథకం ద్వారా ప్రత్యక్షంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్టీసీకి అందజేయాలని కోరారు. డ్రైవర్లు, కండక్టర్లు చిన్న చిన్న తప్పిదాలకు కూడా ఉద్యోగం పోగొట్టుకోవలసిన దుస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.

కార్మికులపై భారం : మహాలక్ష్మి పథకంలో జరుగుతున్న చిన్న చిన్న తప్పిదాలకు అనేకమంది కండక్టర్లు ఉద్యోగాలు పోగొట్టుకున్నారని తెలిపారు. బ్రీత్ ఎనలైజర్ టెస్ట్‌లో సాంకేతిక లోపాలున్న పరికరాన్ని పరీక్షలో ఉపయోగిస్తూ డ్రైవర్ల తప్పిదం లేకపోయినా ఉద్యోగాల నుంచి యాజమాన్యం తొలగిస్తోందన్నారు. 2014 నుంచి నేటివరకు సుమారు 17 వేల మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారని వారి స్థానంలో కొత్తవారిని నియమించకపోవటం వలన ఇప్పుడున్న కార్మికులపై అత్యధిక పనిభారం పడుతోందన్నారు. మహిళా కండక్టర్లు అర్ధరాత్రి డ్యూటీ దిగి ఇంటికి వెళ్లలేని పరిస్థితి : మహిళా కండక్టర్లు అర్ధరాత్రి డ్యూటీ దిగి ఇంటికి వెళ్లలేని పరిస్థితులు ఏర్పడ్డాయని వెల్లడించారు. యాజమాన్య, ప్రభుత్వం, లేబర్ కమిషనర్ స్పందించకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితులో సమ్మె జరపాలని నిర్ణయించామని తెలిపారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని ఉద్యోగులకు ఇచ్చిన హామీలపై చర్చలు జరపకపోతే మే 7వ తేదీ నుంచి సమ్మె తప్పదని వారు హెచ్చరించారు.

# కర్రెగుట్టలో కాల్పుల మోత

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లోని కర్రెగుట్ట అటవీప్రాంతంలో మావోయిస్టుల ఏరివేతకు భద్రతాబలగాలు జరుపుతున్న కాల్పులకు వన్యప్రాణులు విలవిల్లాడుతు న్నాయి.

కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో కాల్పుల మోతకు భయపడి వన్యప్రాణులు చెల్లాచెదరవుతూ గ్రామాల వైపు వస్తున్నాయని స్థానిక గ్రామాల ప్రజలు చెపుతున్నారు.

మావోయిస్టులను మట్టుబెట్టేందుకు కర్రెగుట్టల చుట్టూ వేల సంఖ్యలో భద్రతా బలగాలు చుట్టుముట్టాయని స్థానిక గ్రామాల ప్రజలు చెపుతున్నారు. ఇప్పటికే బాంబులమోతకు కొన్ని వనప్రాణులు మరణించి ఉంటాయని వారు అంచనా వేస్తున్నారు. కాగా వన్యె ప్రాణుల సంరక్షణ చట్టాలు ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కర్రెగుట్టల్లో మావోయిస్టుల ఏరివేతకు భద్రతా దళాలు మోహరించడాన్ని 300లకు పైగా సంస్థలు, ప్రజా సంఘాల నాయకులు ఖండించారు. కాల్పుల విరమణ పాటించాలని డిమాండ్ చేశారు. గిరిజనుల ఇబ్బందులను గుర్తుచేస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాకు లేఖను కూడా పంపారు. గత ఇరవై ఏళ్లలో మావోయిస్టులు, భద్రతా బలగాల పోరాటం కారణంగా గిరిజనులు ఎన్నో కోల్పోయారని పేర్కొన్నారు. గత 16 నెలల్లోనే 400 మంది మృతిచెందారని, వారిలో శిశువు కూడా ఉండటం బాధాకరమన్నారు. కాల్పు ల విరమణ పాటించాలని ప్రభుత్వాలను కోరారు. కాల్పివేత ప్రజాస్వామ్యానికి తీవ్రమైన ముప్పు అని ఎత్తిచూపారు.మావోయిస్టులను శాంతి చర్చలకు ఆహ్వానించాలని కోరారు. బస్తర్, జార్ఖండ్‌లో కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం ఎంవోయూ పొందిన ప్రభుత్వం మావోయిస్టుల అణిచివేతకు పాల్పడుతుందని ఆరోపించారు. శాంతి చర్చల కోసం, కాల్పుల విరమణ ద్వారా అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



## ఎన్డీఎస్ఏ నివేదికనే

# తప్పుపడతారా?

గత ప్రభుత్వ అక్రమాల వల్ల రాష్ట్ర ప్రతిష్ఠ దిగజారిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా సిగ్గు లేకుండా బీఆర్ఎస్ నాయకులు ఎన్డీఎస్ఏ నివేదికను తప్పుబడు తున్నారని విమర్శించారు. ఇప్పటికేనా చేసిన తప్పు ఒప్పుకుని క్షమాణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం కరెక్టు కాదని రిటైర్డ్ సీఈలు ఇచ్చిన నివేదికను బుట్టదాఖలు చేసి, ఒక పద్ధతి అనేది లేకుండా ప్రాజెక్టును నిర్మించారన్న ఎన్డీఎస్ఏ నివేదికను ఈ సందర్భంగా మంత్రి ఉటంకిం చారు. ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన 6 నెలల తర్వాత డీపీఆర్‌ను తయారు చేసినప్పటికీ కనీసం దాని ప్రకారం కూడా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టలేదని విమర్శించారు.

### కార్పొరేషన్ల పేరుతో అప్పులు

ప్రాజెక్టు నిర్మాణం కోసం రకరకాల కార్పొరేషన్ల పేరుతో బీఆర్ఎస్ పెద్దలు అప్పులు చేశారని, అదీ చాలదన్నట్టు ఎక్కువ వడ్డీకి స్వల్పకాలిక రుణాలను కూడా తీసుకున్నారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపిం చారు. గత ప్రభుత్వం చేసిన ఈ అప్పులకు తమ ప్రభుత్వం ఏటా రూ.16 వేలకోట్లను వడ్డీలుగా చెల్లిస్తోందన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో నేషనల్ డ్యాం సేఫ్టీ అధికారుల సూచనలను ఎక్కడా పాటించలేదని మంత్రి పేర్కొన్నారు. కనీసం సాయిల్ టెస్ట్ కూడా చేయకుండానే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను నిర్మించారని అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన మేడిగడ్డ వాళ్ల హయాంలోనే కూలిపోయిందని వివమర్శించారు. ప్రాజెకు ్టనిర్మాణం లోని లోపాలతో పాటు కనీస నిర్వహణ, మరమ్మతులు కూడా లేకపోవడం వల్లే బ్యారేజీ కుంగిపోయిందని నివేదిక స్ప ష్టం చేసిందన్నారు. బ్యారేజీ ముందు ఉన్న చెత్తాచెదారాన్ని కనీసం ప్రాజెక్టు ప్రారంభోత్సవం రోజున కూడా తొలగించలేదన్నారు. ఫలితంగా బ్యారేజీకి రంధ్రాలు పడి, ఫౌండేషన్ బలహీనపడిందన్నారు. బ్యారేజీ పూర్త యిన మొదటి ఏడాదిలోనే ఇంజినీర్లు లోపాలను గుర్తించినా గత ప్రభుత్వం పట్టించు కోలేదని ఆరోపించారు. ప్రాజెక్టుపై బీఆర్ఎస్ సర్కారు హయాంలోనే ఎన్డీఎస్ఏ ప్రాథమిక నివేదిక ఇచ్చిందన్నారు. ఆ నివేదికలో మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించిన లో పాలను స్పష్టంగా తెలిపిందన్నారు. అన్నా రం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ సీపేజీ సమస్య ఉందని ఆ నివేదిక బయటపెట్టిందన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై నిత్యం అసత్యాలు ప్రచారం చేస్తూ రాష్ట్ర ప్రజలను బీఆర్ఎస్ నాయకులు తప్పుదారి పట్టిస్తున్నారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. 16 లక్షల ఎకరాల ఆయకట్టకు నీళ్లు అందించాలనే ఉద్దేశంతో రూ.38వేల కోట్లతో తుమ్మిడిహట్టి ప్రాజెక్టు కోసం అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన కూడా చేశారని, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాణహిత చేవెళ్లకు జాతీయ హోదా ఇవ్వాలంటూ కేంద్రానికి లేఖ కూడా రాసిందని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. కానీ కేసీఆర్ చీఫ్ ఇంజినీర్ అవతారమెత్తి, ప్రాజెక్టును రీడిజైన్ చేశారని విమర్శించారు. దేశంలో 5700 బ్యారేజీలు, ప్రాజెక్టుల్లో ఏ సమస్య వచ్చినా ఎన్డీఎస్ఏ బృందం వెళ్లి పరిశీలించి నివేదిక ఇస్తుందని పేర్కొన్నారు. ఆ సంస్థలో జాతీయ, అంతర్జాతీయస్థాయి నిపుణులు ఉంటారని మంత్రి వెల్లడించారు. బీఆర్ఎస్ నేతల కంటే ఎన్డీఎస్ఏలో పనిచేసే వారికి కొంచెం ఎక్కువ జ్ఞానం ఉంటుందని తాము భావిస్తున్నామంటూ గత పాలకుల ను ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారు. నిర్మా ణ దశలో ఉన్న ప్రాజెక్టుల్లో సాధారణంగా కేవలం 2, 3 టీఎంసీల నీటిని మాత్రమే ని ల్వ చేస్తారని, అయితే తాము అద్భుతం చేశామని గొప్పలు చెప్పుకోవడానికి బీఆర్ఎస్ పాలకులు బ్యారేజీల్లో 14-15 టీఎంసీల నీ టిని నిల్వ చేశారని విమర్శించారు.

వర్షాలు వచ్చి ఎస్ఆర్ఎస్పీ స్టేజ్-2 కింద నీళ్లు అందుబాటులోకి వస్తే ఆ ఘనతను బీఆర్ఎస్ నాయకులు కాళ్వేశ్వరం ఖాతాలో వేసుకున్నారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం కుంగి పోయిన తర్వాత కూడా రాష్ట్రంలో 153 మెట్రిక్ టన్నుల వరి పండిందన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి రాష్ట్రంలో 280 లక్షల మెట్రిక్ టన్నుల వరి పండిందన్నారు. వరిసాగు గణనీయంగా పెంచేందుకు చర్యలు తీసుకున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎన్డీఎస్ఏ నివేదికపై క్యాబినెట్ లో చర్చిస్తామని.. ప్రాజెక్టు విషయంలో అధికారుల పొరపాటు ఉంటే వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే, అధికారులకు ఆదేశాలిచ్చిన వారిపైనా చట్టప్రకా రం చర్యలు తప్పవని మంత్రి స్పష్టం చేశారు.



### తొలుత సీతమ్మసాగర్‌కు అనుమతివ్వలేదు

సీతమ్మసాగర్ ప్రాజెక్టు కోసం తొలుత తాను కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖను సంప్రదిస్తే ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతి ఇవ్వలేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణలోపాలను సాకుగా చూపి, సీతమ్మసాగర్‌కు అనుమతులను నిరాకరించారని వెల్లడించారు. చివరకు సీడబ్ల్యూసీ నుంచి అనుమతులు వచ్చిన తర్వాత ప్రాజెక్ట్ నిర్మాణం కోసం కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ అనుమతలు ఇచ్చిం దన్నారు. గత పాలకులు ఢిల్లీలో రాష్ట్రం పరువు తీశారని మంత్రి అసహనం వ్యక్తం చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి కనీస భద్రతా ప్రమాణాలను పాటించలేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సుందిళ్ల, అన్నారం బ్యారేజీలను కట్టాల్సిన చోట కట్టలేదన్నారు. ఒక బ్యారేజీకి ఇంకో బ్యారేజీకి పొంతన లేకుండా నిర్మాణాలు చేపట్టారని విమర్శించారు. తుమ్మిడిహట్టి దగ్గర కూడా ప్రాజెక్టు నిర్మిస్తామని చెప్పి, గత ప్రభుత్వం పదేళ్లలో కనీసం తట్టెడు మట్టి కూడా ఎత్తిపోయలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. తుమ్మిడిహట్టి దగ్గర నీటి లభ్యత లేదనడం శుద్ధ అబద్ధమని పేర్కొన్నారు.

# హైకోర్టుకు ఐపీఎస్‌లు


సెలవుల తర్వాతకు వాయిదా వేసింది. కాగా భూదాన్ భూముల వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం సోదాలు నిర్వహిం చింది. ఐదు ప్రాంతాల్లో జరిపిన సోదాల్లో భారీ సంఖ్యలో కార్లు గుర్తించారు. పెద్ద మొత్తంలో ఆస్తి పత్రాలు, కొంత నగదు స్వాధీనం చేసుకున్నారు.

రవి గుప్తా (ఐపీఎస్)- 16 గుంటలు, స్వాతి లక్రా (ఐపీఎస్)- 16 గుంటలు, సౌమ్య మిశ్రా (ఐపీఎస్)- 16 గుంటలు, మహేశ్ భగవత్ (ఐపీఎస్)- 16 గుంటలు, తరుణ్ జోషి (ఐపీఎస్)- 16 గుంటలు, రాజర్షి షా (ఐఏఎస్)- 8 గుం టలు, నవీన్ మిట్టల్ (ఐఏఎస్)- 20 గుంటలు, అజయ్ జైన్ (ఐఏఎస్)- 20 గుంటలు, రాహుల్ హెగ్డే (ఐపీఎస్)- 8 గుంటలు.

### ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు

రికార్డులను తారుమారు చేయడం సహా ప్రభుత్వ భూమిని అక్రమంగా విక్రయించిన ప్రైవేట్ వ్యక్తులు, ప్రభుత్వ అధికారులపై తెలంగాణ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. మహేశ్వరం మండలంలోని నాగారంలో ప్రభుత్వ భూమిని ఖాదేరునిస్సా తన పూర్వీకుల ఆస్తిగా తప్పుడు పత్రాలతో మార్పు చేసుకున్నట్టు దర్యాప్తులో తేలింది.

రికార్డులను మ్యుటేట్ చేశారని, ఆ భూమిని అనేక మంది మధ్యవర్తులతో కలిసి వివిధ సంస్థలకు విక్రయించారని స్పష్టం చేసింది. ఫలితంగా ఆ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించి ప్రైవేటుకు విక్రయించినట్టు తేలింది. ఖాదేరునిస్సా, మొహమ్మద్ మునావర్ ఖాన్, మొహమ్మద్ లతీఫ్ షర్ఫాన్, మొహమ్మద్ అక్తర్ షర్ఫాన్, సుకూర్‌లపై కేసు నమోదు చేసింది. రూ. 23 లక్షలు, 12వేల యూఏఈ దిరామ్ విదేశీ కరెన్సీకి సంబంధించిన నేరారోపణ పత్రాలతో పాటు మునావర్ ఖాన్ ఫామ్‌హౌజ్‌లో వింటేజ్ కార్లతో పాటు మరో 45 కార్లను స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ పేర్కొంది.



# మండుతున్న ఎండలు

రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మరింత ముదురుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడి భగభగలు మంటలు పుట్టిస్తున్నాయి. ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పలుచోట్ల మాత్రం సాయంత్రానికి మబ్బులు కమ్ముకుని వాతావరణం కాస్త చల్లబడుతోంది. మరో రెండు రోజులు వాతావరణం ఇదే తరహాలో ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మంగళవారం అత్యధికంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం గోదూర్‌లో 44.4 డి గ్రీలు, నిర్మల్ జిల్లా దస్తూరాబాద్‌లో 44.3 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లోని చాలా ప్రాంతాల్లో 43 డిగ్రీలకుపైగా.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చాలా చోట్ల 41 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా జిల్లాల్లోనూ 40 డిగ్రీలకుపైగానే ఉన్నాయి.

వడదెబ్బతో పెరుగుతున్న మరణాలు

మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఐదుగురు వడదెబ్బకు బలయ్యారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కస్తూరీనగరానికి చెందిన రైతు కేలోత్ రంగ్యా (52) మంగళవారం పొద్దంతా పొలం పనులు చేయడంతో వడదెబ్బకు గురై మృతి చెందాడు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం నందనం గ్రామంలో ఇల్లిల్లూ తిరుగుతూ కూరగాయలు అమ్మే యాకర సాలమ్మ (65), సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం గట్టికల్‌లో ఉపాధి పనులు చేస్తూ వడదెబ్బకు గురైన తలారి నర్సయ్య (59), నిజామాబాద్ జిల్లా వర్ని మండలం జలాల్‌పూర్‌కు చెందిన వ్యవసాయ కూలీ ఏసిక అర్చన (53), ఖమ్మం జిల్లా మణుగూరు మండలం దమ్మక్కపేటకు చెందిన బిల్లా మంగమ్మ (78) వడదెబ్బకు గురై మృతిచెందారు.


## ఎన్డీఎస్ఏ కాదు..

# ఎన్డీఏ నివేదిక

ఆయనకే చెల్లుతుందని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు డయాఫ్రంవాల్, గైడ్‌వాల్ కుప్పకూలి నాలుగైదేళ్లు గడిచినా ఎన్డీఎస్ఏ ఎందుకు అక్కడ సందర్శించలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కయ్యాయ ని హరీశ్‌రావు ఆరోపించారు.

తుమ్మిడిహట్టి కోసం అనుమతులను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు తీసుకురాలేదని, మహారాష్ట్రతో ఎందుకు ఒప్పందం చేసుకోలేదని ప్రశ్నించారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టును నిర్మించిందుకు తమ ప్రభుత్వం మహారాష్ట్రతో చర్చలు జరిపితే, అక్కడ నీళ్లు లేవని సీడబ్ల్యూసీ చెప్పిందన్నారు.

అలాగే కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్ సూచన మేరకే మేడిగడ్డ వద్ద బ్యారేజీని నిర్మించినట్టు వెల్లడించారు. ప్రాజెక్టును అక్కడ నిర్మించడం వల్ల ప్రాజెక్టు సామర్థ్యం 16 టీఎంసీల నుం చి 140 టీఎంసీలకు పెరిగిందన్నారు. ఆయకట్టు, నీటి నిల్వ సామర్థ్యం పెరిగినందునే వ్యయం కూడా పెరిగిందని పేర్కొన్నారు.




### ఆ ప్రాజెక్టులకు డీపీఆర్‌లు ఉన్నాయా?

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కొడంగల్, నారాయణపేట ప్రాజెక్టులకు డీపీఆర్‌లు ఉన్నాయా? అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆ ప్రాజె క్టులకు డీపీఆర్, అనుమతులు లేకున్నా టెం డర్లు పిలిచారని ఆరోపించారు. ప్రాజెక్టుల విషయంలో మీకో నీతి మాకో నీతా? అని ప్రశ్నించారు. తాము తప్పు చేస్తే కేంద్ర సంస్థలు ఎందుకు అప్పు ఇచ్చేవని ప్రశ్నించారు.

నందికొండ నుంచి నాగార్జున సాగర్ పాజెక్టు చోటు మారిందన్నారు. అలాగే కుస్తాపురంలో నిర్మించాల్సిన ఎస్సారెస్పీ ప్రాజెక్టు పోచంపాడుకు మారిన విషయాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గుర్తు తెచ్చుకోవాలన్నారు. కాళేశ్వరం అంటే ఒక్క మేడిగడ్డ మాత్రమే కాదని హరీశ్‌రావు పేర్కొన్నారు.

ఈ ప్రాజెక్టు కింద మూడు బ్యారేజ్‌లు, 19 సబ్ స్టేషన్లు, 21 పంపు హౌజ్‌లు, 16 రిజర్వాయర్లు, 203 కిలోమీటర్ల టన్నెల్, 231 కిలోమీటర్ల గ్రావిటీకెనాల్, కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్‌లు ఉన్నాయన్నారు. ఐదుగురు సభ్యుల కమిటీ మేడిగడ్డ వద్ద నుంచి నేరుగా మిడ్ మానేరుకు నీటి తరలించడం సాధ్యం కాదని చెప్పడం వల్ల అన్నారం, సుందిళ్ల నుంచి ఎల్లంపల్లికి నీళ్లు తెచ్చామన్నారు.

వర్షాకాలంలో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండితే కేవలం 53 లక్షల మెట్రిక్ టన్నులే ఎందుకు కొన్నారని హరీశ్‌రావు ప్రశ్నించారు. మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాకు తప్ప మిగితా ప్రాజెక్టు అంతా బాగుందని, దాన్ని త్వరగా రిపేర్ చేయాలని ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాం డ్ చేశారు. కాళేశ్వరానికి 90వేల కోట్లే ఖర్చు అయిందని, మంత్రి ఉత్తమ్ మాత్రం రూ. లక్షకోట్లు ఖర్చు చేశారంటూ అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

# అభివృద్ధి పథంలో కశ్మీర్

హైదరాబాద్: ఆర్టికల్ 317 తొలగించిన తర్వా త జమ్ము కశ్మీర్ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతోందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తెలిపారు. కశ్మీర్‌లో పోలీసులపై రాళ్లు రువ్వడం వంటి ఘటనలు తగ్గాయని, శాంతిసామరస్యం ఏర్పడిందన్నారు.

అయితే ఇది పాకిస్థాన్‌కు కంటగింపుగా మారిందని, అందుకే మళ్లీ రెచ్చగొడుతోందని మండిపడ్డారు. జమ్ము కశ్మీర్‌లో 75 సంవత్సరాల తర్వాత బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం అమలవుతోందని, భారతదేశంలో జమ్ము కశ్మీర్ అంతర్భాగంగా ప్రపంచమంతా అంగీకరిస్తోందని, అయి తే, ఇది మన దేశంలోని కొన్ని అంతర్గత శక్తులకు ఇష్టంలేదని తెలిపారు. జమ్ము కశ్మీర్ మాదేనంటూ మాట్లాడుతున్న పాకిస్థాన్‌కు కూడా ఇది ఇష్టం లేదన్నా రు.

అందుకే, భారతదేశంలో శాంతిని, సామరస్యాన్ని దెబ్బతీసేలా ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూపీఏ హయాంలో దేశంలో అనేక ప్రాం తాల్లో బాంబు పేలుళ్లు, కర్ఫ్యూలు, మతకల్లోహాలు, ఉగ్రవాద సంబంధిత కార్యక్రమా లు జరిగేవని విమర్శించారు. నరేంద్ర మో దీ ప్రధానమంత్రి అయ్యాక జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని అరికట్టే ప్రయత్నం చేశారని చెప్పారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్ రెడ్డి అధ్యక్షతన పార్టీ రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావే శానికి ముఖ్య అతిథిగా బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి సునిల్ బన్సల్ హాజరయ్యారు. హైదరాబాద్‌లోని లుంబినీ పార్కు లో, కోఠిలోని గోకుల్ చాట్‌లో, దిల్‌షుఖ్‌నగర్ కూడా బాంబు పేలుళ్ల ఘటనలు జరిగా యని ఆయన గుర్తు చేశారు.

నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టెర్రరిజంపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని అవలం భిస్తూ ఉగ్రవాదాన్ని అరికట్టే ప్రయత్నం చేస్తోందని పేర్కొన్నారు. పాకిస్తాన్‌లోని అంతర్గత సమస్యలను ఎదుర్కోలేక, దేశ ప్రజలకు తిండి, ఉపాధి కల్పించలేక, దృష్టిని మరల్చడానికి జమ్మూ మరోసారి బాంబుదాడులను ప్రేరేపించేందుకు కుట్ర లు చేస్తున్నదని మండిపడ్డారు.

ఇటీవల ప హల్గాంలో అమాయక హిందువులను



వా రి కుటుంబ సభ్యుల ఎదుటే.. అతికిరాతకంగా ఉగ్రవాదులు కాల్చిచంపారని, దీనికి నిరసనగా భారతదేశ ప్రజలే కాకుండా ప్రపంచ దేశాలు పహల్గాం ఉగ్రవాద ఘటనను ఖం డించాయన్నారు. ఉగ్రవాద దాడికి సంబంధించి బాధితులకు న్యాయం చేసేలా, దోషు లను శిక్షించేలా చర్యలు తీసుకుంటామని స్వ యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారన్నారు.

ఈ నేపథ్యంలో మనమంతా దేశ ప్రజలందరినీ సంఘటితం చేసి ఉగ్రవాదానికి, రక్తపాతానికి వ్యతిరేకంగా ప్రజల మ ద్దతు కూడగట్టి దేశంలో శాంతి, సామరస్యం తో ఉండేలా ముందుకెళ్లాలని నేతలకు సూ చించారు. గ్రామగ్రామన ప్రజలందరూ రాజకీయాలు, కులాలకతీంగా ఏకమై పహల్గాం లో జరిగిన ఉగ్రవాద ఘటనకు వ్యతిరేకంగా స్పందిస్తున్నారని తెలిపారు.

ఇదిలా ఉంటే, మొన్న జరిగిన హైదరాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా మ జ్లిస్ పార్టీని ఎదుర్కొనే ఘనత బిజెపికే ఉంద ని స్పష్టమైన సంకేతం తెలంగాణ ప్రజలకు, హైదరాబాద్ నగర ప్రజలకు బీజేపీ పార్టీ ఇ చ్చిందని ఆయన తెలిపారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీకి, భారతీయ జనతా పార్టీ మధ్య ప్రధాన పోటీ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఈ సమావేశంలో పహల్గాం ఉగ్రవాద సంఘటనకు వ్యతిరేకంగా తీర్మానం ఆమోదించారు.

# ఆర్మీకి ఫ్రీ హ్యాండ్

చూస్తున్న వేళ జమ్మూకశ్మీర్‌లో ప్రస్తుత పరిస్థితుల గురించి రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోమవారం ప్రధాని నరేంద్ర మోదీకి వివరించారు. తాజాగా ప్రధాని మోదీ నిర్వహించిన మన్‌కీబాత్‌లో కూ డా ఉగ్రవాదులను తీవ్రంగా హెచ్చరించారు. ఉగ్రదాడి నిందితులు, ఉగ్రదాడి వెనకున్నవారికి కఠిన శిక్ష విధిస్తామన్నారు. 140 కోట్ల మంది భారతీయులు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నారు.
ఉగ్రదాడి బాధితులకు తప్పకుండా న్యాయం చేస్తామని ప్రధాని హామీనిచ్చారు. ఈ భేటీకి ముందు యూనియన్ హోమ్ సెక్రటరీ గోవింద్ మోహన్ పారామిలటరీ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

# తప్పేంటి?

దేశ భద్రత, సార్వభౌమత్వానికి సంబంధించిన నివేదికను బహిర్గతం చేయడం సరికాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అనంతరం కేసు తదుపరి విచారణను జూలై 30కి వాయిదా వేసింది.

**ఏంటీ పెగాసస్ దుమారం?**

ఇజ్రాయెల్‌కు చెందిన ఎన్‌ఎస్‌వో గ్రూప్ అనే సంస్థ 'పెగాసస్' స్పైవేర్‌ని తయారు చేసింది. నిఘా కార్యకలాపాల కోసం ఈ స్పైవేర్‌ను ఎన్‌ఎస్‌వో పలు ప్రభుత్వాలు, ప్రభుత్వ అధీనంలో పనిచేసే సంస్థలకు అమ్ముతుంటుంది. అయితే, ఈ పెగాసస్‌ను ఉపయోగించి పాత్రికేయులు, పౌరసమాజ ప్రముఖుల ఫోన్లను హ్యాక్ చేశారంటూ 2021లో ఓ అంతర్జాతీయ పత్రిక సంచలన కథనాన్ని ప్రచురించింది. భారత్ నుంచి రాజకీయ ప్రముఖులు సహా 300 మంది ఫోన్లు హ్యాక్ అయినట్లు పేర్కొంది. అయితే, ఈ వివాదం దేశ రాజకీయాలను కుదిపేయడంతో దీనిపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే పెగాసస్‌పై విచారణకు ఆదేశించిన సుప్రీం కోర్టు ముగ్గురు సభ్యులతో స్వతంత్ర నిపుణుల కమిటీని నియమించి నివేదికను రూపొందించింది.

# సంధ్య థియేటర్ తొక్కిసలాట బాధితుడు శ్రీతేజ్ డిశ్చార్జ్

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో తీవ్రంగా గాయపడ్డ బాలుడు శ్రీతేజ్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి నుంచి బాలుడు శ్రీతేజ్‌ను వైద్యులు డిశ్చార్జ్ చేశారు. గతేడాది డిసెంబర్ 4న పుష్ప 2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో శ్రీతేజ్ గాయపడ్డాడు.
ఆ రోజు నుంచి (146 రోజులు) 4 నెలల 25 రోజుల పాటు శ్రీతేజ్ ఆస్పత్రిలోనే ఉన్నాడు. ఆ రోజు జరిగిన తొక్కిసలాటలో అతని తల్లి రేవతి చనిపోయింది. ప్రస్తుతం శ్రీతేజ్ మాట్లాడలేకపోయినా అతని ఆరోగ్యం నిలకడగా ఉన్నందున డిశ్చార్జ్ చేసినట్లు కిమ్స్ వైద్యులు తెలిపారు. అయితే శ్రీతేజ్‌ను ఇంటికి కాకుండా రిహాబిలిటేషన్ కేంద్రానికి తరలించారు. అక్కడ 15 రోజుల పాటు ఫిజియోథెరపీ చేయించిన తరువాత ఇంటికి తీసుకెళ్లొచ్చని వైద్యులు తెలిపారు.
శ్రీతేజ్ ఐదు నెలలుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గత 15 రోజుల నుంచి ఐసీయూ నుంచి రూమ్‌కి షిఫ్ట్ చేశారు. బాబు ఆరోగ్య పరిస్థితి కొంచెం ఇన్ఫెక్షన్లు లేకుండా నిలకడగా ఉంది. వైద్యులు రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించాలని సూచించారు. ఆ తర్వాత ఇంటికి తీసుకెళ్లొచ్చని తెలిపారు. ఇప్పుడు కళ్లు తెరిచి చూస్తున్నాడు. ద్రవరూపంలో ఉన్న ఆహారం మాత్రమే పంపిస్తున్నాం. బ్రెయిన్ అయితే ఇంకా రికవరీ కాలేదు. మమ్మల్ని గుర్తు పట్టడంలేదు. ఆస్పత్రిలో ఎన్ని రోజులు ఉన్నా ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంటుందని.. రిహాబిలిటేషన్‌కు తీసుకెళ్తే కొంత మెరుగుపడొచ్చని వైద్యులు సూచించారు. ఎప్పటికీ జాగ్రత్తగా చూసుకోవాల్సి ఉంటుంది.
పుష్ప- 2 చిత్రం యాజమాన్యం, సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వం నుంచి మాకు బాగా మద్దతు లభించింది. బాబు ఆస్పత్రిలో చేరిన రెండో రోజు నుంచే మాకు సపోర్టు అందింది. ఇప్పటికీ మమ్మల్ని వైద్యులు, కిమ్స్ యాజమాన్యం డబ్బులు అడగలేదు. డిశ్చార్జి సమయంలో ఏమీ బలవంతం చేయలేదు. శ్రీతేజ్ చెల్లెలు అమ్మ ఏది? అని అడుగుతోంది. ఊరెళ్లిందని చెబుతున్నాం. బాబుని చూసేందుకు పాపను ఆస్పత్రికి తీసుకెళ్లినప్పుడు.. తను మాట్లాడుతున్నా శ్రీతేజ్ స్పందించడం లేదు. మాకు సపోర్టు చేసిన అందరికీ కృతజ్ఞతలు'' అని అన్నారు.

# ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయండి

హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'ను వెంటనే నిలిపివేయాలని మంత్రి ధనసరి సీతక్క డిమాండ్ చేశారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో నెలకొన్న ఉద్రిక్త వాతావరణాన్ని నిలువరించేలా చొరవ చూపాలని కోరారు. భారత్ బచావో ప్రతినిధులు డాక్టర్ ఎమ్ఎఫ్ గోపీనాథ్, గాదె ఇన్నయ్య, జంజర్ల రమేషబాబు మంగళవారం ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కను కలిశారు. వేల సంఖ్యలో కేంద్ర భద్రతా బలగాలు కర్రెగుట్టల్లో సంచరిస్తుండడంతో ఆదివాసీలు భయాందోళనలకు లోనవుతున్నారని, మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరిపేలా చూడాలని సీతక్కకు విన్నవించారు. దీనిపై మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారు. 'కేంద్ర బలగాల మోహరింపుతో అడవిబిడ్డలు తీవ్ర భయాందోళనలకు లోనవుతున్నారు. బలప్రయోగంతో కాకుండా, చర్చల ద్వారా సమస్య పరిష్కారమయ్యేలా కేంద్రం వ్యవహరించాలని ఓ ఆదివాసీ బిడ్డగా కోరుతున్నాను. ఆ జాతి బిడ్డగా వారికి అండగా నిలుస్తాను. ఆదివాసీల హక్కులు ఎవరూ కాలరాయొద్దు' అని కేంద్రానికి సూచించారు. మావోయిస్టులతో బేషరతుగా శాంతి చర్చలు జరపాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఆదివాసీ జాతిని అంతమొందించేందుకు చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని కోరాయి. మంగళవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వామపక్ష నేతలు మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మే 2వ తేదీన హైదరాబాద్‌లో సదస్సు నిర్వహిస్తున్నామని, ఇందులో శాంతి చర్చల కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు. సమావేశంలో సీపీఎం నుంచి జూలకంటి రంగారెడ్డి, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నుంచి వేములపల్లి వెంకట్రామయ్య, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నుంచి కేజీ రాంచందర్, ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సీపీఐ (ఎంఎల్) నుంచి ప్రసాదన్న, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నుంచి రమేశ్ రాజా, ఎస్‌యూసీఐ నుంచి మురహరి, ఫార్వర్డ్ బ్లాక్ నుంచి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
ఛత్తీస్‌గఢ్‌లోని కర్రెగుట్టల్లో నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని దళిత, గిరిజన, ఆదివాసీ ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కర్రెగుట్టల్లో కేంద్ర బలగాలను వెనక్కి మళ్లించాలంటూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ సిద్ధబోయిన లక్ష్మీనారాయణ, కో-కన్వీనర్లు జైసింగ్ రాథోడ్, సోమా రామ్మూర్తి మాట్లాడారు. ఆదివాసీలపై జరుగుతున్న దాడిని ఆపేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.
కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి శాంతి చర్చలకు ముందుకు రావాలని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ సూచించారు. మహబూబాబాద్‌లో జాతీయ మాలమహానాడు (జేఎంఎం) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ సదస్సులో ఆయన మాట్లాడారు. సదస్సులో టీజీవో రాష్ట్ర నాయకుడు హరికోట్ల రవి, జేఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగని పాక్ కాల్పులు



జమ్మూకశ్మీర్‌లో మరిన్ని ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని ఇంటలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. పహల్గాం ఉగ్రదాడి అనంతరం కశ్మీర్‌లో స్లీపర్ సెల్స్ యాక్టివేట్ అయినట్టు తెలిపింది. దీంతో ముందు జాగ్రత్తగా జమ్మూలోని 87 పర్యాటక ప్రాంతాలకు గానూ 48 ప్రదేశాలను మూసివేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.
పర్యాటకులే లక్ష్యంగా రాబోయే రోజుల్లో మరిన్ని దాడులకు ముష్కరులు పథకం రచిస్తున్నారని తమకు సమాచారం అందిందని నిఘా వర్గాలు తెలిపాయి. పర్యాటక ప్రాంతాలను మూసివేయడంతో పాటు భద్రతను కట్టుదిట్టం చేశారు. పర్యాటకులు మాత్రమే కాకుండా స్థానిక ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే భద్రతా బలగాలకు సమాచారం ఇవ్వాలని సూచించారు.
శ్రీనగర్, గందేర్‌బాల్ జిల్లాల్లోని సీఐడీకి చెందిన వ్యక్తులు, కశ్మీరి పండిట్లు, పర్యాటకులను పాక్‌కు చెందిన ఐఎస్ఐ లక్ష్యంగా చేసుకుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. విశ్వసనీయ వర్గాల మేరకు ఉగ్రవాదులు ఉత్తర, మధ్య, దక్షిణ కశ్మీర్‌లో మరిన్ని దాడులు చేసి పెద్ద మొత్తంలో రక్తపాతం సృష్టించాలని చూస్తున్నారు. ప్రస్తుతం పహల్గాం దాడితో సంబంధమున్న ఉగ్రవాదుల ఇండ్లను సైన్యం కూలుస్తోంది.
ఈ కూల్చివేతలకు ప్రతీకారం తీర్చుకోవాలని కూడా ఉగ్రమూకలు భావిస్తున్నాయని సమాచారం. లోయలో ఉండే స్థానికేతర రైల్వే సిబ్బందిపై, రైల్వే ఆస్తులపై ఉగ్రవాదులు దాడులు చేయొచ్చని కూడా హెచ్చరికలు చేశారు. రైల్వే సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ఏజెన్సీలు తెలిపాయి. సున్నిత పర్యాటక ప్రాంతాలైన గుల్‌మార్గ్, సోనామార్గ్, ధాల్ సరస్సు తదితర ప్రాంతాల్లో పోలీసులు భద్రతను మరింత పెంచారు.
పోలీసులతో పాటు భద్రతా బలగాలు కూడా అక్కడ మోహరించాయి. దూశ్‌పత్రి, కోకెర్నాగ్, అచ్చాబల్, బాంగస్ లోయ, తోసా మైదాన్, ఆస్తాన్‌పోర, కౌసరాంగ్, దూద్‌పత్రి, రింగావళి తంగ్‌మార్గ్, హబ్బా కథూన్ పాయింట్, కన్వర్ మొదలైన పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేశారు.

**కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు**

పాక్ ఆర్మీ సరిహద్దు వెంట కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడుస్తూనే ఉంది. సోమవారం రాత్రి కూడా జమ్మూలోని కుప్వారా, బారాముల్లా జిల్లాల్లో నియంత్రణ రేఖ వెంబడి పాక్ ఆర్మీ కాల్పులు జరిపినట్టు అధికారులు ప్రకటించారు. అయితే పాక్‌సైన్యం కాల్పులకు భారత ఆర్మీ దీటుగా బదులిచ్చిందని వారు పేర్కొన్నారు. నియంత్రణ రేఖ వెంబడి పాక్ సైన్యం కాల్పులు జరపడం ఇది వరుసగా ఐదో రోజు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాక్ వరుసగా కాల్పులు జరుపుతూనే ఉంది.
భారత్ వైమానిక దాడులు చేయొచ్చని భయపడుతున్న పాకిస్థాన్ తన వద్దనున్న రాడార్ వ్యవస్థలను సియాల్‌కోట్ ప్రాంతానికి తరలిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే సరిహద్దు వెంట భద్రతను కట్టుదిట్టం చేసిన పాక్.. ఇప్పుడు రాడార్ వ్యవస్థల్ని కూడా తరలిస్తోందని వార్తలు వస్తున్నాయి. అంతర్జాతీయ సరిహద్దుకు 58 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖోర్ కంటోన్మెంట్ వద్ద టీపీఎస్ రాడార్ సైట్‌ను దాయాది దేశం ఏర్పాటు చేసింది. భారత్ తమపై ఏ క్షణమైనా దాడి చేయొచ్చని పాక్ రక్షణ శాఖ మంత్రి ఖ్వాజా అసిఫ్ ఇప్పటికే వ్యాఖ్యానించారు.
పాకిస్థాన్‌కు అనుకూలంగా మాట్లాడే వారిపై ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలా మాట్లాడాలనుకుంటే పాక్‌కు వెళ్లి మాట్లాడాలని సూచించారు. మంగళగిరిలో ఆయన మాట్లాడారు. 'కశ్మీర్ భారత్‌లో భాగం. ఓట్లు, సీట్ల కోసం ఇటువంటి విషయాలు మాట్లాడకూడదు.
కావలికి చెందిన మధుసూదన్ రావు కుటుంబానికి జనసేన తరఫున 50 లక్షల ఆర్థిక సాయం ప్రకటిస్తున్నా. ఉగ్రదాడిలో మరణించిన మధుసూదన్ రావు ఎవరికి హాని చేశారు? ఉగ్రవాదులు మతప్రాదిపదికన 26 మంది పర్యాటకుల్ని చంపారు. మన హిందువులకు ఇదొక్కటే దేశం. యుద్ధ పరిస్థితులు వచ్చినా సిద్ధంగా ఉండాలి. మత కలహాలు సృష్టించే వారిపై అప్రమత్తంగా ఉండాలి' అని పేర్కొన్నారు.
ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) సమావేశం కానుంది. ఇది వరకే ఒకసారి భేటీ అయిన కమిటీ బుధవారం మరోసారి భేటీ అవనుంది. ఇప్పటికే భారత చర్యలతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. నేడు జరిగే భేటీలో ఎటువంటి నిర్ణయాలు ఉంటాయో..

**ఆ ఉగ్రవాది పాక్ మాజీ పారా కమాండోనే!**

పహల్గాం ఉగ్రదాడిలో పాల్గొన్నట్టు అనుమానిస్తున్న నలుగురు వ్యక్తుల్లో ఒకడైన షహీమ్ మూసా పాక్ సైన్యంలో మాజీ పారా కమాండో అని అధికారుల దర్యాప్తులో తేలింది. పాక్‌కు చెందిన లష్కరే తోయిబాతో కలిసి మూసా పని చేస్తున్నట్టు దర్యాప్తు బృందాలు వెల్లడించాయి. పహల్గాం ఉగ్రదాడికి అతడే మాస్టర్ మైండ్‌గా దర్యాప్తు బృందాలు అనుమానిస్తున్నాయి.
పారా మిలటరీలో పని చేసిన మూసా కోవర్ట్ ఆపరేషన్లు చేయడంతో పాటు అత్యాధునిక ఆయుధాలు వినియోగించడంలో మంచి దిట్ట. ఎటువంటి ఆయుధాలు లేకుండా తలపడటంలో కూడా మూసా శిక్షణ పొందాడు. 2023లోనే మూసా భారత్‌లోకి ప్రవేశించి ఉంటాడని దర్యాప్తు బృందాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్న వందలాది మందిలో 15 మంది ఉగ్రవాద ఓవర్ గ్రౌండ్ వర్కర్స్ మూసాకు ఉన్న సైనిక నేపథ్యం ధ్రువీకరించినట్టు అధికారులు తెలిపారు. మూసా పాక్ స్పెషల్ సర్వీస్ గ్రూప్ నుంచి లష్కరే తోయిబాలోకి సహాయకారిగా వచ్చినట్టు తెలుస్తోందని ఓ అధికారి వెల్లడించారు. మూసా ఇప్పటికే మూడు దాడుల్లో పాల్గొన్నట్టు సమాచారం.

# హజ్ యాత్ర షురూ..

ముస్లింల పవిత్ర హజ్ యాత్రకు యాత్రికుల రాక ప్రారంభమైంది. భారత్ నుంచి యాత్రికులతో తొలి విమానం మంగళవారం తెల్లవారుజామున సౌదీ అరేబియాలోని పుణ్యక్షేత్రం మదీనాకు చేరుకుంది. యాత్రికులకు ఇక్కడి భారత రాయబారి సుహేల్ ఎజ్‌ఖాన్, కాన్సుల్ జనరల్ ఫహద్‌ఖాన్ సూరీ, ఇతర అధికారులు స్వాగతం పలికారు. హైదరాబాద్ నుంచి బయలుదేరిన ఈ విమానంలో 260 మంది యాత్రికులు వచ్చారు. వీరిలో ఆంధ్రప్రదేశ్‌లోని కడప నగరానికి చెందిన ప్రముఖ ఇస్లామిక్ పండితుడు అహ్మద్ షమియా సహా అనేక మంది తెలుగు రాష్ట్రాలకు చెందిన యాత్రికులు ఉన్నారు.
కాగా, హజ్ యాత్ర కోసం హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా యాత్రికులను ప్రత్యేక విమానాలు మే 30వ తేదీ వరకు సౌదీ అరేబియాకు తీసుకొస్తాయి. ఈ నెల రోజుల్లో హైదరాబాద్ విమానాశ్రయం నుంచి మొత్తం 12 వేల మంది యాత్రికులు హజ్ యాత్రకు రానుండగా, వారిలో 8వేల మంది తెలంగాణ వారు, 1200 మంది ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు ఉండనున్నారు. మిగిలిన వారు ఇతర రాష్ట్రాలకు చెందినవారు రానున్నారు. మొత్తంగా ఈ ఏడాది భారత్ నుంచి లక్షా 30 వేల మంది యాత్రికులు హజ్ యాత్రకు వస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యాత్రికులు హైదరాబాద్‌తోపాటు బెంగళూరు విమానాశ్రయం నుంచి సౌదీ అరేబియాకు చేరుకుంటారు.

# ఈ డిజిటల్ సేవలు అందుబాటులోకి

హైదరాబాద్: కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ అభివృద్ధి చేసిన 'సారథి', 'వాహన్' డిజిటల్ సేవలు ఇక రాష్ట్ర ప్రజలకూ అందుబాటులోకి రానున్నాయి. దేశవ్యాప్తంగా రవాణా శాఖ సేవలు ఒకే గొడుగు కిందకు తీసుకురావడం ఈ సేవల వెనుక ఉద్దేశం. ఈ డిజిటల్ సేవల ద్వారా ప్రజలు తమ వాహనానికి సంబంధించిన, డ్రైవింగ్ లైసెన్స్‌కు సంబంధించిన సమాచారాన్ని ఎక్కడి నుంచైనా తెలుసుకునే అవకాశం ఉంటుంది. 'సారథి' అప్లికేషన్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ సికింద్రాబాద్ ఆర్టీవో కార్యాలయంలో పైలట్ ప్రాజెక్టుగా బుధవారం ప్రారంభించనున్నారు. 'వాహన్' సేవలను రాష్ట్రంలో వచ్చే ఆగస్టు నుంచి అమల్లోకి తెచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.
'సారథి' అప్లికేషన్‌తో డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణ, చిరునామా మార్పు, కొత్త వాహన కేటగిరి చేర్పు తదితర సేవలను దేశంలో ఎక్కడినుంచైనా పొందొచ్చు. సారథి అప్లికేషన్ అమలుతో డ్రైవింగ్ లైసెన్సులు కేంద్రం ఆధ్వర్యంలో నడిచే డీజీ లాకర్ ప్లాట్‌ఫాం ప్రయోజనాలను పొందగలుగుతున్నారు. డీజీ లాకర్ ద్వారా అధికారిక డాక్యుమెంట్లను, డ్రైవింగ్ లైసెన్సులను డిజిటల్ ఫార్మాట్‌లో భద్రపరచి అవసరమైనపుడు పొందొచ్చు. ఇతర దేశాలకు వెళ్లినప్పుడు.. డ్రైవింగ్ లైసెన్స్ లేదా ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్ అసలైనదేనని ఆయా దేశాధికారులు ధ్రువీకరించుకోవడం 'సారథి' ద్వారా సులభం అవుతుంది. ఇతర దేశాల్లో తాత్కాలికంగా నివసించే భారతీయులు వారి ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్ గడువు ముగిసినప్పుడు, భారత రాయబార కార్యాలయలో సారథి అప్లికేషన్ ద్వారా అక్కడే కొత్త పర్మిట్ (ఐడీపీ) కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

# పాక్ సైబర్ మూకలు ఫెయిల్

పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ మరింతగా బరి తెగించింది. ఓ వైపు సరిహద్దు నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) వెంట నిరంతరాయంగా కాల్పులకు తెగబడుతున్న పాక్, మరోవైపు భారత్ సైన్యానికి చెందిన డిజిటల్ వేదికలపై సైబర్ దాడులు చేయిస్తోంది. భారత సైన్యానికి చెందిన జాతీయ స్థాయి పోర్టల్స్‌ను హ్యాక్ చేయడం అసాధ్యమని గుర్తించిన పాక్ సైబర్ మూకలు సైన్యం సంక్షేమ సంస్థలు, విద్యాసంస్థలకు చెందిన వెబ్‌సైట్లపైకి తెగబడుతున్నారు.
ఇంటర్నెట్ ఆఫ్ ఖిలాఫా హ్యాకర్) అనే పేరు కలిగిన హ్యాకింగ్ గ్రూపు ఈ సైబర్ దాడులను చేస్తోందని భారత ఆర్మీ వర్గాలు గుర్తించాయి. ఆర్మీ పబ్లిక్ స్కూల్ శ్రీనగర్, ఆర్మీ పబ్లిక్ స్కూల్ రాణీఖేత్, ఆర్మీ వెల్ఫేర్ హౌసింగ్ ఆర్గనైజేషన్, భారత వైమానిక దళం ప్లేస్‌మెంట్ ఆర్గనైజేషన్ పోర్టల్‌లను IOK హ్యాకర్ గ్రూప్ హ్యాక్ చేసింది. అయితే భారతదేశపు లేయర్డ్ సైబర్ సెక్యూరిటీ ఆర్కిటెక్చర్ వెంటనే ఈ హ్యాకింగ్ వ్యవహారాలను గుర్తించింది. హ్యాకర్లు పాకిస్థాన్ కేంద్రంగానే ఈ ఆగడాలకు పాల్పడుతున్నట్లు తెలుసుకుంది.

**సమాచారాన్ని మాయం చేసేందుకు**

ఈ నాలుగు వెబ్‌సైట్ల హ్యాకింగ్ ఘటనలను అడ్డుకొని వాటికి సంబంధించిన సమాచారాన్ని పునరుద్ధరించే చర్యలు చేపట్టారు. ఆ నాలుగు వెబ్‌సైట్లలోని పేజీలలో ఉన్న సమాచారాన్ని మాయం చేసేందుకు, వాటి సేవలకు అంతరాయం కలిగించడానికి, వ్యక్తిగత సమాచారాన్ని సేకరించడానికి పాక్ సైబర్ మూకలు విఫలయత్నం చేశారు.
ఈ హ్యాకింగ్ యత్నాల వల్ల భారత ఆర్మీకి చెందిన ఆయా వెబ్‌సైట్ల సమాచారమేదీ తస్కరణకు గురికాలేదు. సదరు వెబ్‌సైట్ల పరిధిలోని నెట్‌వర్క్ కూడా ప్రతికూలంగా ప్రభావితం కాలేదని సమాచారం. సైనికులు, వారి -కుటుంబాల సంక్షేమంతో ముడిపడిన వెబ్‌సైట్లకు మెరుగైన సైబర్ రక్షణ కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని భారత ఆర్మీ వర్గాలు వెల్లడించాయి.
ఏప్రిల్ 22న జమ్మూకశ్మీరులో పహల్గాం ఉగ్రదాడి జరిగినప్పటి నుంచి సరిహద్దు నియంత్రణ రేఖ(ఎల్ఓసీ) వద్ద ఉద్రిక్త పరిస్థితులే కొనసాగుతున్నాయి. ఇరుదేశాల సైన్యాలు పరస్పరం కాల్పులకు దిగుతున్నాయి. వరుసగా ఐదు రోజులుగా ఈ విధంగా కాల్పులు కొనసాగుతుండటంపై పరిశీలకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఇంకొన్ని వారాల్లో సరిహద్దుల్లో పరిస్థితులు తీవ్రరూపు దాల్చే ముప్పు ఉంటుందని అంచనా వేస్తున్నారు.
ఈ నేపథ్యంలో కశ్మీర్‌లోని మొత్తం 87 టూరిస్టు కేంద్రాల్లో 48 కేంద్రాలను భారత ప్రభుత్వం మూసివేసింది. పహల్గాం దాడి తర్వాత కశ్మీర్‌లో ఉగ్రవాద స్లీపర్‌సెల్స్ యాక్టివేట్ అయ్యాయని, మరిన్ని ఉగ్ర దాడులు జరగొచ్చని భారత నిఘా వర్గాల నుంచి సమాచారం అందడం వల్ల ఈమేరకు చర్యలు తీసుకున్నారు. జమ్మూకశ్మీర్‌లో ఉన్న ఉగ్రవాదుల ఇళ్లను భారత సైన్యం పేల్చేస్తోంది. దీనికి ప్రతీకారంగా ఉగ్రవాదులు దాడులకు ప్రణాళిక రచిస్తున్నారని సమాచారం అందిందని నిఘా వర్గాలు వెల్లడించాయి.

# ఉత్తమ్ నోట ఉత్తమాటలు



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణను తమకు అప్పగిస్తే మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నియోజకవర్గమైన హుజూర్‌నగర్‌కు నీళ్లు అందించి చూపిస్తామని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి చురకలంటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రులకు పాలన చేతగాక కేసీఆర్ ప్రసంగంపై విమర్శలు చేస్తున్నారన్నారు.
కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలపై ఎన్డీఎస్ఏ సమర్పించిన నివేదిక సరైనదని మంత్రి ఉత్తమ్ నిరూపిస్తే తన ముక్కు నేలకు రాస్తానని సవాల్ విసిరారు. కేసీఆర్‌ను దెబ్బతీసేందుకే ఈ రిపోర్టు విడుదల చేశారని, అది పూర్తిగా పని చేయని నివేదిక అని దుయ్యబట్టారు. కేవలం శునకానందం కోసమే ఈ రిపోర్టును రూపొం దించారని మండిపడ్డారు.
కేఆర్ఎంబీలో మనకు వచ్చే నీళ్లను వాడుకునే దమ్ము ప్రభుత్వానికి లేదని, 130 టీఎంసీల నీళ్లు ఏపీ ప్రభుత్వం తీసుకుపోతుంటే రేవంత్ సర్కార్ ఏం చేస్తుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు, బోన స్ చెల్లింపు వివరాలపై లెక్క చెప్పాలని డిమాండ్ చేశారు.
అలా చేయని పక్షం లో పాలన చేతగాని వాళ్లమని ఒప్పుకోవాలని సవాల్ విసి రారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తన ఉత్తర కుమార ప్రగల్భాలు మానుకుంటే మంచిదని హితవు పలికారు. ఇక ఎల్కతుర్తి సభలో పేరు చెప్పలేదని సీఎం రేవంత్ రెడ్డి బాధపడుతున్నారని.. కానీ ఆయన పేరు మంత్రులు, ఎమ్మెల్యేలే గుర్తు పెట్టుకోవడం లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణ పాలిట కాంగ్రెస్ విలన్‌గా మారిందని, రాష్ట్రాన్ని ఆంధ్రలో కలిపిందే కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు. ఎల్కతుర్తి సభలో కేసీఆర్ ఒక్కరే మాట్లారంటున్న బీజేపీ ఎంపీ లక్ష్మణ్.. మోదీ సభలో ఆయన ఎప్పుడైనా ప్రసంగించారేమో చూసుకోవాలని ఎద్దేవా చేశారు.
అలాగే గుజరాత్‌లో నిర్మాణం కాకముందే కూలిపోయిన నిర్మాణాల్లో 150 మంది మరణించడంపై బీజేపీ ఎందుకు మౌనంగా ఉంటుందో చెప్పాలని ప్రశ్నించారు. కేసీఆర్ లాగా ఒక్కరే మాట్లాడే సభను కాంగ్రెస్ నేతలు పెడితే చూడాలని ఉందని చురకలంటించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్, గొంగిడి సునీత, భూపాల్ రెడ్డి, భాస్కరరావు, రవీంద్రకుమార్‌లు పాల్గొన్నారు.

# భద్రాద్రి రాములోరి మాడవీధుల విస్తరణ ఇంకెప్పుడు

దక్షిణాది అయోధ్య అంటే అందరూ ఠక్కున చెప్పే పేరు భద్రాచలం. ఇక్కడ భద్రాద్రి రాముడు సీతాదేవి సమేతంగా కొలువై ఉన్నారు. గోదావరి నది ఒడ్డున రాములోరి ఆలయం ఎంతో ఆహ్లాదకరంగా, వైభవంగా ఉంటుంది. కానీ శ్రీరామనవమి, ముక్కోటి ఏకాదశి తరహాలో హనుమాన్ జయంత్యుత్సవాలు నిర్వహించినప్పుడు స్థలం చాలడం లేదు. అందుకు రెవెన్యూశాఖ ఆలయ మాడవీధి విస్తరణకు సర్వసన్నద్ధమైంది. ఈ క్రమంలో ఎలాంటి వివాదం లేని గృహాలను తొలగించి స్వాధీన పరచుకునేందుకు కసరత్తు చేపట్టింది.
అయితే ఇళ్లను ఖాళీ చేసేందుకు అంగీకరించి పరిహారం తీసుకున్న యజమానులు ఇదివరకే అక్కడి నుంచి వెళ్లాల్సి ఉన్నప్పటికీ ఇంకా వారంతా కదలడం లేదు. ఇలాంటి వారు ముందుగా ఈ ప్రాంతాన్ని వదిలి వెళ్లేలా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రెండు రోజులుగా మాడవీధుల్లో ఇంటింటికీ వెళ్లి ఖాళీ చేయాలని సూచిస్తున్నారు. హనుమాన్ జయంత్యుత్సవాలు మే 22న నిర్వహిస్తారు. ఈ వేడుకలకు వేలాది మంది భక్తులు హాజరవుతారు.
ఇప్పుడికిప్పుడే ఖాళీ చేయలేం : ఇప్పటికీ మాడవీధుల్లో కొందరు యజమానులు దుకాణాలు నిర్వహిస్తున్నారు. వారంతా ఆధ్యాత్మిక బొమ్మలు, ఫొటోలు వంటి వాటిని విక్రయిస్తూ జీవిస్తుంటారు. ఇంకొంత మంది అక్కడ అద్దెకు ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో ఇప్పటికప్పుడు ఖాళీ చేయడం కుదరదని, హనుమాన్ జయంతి తర్వాత బయటకు వెళ్తామని రెవెన్యూ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. కొందరు రాజకీయ ఒత్తిళ్లు సైతం తెస్తున్నారు. ప్రభుత్వం పరిహారం చెల్లించినప్పటికీ ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంలో మాత్రం జాప్యం తప్పటం లేదని తెలుస్తోంది.
స్థలం వస్తేనే మాడ వీధుల అభివృద్ధి : మాడవీధుల విస్తరణలో వీలైనంత తొందరగా 1.20 ఎకరాలను స్వాధీనం చేసుకోవాలని స్థానిక అధికారులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ అంశంపై రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారులు కూడా ఆరా తీస్తున్నారు. ఇప్పటికే 41 ఇళ్లకు రూ.34 కోట్ల పరిహారం మంజూరు కాగా ఇప్పటివరకు రూ.33 కోట్లు చెల్లించారు. అలాగే వేర్వేరు కారణాలతో ఎనిమిది మంది పరిహారం తీసుకుపోవడంతో వీరిని ఒప్పించాల్సి ఉంది. ఇప్పుడు ఆ స్థలం చేతికి వస్తే మాడవీధుల అభివృద్ధి సాధ్యమవుతుంది.
అప్పటి వరకు ఆగడం కుదరదు : అప్పుడే ఉత్సవాలకు వైభవం పెరిగి భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుంది. మాడవీధుల్లో ఇళ్లను ఖాళీ చేయించే ప్రక్రియ మొదలైంది. ఇందుకు రెవెన్యూ సిబ్బందితో అవగాహన కల్పిస్తున్నామని ఆర్డీఓ దామోదర్ రావు తెలిపారు. అన్నీ అంగీకరించి పరిహారం తీసుకున్న యజమానులు ఖాళీ చేసి వెళ్లాలని సూచించామని చెప్పారు. హనుమాన్ జయంతి వరు వేచి చూడాలని అడిగినా అన్ని రోజులు ఆగటం కుదిరే పనికాదని తేల్చి చెప్పారు. ఇది ప్రభుత్వ పరిధిలోని అంశం అని ఆయన స్పష్టంగా చెప్పారు.



# ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి పర్యావరణ అనుమతులు

హైదరాబాద్: రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగం నిర్మాణం దిశగా మరో అడుగు ముందుకుపడింది. కేంద్ర ప్రభుత్వం ఈ రహదారికి పర్యావరణ అనుమతులను మంజూరు చేసింది. ఇప్పటికే అటవీ అనుమతులు వచ్చాయి. దీంతో రోడ్డు నిర్మాణానికి కేంద్రం నుంచి రావాల్సిన అనుమతులన్నీ వచ్చేసినట్లయింది. ఇక ఈ ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్‌లో ఆమోదించడమే తరువాయి. మంత్రివర్గ ఆమోదం లభించగానే రహదారి నిర్మాణ పనులు ప్రారంభించే అవకాశం ఉంటుంది. తాజాగా పర్యావరణ అనుమతులు రావడంతో భూ నిర్వాసితులకు పరిహారం చెల్లింపులకు మార్గం సుగమమైంది. త్వరలోనే ఈ ప్రక్రియ వేగిరమవనుంది. అయితే తమకు అధిక పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సాగు భూములు కోల్పోతున్న రైతులకు ఆమోదయోగ్యంగా ఉండేలా మెరుగైన పరిహారం చెల్లించే మార్గాలను అన్వేషించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం నిర్మాణం కోసం 1,920 హెక్టార్ల భూమిని సేకరిస్తుండగా, పరిహారం కోసం సుమారు రూ.5,200 కోట్లు కావాలని అధికారులు అంచనా వేస్తున్నారు.
ఇందులో రాష్ట్ర వాటాగా రూ.2,600 కోట్లు ఇవ్వాలి. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం రహదారిని 4 వరసలతోనే నిర్మించాలని కేంద్రం తొలుత నిర్ణయించింది. అయితే రోడ్డు నిర్మాణం పూర్తయి, అందుబాటులోకి వచ్చే సమయానికి ట్రాఫిక్ పెరుగుతుందని.. 6 వరసలకు విస్తరించాల్సి వస్తుందని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) భావిస్తోంది. ఇప్పటికే రహదారి మార్గంలో ట్రాఫిక్‌పై సర్వే నిర్వహిస్తోంది. ప్రాథమిక గణాంకాల ప్రకారం రహదారి అందుబాటులోకి వచ్చే సమయానికి వాహనాల రద్దీ భారీగా పెరుగుతుందని తేలింది. దీంతో రోడ్డును 6 వరసలుగా నిర్మించేందుకు గాను.. సమగ్ర ప్రాజెక్టు నివేదికను (డీపీఆర్) రూపొందించాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఓ సంస్థకు బాధ్యతలు అప్పగించారు. డీపీఆర్ పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే కేంద్రానికి కూడా సమర్పిస్తారని తెలుస్తోంది. రహదారి వరసలను పెంచితే ఇప్పటికే ఖరారు చేసిన జంక్షన్లు, ఇంటర్‌చేంజ్‌ల్లోనూ పలు మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఉత్తర భాగం రహదారి సంగారెడ్డిలో మొదలై నర్సాపూర్, తూప్రాన్, జగదేవ్‌పూర్, ప్రజ్ఞాపూర్, గజ్వేల్, భువనగిరి మీదుగా చౌటుప్పల్ వరకు 161 కి.మీ. మేర ఉండనుంది. రహదారి నిర్మాణం కోసం 2024 డిసెంబరు 27న రూ.7,104 కోట్లతో ఎన్‌హెచ్‌ఏఐ టెండర్లను ఆహ్వానించింది. మొత్తం రోడ్డును 5 ప్యాకేజీలుగా విభజించింది. ఇప్పుడు రహదారి నిర్మాణంలో రెండు వరసలు పెరిగిన నేపథ్యంలో కొత్త టెండర్లను పిలవనున్నారు.

# సింహాద్రి అప్పన్న చందనోత్సవం

సింహాద్రి అప్పన్నస్వామి చందనోత్సవం సందర్భంగా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. 30వ తేదీన అక్షర తృతీయ రోజు స్వామివారి చందనోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నిర్దేశించిన ప్రాంతాల్లోనే వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని పోలీసులు సూచించారు.

హనుమంతువాక నుంచి ఆటోలు, కార్లు, బైక్‌లపై వచ్చే రూ.1500, రూ.1000 పాసులు కలిగిన భక్తులు కృష్ణాపురం న్యూగోశాల వద్ద వాహనాలను పార్కింగ్ చేయాలి. సబ్బవరం, పెందుర్తి, వేపగుంట, గోపాలపట్నం నుంచి వచ్చేవారు శ్రీనివాసనగర్ దేవస్థానం ఫంక్షన్‌హాలు వెనుక భాగంలో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి. తర్వాత దేవస్థానం ఏర్పాటు చేసిన ఏసీ వాహనాల్లో స్వామివారి దర్శనానికి వెళ్లాలి.

300 రూపాయల టికెట్ల భక్తులు: శొంఠ్యాం వైపు నుంచి వచ్చే భక్తులు అడవివరం కూడలిలోని వెంకటాద్రినగర్ పార్కింగ్ ప్లేస్‌లో వాహనాలు నిలపాలి. హనుమంతువాక నుంచి వచ్చేవారు కొత్తటోలు గేటు ఎదురుగా అడవివరం జంక్షన్ గ్రౌండ్‌లో తమ కార్లు, బీసీ సంక్షేమశాఖ స్కూలు మైదానంలో బైక్‌లు, గోపాలపట్నం నుంచి వచ్చే వాహనదారులు శ్రీనివాసనగర్ రోడ్డు నెంబరు-3 పంతులుగారి తోటలో కార్లు, ఎస్ఎన్ఆర్ ఫంక్షన్‌హాలు ఎదురుగా ఉన్న మామిడితోటలో బైక్‌లు పార్క్ చేసుకోవాలి. పాత గోశాల వద్ద నుంచి ఉచిత బస్సుల్లో స్వామివారి దర్శనానికి చేరుకోవాలి.

సబ్బవరం, పెందుర్తి, వేపగుంట నుంచి వచ్చే భక్తులు సాయినగర్‌లో ఏర్పాటు చేసిన 1-5 పార్కింగ్ స్థలాల్లో కార్లను పార్కింగ్ చేసుకోవాలి. సింహపురి కాలనీ బస్సుస్టాప్ వెనుక మామిడితోట వద్ద బైకులను నిలపాలి. అనంతరం సింహపురి కాలనీ బస్సుస్టాప్ వద్ద నుంచి ఉచిత బస్సుల్లో స్వామివారి దర్శనానికి వెళ్లాలి. గోపాలపట్నం నుంచి వచ్చే ఆటోలకు సింహాచలం వెళ్లటానికి అనుమతించరు. శ్రీనివాసనగర్ రోడ్డు నెంబరు-3 వద్ద భక్తులను దించి, SNR ఫంక్షన్ హాలు ఎదురుగా మామిడితోటలో పార్క్ చేసుకోవాలి.

వాహనాలు దారి మళ్లింపు: హనుమంతువాక నుంచి గోపాలపట్నం వైపు వచ్చే భారీ వాహనాలు ఆనందపురం నుంచి లేదా మద్దిలపాలెం నుంచి నేషనల్ హైవేపై వెళ్లాల్సి ఉంటుంది. సబ్బవరం, పెందుర్తి, వేపగుంట, గోపాలపట్నం నుంచి సింహాచలం మీదుగా వెళ్లాల్సిన వాహనాలు NAD, తాటిచెట్లపాలెం, మద్దిలపాలెం మీదుగా వెళ్లాలి.

సిబ్బంది వాహనాలు సైతం: చందనోత్సవం విధులకు హాజరయ్యే పోలీసు, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బంది తమ బైకులను సింహాచలం RTC కాంప్లెక్సు గ్యారేజీ గ్రౌండ్‌లో పార్కింగ్ చేసుకోవాలి. కేటాయించిన బస్సుల్లో కొండపైకి వెళ్లాలి. 4 వీలర్ వాహనాల్లో వచ్చే అన్నిశాఖల అధికారులు తమ వాహనాలను సింహాచలం తొలిపావంచా వద్ద ట్యాక్సీ స్టాండ్‌లో పార్క్ చేసుకోవాలి.

చందనోత్సవం రోజున దేవస్థానం ఏర్పాటు చేసిన బస్సులు, మినీ బస్సులు తప్ప మరే ఇతర వాహనాలను కొండపైకి అనుమతించమని పోలీసులు తెలిపారు. సింహాచలం పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రజలు అత్యవసరమైతే తప్ప వాహనాలతో కొండ దిగువన ప్రయాణం చేయవద్దని, అత్యవసరమైతే ఆధార్‌కార్డు చూపించి ప్రయాణం చేయవచ్చన్నారు.



# డీజిల్, పెట్రోల్ స్మగ్లింగ్

పొరుగున ఉన్న కేంద్రపాలిత ప్రాంతం యానాం నుంచి డీజిల్, పెట్రోల్ అక్రమ మార్గాల్లో కోనసీమ జిల్లాలోకి ప్రవేశిస్తోంది. యానాంతో పోల్చుకుంటే ఇక్కడ ధరలో వ్యత్యాసం ఉండటంతో అక్రమార్కులు దీనిని సొమ్ము చేసుకుంటున్నారు. యానాంకి దగ్గరలో ఉన్న ఐ.పోలవరం మండలం నుంచి ముమ్మిడివరం, అమలాపురం చుట్టుపక్కల మండలాలకు నిత్యం వేలాది లీటర్ల ఆయిల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు.

**యానాం నుంచి అక్రమంగా తరలింపు**

కోనసీమ జిల్లాలో ఆక్వా సాగు ఎక్కువగా ఉండటంతో చెరువుల వద్ద జనరేటర్లలో భారీగా డీజిల్‌ని వినియోగిస్తారు. వీరికి అవసరమైన డీజిల్ యానాం నుంచి ఇక్కడికి అక్రమంగా తరలించి విక్రయిస్తున్నారు. అదే విధంగా పెట్రోల్ సైతం రవాణా చేస్తున్నారు. పెట్రోల్‌తో పోల్చితే డీజిల్‌ని ఎక్కువగా తరలిస్తున్నారు. బంకుల్లో లూజుగా ఆయిల్ విక్రయించడంపై నిషేధం ఉన్నా, యానాంలో ఈ రూల్స్ పట్టించుకోవడం లేదు. రవాణా సమయంలో కొంతమంది సిబ్బంది డబ్బులు తీసుకుని చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇలా తరలిస్తున్న సమయలో వాహనాలు ఎక్కడైనా ప్రమాదానికి గురైతే భారీగా నష్టం తప్పదు. వేసవి నేపథ్యంలో ఈ ముప్పు మరింత ఎక్కువగా ఉంటుంది.

కోనసీమలోని తీర ప్రాంతాల్లో నదీమార్గంలో పడవలు, బోట్లు ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో రోడ్డు మార్గంలో ఈ అక్రమదందా జరుగుతోంది. నిత్యం వేలాది లీటర్ల డీజిల్, పెట్రోల్ అక్రమంగా యానాం నుంచి కోనసీమకు వస్తోంది. ఎక్కువ మంది పోలీసుల కన్నుగప్పి ఈ దందా సాగిస్తున్నారు. అక్రమార్కులకు కొంతమంది సిబ్బంది సహకారం ఉందనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇకనైనా మరింత నిఘా పెంచాల్సిన అవసరం ఉంది.

**ఇక్కడి బంకుల్లో తగ్గిన విక్రయాలు**

యానాం నుంచి కోనసీమకు అక్రమంగా ఇంధనం వస్తుండటంతో కోనసీమ శివారు ప్రాంతాల్లోని పెట్రోల్, డీజిల్ బంకులు మూతపడుతున్నాయి. నేషనల్ హైవే 216కి పక్కనే ఉన్న బంకులకు పెద్దగా ఇబ్బంది లేకపోయినా, శివారు మండలాలైన కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, మామిడికుదురు తదితర మండలాల్లో ఉంటున్న బంకుల్లో భారీగా అమ్మకాలు తగ్గాయి. దీంతో ప్రస్తుతం ఈ బంకులు మూసివేసే పరిస్థితికి వచ్చాయి.

**కేసులు నమోదు చేస్తున్నాం**

యానాం నుంచి అక్రమంగా డీజిల్, పెట్రోలు తరలించే వారిని ఉపేక్షించమని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. డీజిల్, పెట్రోలు అక్రమ రవాణా కారణంగా ఇక్కడ ఇబ్బందులు తలెత్తుతాయని, వాహనాల్లో ఆయిల్ తరలించడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని చెప్పారు. పట్టుబడిన వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నామని పేర్కొన్నారు.

# మిస్ వరల్డ్ పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు

హైదరాబాద్: మిస్ వరల్డ్ -2025 పోటీలకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఇందులో పాల్గొనే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని అధికారులను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మిస్ వరల్డ్ -2025 ఏర్పాట్లపై మంగళవారం అధికారులతో సిఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు మంత్రి జూపల్లి కృష్ణారావు, వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు, తదితరులు హాజరయ్యారు. ఈ సమీక్షలో భాగంగా వచ్చేనెల 10వ తేదీన ప్రారంభం కానున్న మిస్ వరల్డ్-2025 అందాల పోటీకి సంబంధించి ఏర్పాట్ల వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన కీలక ఆదేశాలు ఇచ్చారు.

ఎయిర్ పోర్టు, అతిథులు బస చేసే హోటళ్లు, కార్యక్రమాలు జరిగే చోట కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని, తెలంగాణలో చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సిఎం ఆదేశించారు. విభాగాలవారీగా ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని ఆయన సూచించారు. నగరంలో పెండింగ్‌లో ఉన్న సుందరీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని సిఎం రేవంత్ ఆదేశించారు. ఈ పోటీలు పూర్తయ్యే వరకు చేపట్టే కార్యక్రమాలు, ఏర్పాట్లకు సంబంధించి పూర్తి స్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.



# భారీగా ప్రాజెక్టులొస్తున్నాయ్

## 6.60 లక్షల కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక విడుదల

అమరావతి: రాష్ట్ర ఆర్థిక ప్రగతికి బ్యాంకులు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. రాష్ట్రానికి భారీగా ప్రాజెక్ట్‌లు వస్తున్నాయని, స్వర్ణాంధ్ర-2047 విజన్‌కు అనుగుణంగా పని చేస్తూనే.. 2029కల్లా పూర్తి చేయాల్సిన ప్రాజెక్ట్‌లు, లక్ష్యాలపై ప్రధానంగా దృష్టి పెట్టామని, వీటన్నింటికీ బ్యాంకులు సహకారం అందించాలన్నారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 231వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 6,60,000 కోట్లతో రూపొందించిన వార్షిక రుణ ప్రణాళికను సీఎం ఆవిష్కరించారు. అలాగే 2024-25లో సాధించిన ఫలితాలపై బ్యాంకింగ్ అధికారులతో చర్చించిన సీఎం.. వంద శాతం లక్ష్యాలను అధిగమించి, దక్షిణ భారతదేశంలోనే మేటిగా ఉన్నందుకు వారిని అభినందించారు. అలాగే 2025-26 లక్ష్యాలను సీఎం చంద్రబాబు నిర్దేశించారు. ఏరంగం పురోగతి సాధించాలన్నా బ్యాంకుల మద్దతు తప్పనిసరి అని చెప్పారు. వివిధ రంగాల్లో వచ్చే ప్రాజెక్ట్‌లకు బ్యాంకులు అవసరమైన ఆర్థిక మద్దతు ఇవ్వాలని చెప్పారు.

ఆర్థికాభివృద్ధిలో విశాఖ అనూహ్య పురోగతి సాధిస్తోందని, పారిశ్రామికంగానూ అభివృద్ధి చెందుతోందని అన్నారు. భవిష్యత్ అవసరాలకు అమరావతిని వేదికగా చేస్తున్నామని, అటు రాయలసీమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. పెట్రో కారిడార్‌పై బ్యాంకర్లు దృష్టి పెట్టాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలను సైతం బలోపేతం చేసేలా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మధ్యవర్తుల ప్రమేయంతో మత్స్యకారులు నష్టపోతున్నందున వారికి నేరుగా రుణాలు ఇవ్వాలని కోరారు. సముద్ర ఆర్థిక వ్యవస్థలో ఎన్నో అవకాశాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటే అద్భుతాలు సాధించవచ్చునని చెప్పారు. దీనికి బ్యాంకర్ల మద్దతు చాలా అవసరం అన్నారు. డ్వాక్రా మహిళలు, కౌలు రైతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఎదుగుదలకు ప్రత్యేకంగా ఏం చేయగలం అనేది బ్యాంకర్లు ఆలోచించాలని చెప్పారు. 2025-26లో నిర్దేశించుకున్న రుణ ప్రణాళిక లక్ష్యాలను అధిగమించేందుకు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడల్లా తరచూ ఎస్ఎల్‌బీసీ సమావేశాలు నిర్వహించడానికి ప్రధాన కారణం.. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు బ్యాంకుల మద్దతు కూడగట్టేందుకేనని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సేవలు, పరిశ్రమల రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చామని, కానీ రాష్ట్ర విభజన తర్వాత ప్రాధాన్యతలు మారాయని తెలిపారు. ఏపీవ్యవసాయరంగ ఆధారితరాష్ట్రం కావడం, దీనిపై ఎక్కువ మంది ఆధారపడి జీవిస్తుండటంతో వ్యవసాయ రంగానికి అండగా నిలిచామని చంద్రబాబు చెప్పారు.

ఇంటికో ఎంటర్‌ప్రెన్యూర్‌ను తీసుకురావాలన్న సీఎం చంద్రబాబు ఆశయం మేరకు వార్షిక రుణ ప్రణాళికలు అమలు చేస్తున్నామని సమావేశంలో బ్యాంకర్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కచ్చితంగా లక్ష్యాన్ని అధిగమిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, స్వయం సహాయక బృందాలకు రుణాలు విరివిగా అందిస్తామని, విద్యా, గృహనిర్మాణాల విషయంలో ప్రత్యేక దృష్టి సారించామని వెల్లడించారు. ఈ సమావేశంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, సీఎస్ విజయానంద్, ఎస్ఎల్‌బీసీ ప్రెసిడెంట్ మణిమేఖలై, పలువురు బ్యాంకర్లు, ఆర్బీఐ అధికారులు పాల్గొన్నారు.

**22 శాతం రుణ లక్ష్యం పెంపు**

రాష్ట్ర రుణ ప్రణాళిక లక్ష్యం 2024-25లో రూ. 5,40,000 కోట్లు ఉండగా, 2025-26లో 22% అధికంగా రూ. 6,60,000 కోట్లకు పెంచారు. ఇందులో వ్యవసాయరంగ లక్ష్యం రూ. 3,06,000 కోట్లు, రంగానికి రూ. 1,28,000 కోట్లు ఉండగా, మొత్తం ప్రాధాన్యత రంగానికి రూ. 4,58,000 కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ. 2,02,000 కోట్లు రుణ లక్ష్యంగా బ్యాంకర్ల కమిటీ నిర్దేశించింది. 2024-25లో లక్ష్యాన్ని అధిగమించి, రూ. 6,83,672 కోట్ల రుణాలు ఇచ్చినట్లు బ్యాంకర్ల కమిటీ వివరించింది. వార్షిక లక్ష్యంలో ఇది 127% వృద్ధి అని తెలిపింది. ఇందులో ప్రాధాన్యత రంగానికి రూ. 4,14,824 కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ. 2,68,848 కోట్లు అందించగా, గతేడాది వ్యవసాయ రంగానికి రూ. 2,64,000 కోట్ల రుణ లక్ష్యంలో 116% వృద్ధి సాధించామని, ఖరీఫ్‌లో రూ. 1,69,797కోట్లు, రబీలో రూ.1,37,291 కోట్లు రుణాలిచ్చామని బ్యాంకర్లు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న ఎంఎస్ఎంఈలు రంగానికి భారీఎత్తున రుణ ప్రణాళికఅమలు చేయగా, గతేడాది రూ. 87 వేల కోట్ల లక్ష్యానికి రూ. 95,620 కోట్లు రుణాలు ఇచ్చి, 110% వృద్ధి సాధించారు. అయితే వార్షిక రుణ ప్రణాళిక అమలులో ఏటేటా వృద్ధి రేటు పడిపోతుడటంపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బ్యాంకర్లను ప్రశ్నించారు. 2021-22 లక్ష్యంలో 133%, 2022-23లో 163%, 2023-24లో 138% ఉండగా, 2024-25లో లక్ష్యంలో వృద్ధి 127% మాత్రమే ఉండటంపై మంత్రి వివరణ కోరారు.

# కశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే

## జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు

మంగళగిరి: పహల్గాంలో ఉగ్రవాదుల దాడి అతి హేయమని, అది దేశ సమగ్రతపైనే దాడి అని డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పహల్గాం ఉగ్ర దాడిలో మృతిచెందిన 26 మంది అమరులను స్మరించారు. ఈ దాడిలో మరణించిన నెల్లూరు జిల్లా కావలికి చెందిన జనసేన క్రియాశీలక సభ్యుడు, సాఫ్ట్‌వేర్ ఇంజనీరు సోమిశెట్టి మధుసూదనరావుకు ఘన నివాళి అర్పించారు. ఆయన కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. క్రియాశీలక సభ్యత్వ బీమా కింద మరో రూ.5 లక్షలు అందిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.పది లక్షల పరిహారం ప్రకటించిందని, ఇంకా ఏమైనా అదనంగా సాయం చేయగలమేమో పరిశీలిస్తామన్నారు. ఉగ్రవాదం జన సైనికుడిని చంపేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ''పహల్గాంలో పర్యాటకులను ఉగ్రవాదులు వేటాడి చంపడం అత్యంత హేయం. మధుసూదనరావు కుటుంబాన్ని పరామర్శించేందుకు కావలి వెళ్లినప్పుడు ఆయన భార్య, పిల్లలు పహల్గాంలో జరిగిన ఘాతుకాన్ని వివరిస్తుంటే హృదయం ద్రవించిపోయింది. 'ఉగ్రవాదులు హిందువులనే లక్ష్యంగా చేసుకుని చంపేశారు. మేం ముస్లిం అయితే మమ్మల్ని వదిలివేసేవారు. హిందువుగా పుట్టడం మేం చేసిన పాపమా' అని మధుసూదనరావు భార్య నన్ను ప్రశ్నించారు. కశ్మీర్‌లో అమాయకులపై పేలిన తూటా ప్రకంపనలు దేశమంతా వ్యాపించాయి. హిందువ్వా? ముస్లిమువా? అని అడిగి మరీ కిరాతకంగా తూటాలు దించిన ఉగ్రవాదులపై ఏమాత్రం కనికరం అవసరం లేదు. ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించడానికి దేశమంతా ఏకం కావలసిన సమయం ఆసన్నమైంది.'' అని పవన్ కల్యాణ్ తెలిపారు. కశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనన్నారు.

విభిన్న సంప్రదాయాలు, అభిప్రాయాలు ఉండే దేశాన్ని ఏకాభిప్రాయంతో నడపాలంటే ప్రధానమంత్రి స్థాయి వ్యక్తికి ఎంతో కష్టమని, ఆయనకు మన వంతు సహకారం అందిద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఇది ఎన్డీఏ భాగస్వామిగా జనసేన బాధ్యత అని చెప్పారు. ''ఇప్పటికి పాకిస్థాన్‌ను మూడుసార్లు ఓడించాం. మనదేశంలో అసలు ఎంతమంది ఏ ముసుగుతో ఉంటున్నారో తెలియని పరిస్థితిలు నెలకొన్నాయి. మనకు సహనం ఎక్కువైంది. మితిమీరిన మంచితనం కూడా దేశానికి మంచిది కాదు.'' అని పవన్ అన్నారు. దేశంలో యుద్ధ పరిస్థితులు రావొచ్చు.. రాకపోవచ్చునని ఆయనఅభిప్రాయపడ్డారు. ''పహల్గాం దాడి తర్వాత కేంద్రం పాకిస్థాన్‌కు నీళ్లు ఆపడాన్ని కొందరు తప్పుబడుతున్నారు. దేశంలో లౌకికవాదం తీరు ఏమీ బాగాలేదు. 26 మందిని మత ప్రాతిపదికన చంపేస్తే.. సోకాల్డ్ సూడో సెక్యులరిస్టులు మాత్రం మతం అడిగి చంపలేదు అంటున్నారు. మధుసూదనరావు భార్య మనకు అబద్ధం చెబుతారా? కొంతమంది భారతదేశంలో కూర్చొని పాక్‌ను ప్రేమిస్తామంటారు. అలాంటి వారు అక్కడికే వెళ్లిపోండి' అంటూ ఘాటుగా స్పందించారు. పాకిస్తాన్ ఏర్పాటు సమయంలో అందర్నీ సమానంగా



ఆదరిస్తామని జిన్నా చెప్పారు. కానీ, ఆనాడు పాక్‌లో రెండు కోట్ల మంది హిందువులు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య కొన్ని లక్షలమందికి పడిపోయింది.'' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్సీ నాగబాబు, ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.

**మీరే జనసేనకు ఇంధనం.. ప్రేరణ**

జన సైనికులు, వీర మహిళల ఆశయమే తమ పార్టీకి ఇంధనం, ప్రేరణలని పవన్ కల్యాణ్ అన్నారు. క్రియాశీలక సభ్యత్వ కిట్ల పంపిణీలో స్వచ్ఛందంగా భాగస్వాములైన వారితో మంగళవారం సాయంత్రం ఆ పార్టీ ప్రధాన కార్యలయంలో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ''నేను మానవత్వాన్ని నమ్ముతాను. కొన్నిసార్లు కులాలు, మతాల ప్రస్తావన నా మాటల్లో వచ్చినా అంతిమంగా మాత్రం ప్రతి ఒక్కరూ బాగుండాలని కోరుకుంటా. విశ్వకవి గుర్రం జాషువా చెప్పినట్టు... విశ్వ నరుడిగా బతకాలని కోరుకుంటా. కులం, మతం, ప్రాంతం దాటి మనిషిగా బతకాలన్నదే నా ఆశయం.'' అని ఆయన పేర్కొన్నారు. పార్టీ క్రియాశీల సభ్యత్వ బీమా పరిహార సొమ్ముపెంపు అంశంపై బీమా కంపెనీలతో మాట్లాడుతున్నానని Zపవన్ తెలిపారు.

# తిరుమల కల్తీ నెయ్యి కేసు

తిరుమల శ్రీవారి కల్తీ నెయ్యికి సంబంధించిన కేసులో అరెస్ట్ అయిన బోలే బాబా డెయిరీ జీఎం హరిమోహన్ (ఏ12) బెయిల్ పిటిషన్‌ను నెల్లూరు అనిశా కోర్టు మంగళవారం తిరస్కరించింది. తొలుత టీటీడీ ఉద్యోగులు నాగేందర్, శేఖర్‌లను సిట్ విచారించిన విషయం తెలిసిందే. వారి విచారణ అనంతరం బోలేబాబా డెయిరీ జీఎం హరిమోహన్, బోలే బాబా డెయిరీకి సరకులు సరఫరా చేసిన వ్యాపారి ఆశిష్ అగర్వాల్ (ఏ15)ను ఈ నెల 24 నుంచి 28 వరకు కస్టడీకి తీసుకుని సిట్ విచారణ చేసింది. విచారణ పూర్తైన తరువాత సోమవారం రుయా ప్రభుత్వం ఆసుపత్రిలో వైద్య పరీక్షలు పూర్తిచేసి కోర్టులో ప్రవేశపెట్టారు. అప్పటికే తనకు బెయిల్ మంజూరు చేయాలని కొన్ని రోజుల క్రితం హరిమోహన్ పిటిషన్ వేయగా, గత గురువారం సిట్ తరఫున అసిస్టెంట్ పీపీ జయశేఖర్ వాదనలు వినిపించారు. బోలేబాబా కంపెనీలో నెయ్యి కల్తీ ఎలా జరిగిందో జీఎంకు తెలుసునని, అతను బయటకు వస్తే సాక్ష్యులను భయభ్రాంతులకు గురి చేసే అవకాశం ఉందని వాదనలు వినిపించారు. అలాగే అసలు నెయ్యి కొనకుండానే కొన్నట్లు చూపించడంతో పాటు ఇతనే నెయ్యి సరఫరా చేసినట్లు చూపించారన్నారు.

## బోలేబాబా డైయిరీ జీఎం బెయిల్ పిటిషన్ తిరస్కరణ

వీటికి సంబంధించిన ఆధారాలతో పది పేజీల కౌంటర్ దాఖలు చేసి వాదనలు వినిపించారు. అసిస్టెంట్ పీపీ వాదనలతో ఏకీభవించిన అనిశా కోర్టు ఇంఛార్జి న్యాయమూర్తి మంగళవారం బోలే బాబా డెయిరీ జీఎం హరిమోహన్ బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించారు. గతంలో ఏ15గా ఉన్న ఆశిష్ ఆగర్వాల్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా, అది కూడా తిరస్కరించిన విషయం విదితమే.

బోలే బాబా డెయిరీ జీఎం హరిమోహన్ విచారణ: శ్రీవారి లడ్డూ కల్తీ నెయ్యి కేసులో సిట్ అధికారులు వరుసగా అందరినీ విచారిస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల బోలేబాబా డెయిరీ సీజీఎం హరిమోహన్ (ఏ12)ను, బోలేబాబా డెయిరీకి నెయ్యి సరఫరా చేసే వ్యాపారి ఆశిష్ అగర్వాల్(ఏ15)ను 4 రోజులు కస్టడీకి తీసుకుని విచారించారు. నెయ్యిలో ఎటువంటి ముడి పదార్థాలు కలిపారు? జంతువుల కొవ్వు ఏ మేరకు కలిసింది? అని ప్రశ్నించారు. అదేవిధంగా నెయ్యి ట్యాంకర్లను పరిశీలించకుండా పంపిన టీటీడీ ఉద్యోగులను సైతం అంతకుముందు విచారించారు. దాదాపు 10 మంది టీటీడీ ఉద్యోగులు అవినీతికి పాల్పడినట్లు తెలుస్తోంది. వారిని త్వరలోనే అరెస్టు చేస్తారనే మాట వినిపిస్తోంది.



# చుక్కలు చూపిస్తోన్న యాప్

అంగన్‌వాడీ సెంటర్లలో పోషకాహార పంపిణీకి తిప్పలు తప్పడం లేదు. ప్రతి నెలా మొదటి శుక్రవారానికి పోషకాహార పంపిణీ పూర్తి కావాల్సి ఉంది. ప్రస్తుతం ఏప్రిల్ నెల పూర్తి కావస్తున్నా ఇంకా 84.6% మాత్రమే పంపిణీ జరిగింది. కేంద్ర ప్రభుత్వం పారదర్శకత కోసం ముఖ ఆధారిత ధ్రువీకరణ అటెండెన్స్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. అయితే సరకులు అందించే సమయంలో ఈ యాప్ సక్రమంగా పనిచేయక పోవడంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు ఇంటర్నెట్ సరిగా రావడంలేదు. దీని కారణంగా గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకునేందుకు పలుమార్లు అంగన్‌వాడీ సెంటర్లకు రావాల్సి వస్తోంది.

గర్భిణులు అంగన్‌వాడీ సెంటర్‌లో తమ పేర్లను తప్పక నమోదు చేసుకోవాలి. వారి వివరాలను సిబ్బంది బాల సంజీవని, పోషణ్ ట్రాకర్ మిల్క్ యాప్‌లలో నమోదు చేస్తారు. ఆ వివరాల ఆధారంగా వారికి పోషకాహార కిట్లు అందిస్తారు. ప్రతి నెలా 15లోగా నమోదైన లబ్ధిదారులకు మాత్రమే తర్వాత నెల పోషకాహార కిట్లను అందజేస్తారు. యాప్ సరిగ్గా పనిచేయకపోవడంతో 15వ తేదీ తర్వాత పేర్లు నమోదు చేస్తున్న వారికి పోషకాహారం అందడం లేదు.

పంపిణీ ఇలా: బాలింతలకు ప్రతి నెలా 2 కిలోల రాగి పిండి, కిలో అటుకులు, పావు కిలో బెల్లం, ఎండు ఖర్జూరం, చిక్కీలతో పాటు 3 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, నూనె అరలీటరు పౌరసరఫరాల శాఖ నుంచి అందజేస్తున్నారు. అయితే ఏప్రిల్ నెలకు సంబంధించి ఇంకా 15.4 శాతం మంది లబ్ధిదారులకు కిట్లు ఇవ్వాల్సి ఉంది. వాటికోసం లబ్ధిదారులంతా వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

పని చేయని ఫోన్‌లు: లబ్ధిదారులకు ముఖ ఆధారిత అటెండెన్స్‌తో సరకులు అందజేస్తారు. గత ప్రభుత్వం నాసిరకమైన ఫోన్‌లను సిబ్బందికి అందజేసింది. ఇవి పనిచేయక కార్యకర్తలు తమ సొంత ఫోన్లలో యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకున్నారు. దీనికి ప్రతి నెలా ప్రభుత్వం ఇచ్చే 2GB డేటా సరిపోవడం లేదని పలువురు సిబ్బంది వాపోతున్నారు. దీనివల్ల తమపై అదనపు భారం పడుతోందని అంగన్‌వాడీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాం: ఇది ఇలా ఉంటే అంగన్‌వాడీ సెంటర్‌లో యాప్‌ల నిర్వహణపై ప్రారంభంలో సమస్యలు ఎదురయ్యాయని, వాటిని క్రమంగా పరిష్కరించామని ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి చెప్పుకొచ్చారు. ప్రతి నెలా మొదటి శుక్రవారంలోగా పోషకాహార పంపిణీ పూర్తిచేయాలని, ఇప్పటి వరకూ 84.6% పంపిణీ చేశామని తెలిపారు. మిగిలిన వారికి కూడా ఒకట్రెండ్రోజుల్లో అందజేస్తామని అన్నారు.

# నెల రోజుల్లో ఎంపిక కమిటీని పునర్నియమించాలి

అమరావతి: జిల్లాల వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ అధ్యక్షులు, సభ్యుల నియామకం విషయంలో మెరిట్ ఆధారంగా ఎంపిక కమిటీ తీసుకున్న నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉండాల్సిందేనని హైకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. కమిటీ నిర్ణయాన్ని ప్రభుత్వం తిరిగి సమీక్షించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. అభ్యర్థుల గురించి ఏదైనా అదనపు సమాచారం అందితే వివరాలను ఎంపిక కమిటీ ముందు ఉంచాలి తప్ప నియామకాల విషయంలో ప్రభుత్వం నేరుగా నిర్ణయం తీసుకోవడానికి వీల్లేదని పేర్కొంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టారీతిన చేపట్టిన కడప, గుంటూరు, నెల్లూరు జిల్లాల వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ అధ్యక్షులు.. కడప, తిరుపతి కమిషన్ సభ్యుల నియామకాన్ని రద్దుచేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు ధర్మాసనం సమర్థించింది.

అధ్యక్షులు, సభ్యుల నియామకం విషయంలో అప్పటి ప్రభుత్వం అధికార పరిధి దాటి వ్యవహరించిందని పేర్కొంది. నిబంధనల మేరకు నెల రోజుల్లో ఎంపిక కమిటీని పునర్నియమించాలని ఆదేశించింది. ఈ మూడు జిల్లాల వినియోగదారుల ఫోరాల అధ్యక్ష.. కడప, తిరుపతి ఫోరాల సభ్యుల పదవుల కోసం దరఖాస్తు చేసుకున్నవారి నేపథ్యం, రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయం, ఇతర సమాచారాన్ని పునఃపరిశీలన కోసం ఎంపిక కమిటీ ముందుంచాలని స్పష్టం చేసింది. నియామక ప్రక్రియను రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.కృష్ణమోహన్, జస్టిస్ ఎన్.విజయ్‌తో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పునిచ్చింది. వైసీపీ ప్రభుత్వంలో గుంటూరు, కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాల వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షులు, కడప, తిరుపతి ఫోరాల సభ్యుల నియామకాన్ని రద్దుచేస్తూ గతేడాది నవంబరు 15న సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చారు. దీన్ని సవాల్ చేస్తూ గుంటూరు, కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాల ఫోరం అధ్యక్షులు టి.సునీత, అబ్దుల్ రసూల్, జింక రెడ్డి శేఖర్, అనిత, కడప, తిరుపతి ఫోరం సభ్యులు డి.అమృత, నాగశశిధర్‌రెడ్డి గతేడాది ధర్మాసనాన్ని ఆశ్రయించారు. ఈ అప్పీళ్లపై ధర్మాసనం ఇటీవల తుది విచారణ జరిపింది. కడప, గుంటూరు, నెల్లూరు జిల్లాల వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ అధ్యక్షులు, కడప, తిరుపతి కమిషన్ సభ్యుల నియామకాన్ని రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఉత్తర్వులను హైకోర్టు ధర్మాసనం సమర్థించింది. చిత్తూరు జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షురాలి నియామక రద్దును పక్కనపెట్టింది.

# టీడీపీ ఖాతాలో బొబ్బిలి

బొబ్బిలి: విజయనగరం జిల్లా బొబ్బిలి మున్సిపాలిటీ టీడీపీ వశం కానుంది. వైసీపీకి చెందిన మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావుపై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం మంగళవారం నెగ్గింది. మంగళవారం ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీవో రామ్మోహనరావు ఆధ్వర్యంలో కౌన్సిల్ ప్రత్యేక సమావేశం జరిగింది. అవిశ్వాసానికి అనుకూలంగా పదిమంది టీడీపీ కౌన్సిలర్లు, తొమ్మిది మంది వైసీపీ రెబెల్ కౌన్సిలర్లు, ఒక స్వతంత్ర కౌన్సిలర్ చేతులెత్తి మద్దతు తెలిపారు. వీరితో పాటు ఎక్స్ అఫీషియో సభ్యుడైన బొబ్బిలి టీడీపీ ఎమ్మెల్యే బేబినాయన కూడా అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేశారు. పది మంది వైసీపీ కౌన్సిలర్లు అవిశ్వాసానికి వ్యతిరేకంగా చేతులెత్తారు. ఆర్డీవో రెండు సార్లు లెక్కించి.. అవిశ్వాసానికి అనుకూలంగా 21 మంది, వ్యతిరేకంగా 10 మంది ఓటు వేసినట్లు ప్రకటించారు. అవిశ్వాస తీర్మానం నెగ్గిందని వెల్లడించారు.

## ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన ప్రక్రియ షురూ



మేడ్చల్,నేడున్యూస్: ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన ప్రక్రియ షురూ అయింది. ఈ మేరకు మేడ్చల్ మండలంలోని గిర్మాపూర్, మేడ్చల్ లో ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన ప్రక్రియ ఎలా సాగుతుంది అనే అంశంపై జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్త పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధ్రువీకరణ అంశాల జాబితాలో అంశాలు అన్నిటిని జాగ్రత్తగా పరిశీలించి అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల సుప్రభాత సేవలో దర్శించుకొన్న మాజీ ఎంపిటిసి



బాన్సువాడ ,నేడున్యూస్ : బోర్లం గ్రామానికి చెందిన. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామినీ సుప్రభాత సేవలో దర్శించుకున్న గ్రామ మాజీ ఎంపిటిసి సభ్యురాలు శ్రీమతి పెద్దపట్లోల శ్రావణి దేవేందర్ రెడ్డి. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి యొక్క సుప్రభాత సేవలో తన పెళ్లిరోజు సందర్భంగా స్వామివారిని దర్శించుకుని స్వామివారి ఆశీర్వాదాలు పొందడం జరిగింది. తాను గత పది సంవత్సరాలుగా తన పెళ్లిరోజు సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి యొక్క సేవలో పాల్గొనడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. నా కుమారుని యొక్క ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని ఆమె స్వామి వారిని వేడుకున్నారు. స్వామి వారి సుప్రభాత సేవదర్శనంఎంతో సంతోషాన్ని ఆనందాన్ని ఆహ్లాదాన్ని పంచిందని శ్రీవారి ఆలయం యొక్క ధ్వజస్తంభ దర్శనం మహా అద్భుతం అని ఆమె పేర్కొన్నారు. గ్రామ ప్రజలు పాడిపంటలు సుభిక్షంగా ఉండాలని ఆమె స్వామి వారిని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో పట్లోలదేవేందర్ రెడ్డి పట్లోళ్లనిశాంత్ రెడ్డి బి.ప్రశాంత్ రెడ్డి మరియు మా బంధుమిత్రులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## బిఆర్ఎస్ కార్యకర్త మృతిపై సంతాపం

మేడ్చల్,నేడున్యూస్: మేడ్చల్ మండలం మైసిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్త మహేంద్ర చారి అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆయన ఇంటికి వెళ్లి మహేంద చారి పార్దివా దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.వారి పిల్లలకు కుటుంబ సభ్యులకు అన్ని విధాలా ఆదుకుంటామని మహేంద్ర కుటుంబనికి టిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భాస్కర్ యాదవ్ తదితరులున్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



మద్నూర్, నేడున్యూస్: ఎక్లార గ్రామంలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. చికిత్స పొందిన పేదలకు సీఎంఆర్ఎఫ్ పథకం ఆర్థిక భరోసా అని కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున్ పటేల్ అన్నారు. కార్యక్రమంలో ఎస్ ఎస్ యూఐ బోర్డు అధ్యక్షుడు బసవరాజ్ పటేల్, కాశీనాథ్, రవి పటేల్, మనోహర్, దేవానంద్, రమేష్ తదితరులున్నారు.

## తాటి చెట్టుపై నుండి పడితీవ్ర గాయలైన గీతకార్మికున్ని ప్రభుత్వం అదుకోవాలి

వలిగొండ, నేడున్యూస్: వలిగొండ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన గోడల వెంకటేశం గౌడ్(51) శనివారం సాయంత్రం ఐదు గంట లకు ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి కింద పడిపోయి తీవ్రమైన గాయాల పాల య్యారు తక్షణమే అతనిని సమీపంలో గల రామన్న పేట గవర్నమెంట్ హాస్పిటల్ తర లించి ప్రాథమిక చికిత్స అనంతరం హైదరా బాద్ హాస్పిటల్ తరలించారు.తలకు బల మైన గాయాలు వెన్నుపూసకు దెబ్బతిన డంతో అతని పరిస్థితి ఆందోళన కారణంగా ఉందని నిరుపేద కుటుంబం కావడంతో ప్రభుత్వం అధికారులు స్పందించి ఆదుకో వాలని కుటుంబ సభ్యులు కోరుకుంటు న్నారు .

## కుషాయిగూడలో ఘనంగా చల్లా ప్రభాకర్ జన్మదిన వేడుకలు

కీసర,నేడున్యూస్: కుషాయిగూడ లో చల్లా ప్రభాకర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాల్యం నుంచి ఆర్ ఎస్ ఎస్ స్వయం సేవకుడిగా శ్రీ సరస్వతి శిశుమందిరం స్కూల్ విద్యార్థిగా ఏ.బి.వి.పి విద్యార్థి నాయకుడిగా భజరంగ్ దళ్ నాయకుడిగా బి.జె.వై.యం మేడ్చల్ అర్బన్ అధ్యక్షులు హిందుత్వ భావాలతో నా ధర్మం ఏ ద్యేయంగా కాషాయ జెండానే ప్రాణంగా అణచివేయబడుతున్న హిందూ ధర్మం రక్ష్యనే సంకల్పనాతో హిందూ సమాజంలో చైతన్య కోసం శ్రీ రామ నవమి శోభాయాత్ర, హనుమాన్ జయంతి ర్యాలీలు, గణేష్ ఉత్సవలతో ఎంతో మంది హిందు యువకులను హిందూత్వము వైపు నడిపించి హిందుత్వ వాదిగా, గోవులను రక్షించి గో సేవకుడిగా మతమార్పిడిని అడ్డుకుండు ధర్మ రక్ష కుడిగా, ఎంతో మంది బీజేపీ కార్యకర్తలను తయారు చేసిన యువ నాయకుడిగా ఎన్నో సేవకార్యక్రమలు ఏర్పాటు చేసి ప్రజా సేవకుడిగా ,ప్రజల సమస్యల పై పోరాడుతున్న ప్రజా నాయకుడుగా చర్లపల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులుగా మరి ఎన్నో ప్రజలకు సేవలు చేసుకుంటూ నిండునురేళ్ళు వర్ధిల్లాలని చల్లా ప్రభాకర్ స్నేహబృందం, కుషాయిగూడ. చర్లపల్లి ప్రజలు శుభాకాంక్షలు తెలియజేశారు.

# నృత్య కళాభివృద్ధికి తోడ్పాటు అందించాలి

*ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ

*తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవం

*తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిర్వహణ



హైదరాబాద్,నేడున్యూస్: తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అంతర్జాతీయ నృత్య దినోత్సవం మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కన్నుల పండువగా జరిగింది. అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో సకల కళల నృత్య సమ్మేళనం' నిర్వహించారు. హైదరాబాదు నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం నుంచి ప్రారంభమైన బీ ఉత్సవం సాయంత్రం వరకు కొనసాగింది. ఇందులో భాగంగా యాభై ఆరు డాన్స్ అకాడమీల నుండి సుమారు 430 మంది పిల్లలు తమ నృత్య ప్రదర్శనను ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్ తేజ మాట్లాడుతూ..నృత్యం, నృత్తం అని రెండు వేరు వేరు కళలని అన్నారు. ప్రదర్శనలో మొత్తం నృత్తం అనగా కేవలం చేతుల కదలికలతో చేసేదిగాను, నృత్యం అంటే సకల కళలను అభినయిస్తూ చేయడం అని తెలిపారు. నృత్యం చేయడం అంటే ఒక కథను చెప్పడం అని, ఈ నృత్యానికి మొదటి రూపం పులి నృత్యం చేసేవారని, అటు తరువాత నెమలి నాట్యాన్ని క్రమంగా వాన నృత్యములతో నృత్యం పరిణతి చెందుతూ నృత్య కళాభివృద్ధి చెందింది అన్నారు. ఇప్పుడు మన భరతావనిలో మనము భరతనాట్య ఆది గురువుగా భరతుని పూజిస్తూ ఉన్నామని గుర్తు చేశారు. ఈ మధ్యనే భగవద్గీతకు భరత నాట్యానికి యునెస్కో గౌరవం దక్కడం తనకు ఎంతో ఆనందదాయకంగా ఉందని అన్నారు. నృత్య కళాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందించాలని కోరారు. మరో ముఖ్య అతిథి సికింద్రాబాద్ డాన్స్ అండ్ మ్యూజిక్ కాలేజ్ రిటైర్డ్ గవర్నమెంట్ ప్రిన్సిపల్ సువర్ణలత మాట్లాడుతూ.. ఇప్పుడు నృత్యం నేర్చుకోవడంలోను, నేర్పడంలోనూ రోజురోజుకు ఆసక్తి పెంచుకుంటున్నారని, ఈ నృత్యంలో ఎన్నో భిన్నమైన కళారూపాలు ఉన్నాయని తెలిపారు. ఎందరో విద్యార్థులు తమ పాఠశాల నుండి అనేక విషయాలను నేర్చుకుని అభినయిస్తూ ఉన్నారని, నేటి తరం పిల్లలు కళల పట్ల ఆసక్తి చూపుతున్నందుకు తనకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. కాగా, బోడుప్పల్ కు చెందిన కెలిక డాన్స్ అకాడమీ నాట్య గురువు బ్రహ్మశ్రీ విద్యాసాగర్ శిష్య బృందంచే నిర్వహించిన 'నటేషా కేతువం' సంగీత నృత్య రూపకం ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. నృత్య కళాకారులు ఆహుతుల నుండి ప్రశంసలు అందుకున్నారు. అత్యంత ప్రతిభ కనబరిచిన వారిలో బొక్క శరణ్య, ప్రణతి, సాన్విక, హర్షిక, ప్రశంస, ఆద్య, అద్వైతి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమానికి నృత్య కళాకారిణి ఇందిరా పరాశరం సభాధ్యక్షులు వహించారు, రమణి, మాధవి శర్మ, ఓలేటి రంగమణి, సంజయ్ కుమార్ జోషి కథక్ విలాస్ నృత్య గురువు, ఎస్ వి కే కార్యదర్శి ఎస్. వినయ్ కుమార్, బాలోత్సవ అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, సెక్రటరీ సోమయ్య, వైస్ ప్రెసిడెంట్స్ సుజావతీ, రూప రుక్మిణి, కవి, రచయిత మమత, అంకమ్మ, బాలోత్సవ ట్రెజరర్ బుచ్చి రెడ్డి పాల్గొని ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులైన కళాకారులందరికీ సర్టిఫికెట్లు, మెడల్స్ బహూకరించారు.

# భూభారతి చట్టంలోని అప్పీలు ద్వారా భూ సమస్యలకు పరిష్కారం

హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



పరకాల,నేడున్యూస్:భూభారతి చట్టంలో ముఖ్యంగా అప్పీలు వ్యవస్థ ఉందని, అప్పీలు చేసుకోవడం ద్వారా భూ సమస్యలను విచారించి హక్కులు పొందడానికి భూభారతి చట్టం తోడ్పడుతుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా పరకాలలోని ఆర్ఆర్ గార్డెన్ లో భూభారతినూతన ఆర్వోఆర్ చట్టం పై పరకాల మండలం పరిధిలోని గ్రామాలు, మున్సిపాలిటీ పరిధిలోని రైతులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో భూభారతి నూతన ఆర్వోఆర్ చట్టంలోని మార్గదర్శకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించగా పరకాల ఆర్డీవో డాక్టర్ కె. నారాయణ రైతులు, ప్రజలకు చదివి వినిపించారు. ఈ సదస్సులో పరకాల పరిధిలోని వివిధ గ్రామాలు, మున్సిపల్ పరిధిలోని రైతులు, ప్రజలు తాము గత కొంతకాలంగా ఎదుర్కొంటున్న భూసమస్యల పరిష్కారం గురించి జిల్లా కలెక్టర్, అధికారాలకు వివరించగా ఆర్డీవో సమాధానమిచ్చారు. రైతులు ప్రజలు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం తీసుకువచ్చిన భూభారతి చట్టంలోని మార్గదర్శకాలను రైతులు, ప్రజలు తెలుసుకోవాలన్నారు. భూభారతి చట్టంలోని అంశాలకు సంబంధించిన కరపత్రాలను అందించామని, అందులోని ప్రతి సెక్షన్ గురించి సదస్సుకు హాజరైన ప్రతి ఒక్కరు తెలుసుకొని తమ తమ గ్రామాల్లోని రైతులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. భూభారతి చట్టానికి సంబంధించి అన్ని అంశాలు జూన్ రెండో తేదీ నుంచి అందుబాటులోకి రానున్నాయని అన్నారు. భూ సమస్యలపై భూభారతి చట్టం ద్వారా అప్పీల్ చేసుకున్నట్లయితే వాటిని విచారించి చట్టం ద్వారా తగిన పరిష్కారం లభిస్తుందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి కొత్తగా సాదా బైనామా ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని అవగాహన సదస్సులలో పాల్గొన్న రైతులు, ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాలు, హనుమకొండ అర్బన్ ప్రాంతం తో పాటు పరకాల టౌన్ కు సంబంధించి రైతులు, ప్రజలు సూచించిన విధంగా సాదాబైనామా దరఖాస్తుల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. త్వరలో భూభారతి ఆన్లైన్ పోర్టల్ అందుబాటులోకి రానుందని, భూ సమస్యల పరిష్కారం కోసం పోర్టల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ విజయలక్ష్మి , ఎంపీడీవో ఆంజనేయులు, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజిరెడ్డి, కుంకుమేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ రాజేశ్వర రావు, తదితరులతో పాటు పరకాల పరిధిలోని వివిధ గ్రామాల రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అన్యాయం

*ఇందిరమ్మ కమిటీల జోక్యంతో పేదలకు మొండి చెయ్యి

* అందోళన చేసిన పేదలు.



కారేపల్లి నేడు న్యూస్: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో జరిగిన అన్యాయంపై పేదల అందోళనకు దిగిన ఘటన మంగళవారం కారేపల్లి మండల ఉసిరికాయలపల్లిలో జరిగింది. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికకు గతం గ్రామసభ పెట్టిన ఎంపిక చేసిన వారికి రాకుండా అనర్హులకు ఇండ్లు మంజూరు కావటంతో పేదలు అగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బాధితులు ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట అందోళనకు దిగారు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్ బానోత్ బన్సీలాల్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి మల్లయ్యలు మాట్లాడుతూ గ్రామసభలో ఏకగ్రీవంగా 40 మంది నిరుపేదలను ఎంపిక చేసి అధఇకారులు ఇవ్వటం జరిగిందన్నారు. ఆ జాబితాను పక్కన పెట్టి కాంగ్రెస్ కార్యకర్తల కమిటీ అయిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు పేదలు, ఇండ్లు లేనివారిని పక్కన పెట్టి, తమ కార్యకర్తలు, గ్రామంలో లేని పలుకుబడి కల్గినవారి ఇండ్లు మంజూరు చేశారని దుయ్యబట్టారు. నిజమైన పేదలకు అన్యాయం జరిగితే సహించేది లేదని అధికారులు వెంటనే రీ సర్వే చేసి అర్హులకు ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యదర్శి నిరంజన్ కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ లాకావత్ చంద్రశేఖర్, బీ.బాలు, దాసరి సైదులు, ఎం.బాలుచౌహన్, లలితమ్మ, రవికుమార్, వాంకుడోత్ చిన్నా, రాములు వినోజ్ కుమార్, జీ.నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# బాల్య వివాహాలతో బాలికల ఆరోగ్యం విద్యకు అంతరాయం




ఆర్డిఎస్ స్వచ్ఛంద సంస అధ్వక్షురాలు చిన్నమ్మ థామస్

వనపర్తి బ్యూరో,నేడున్యూస్: బాల్య వివాహల కారణంగా బాలికల ఆరోగ్యము, విద్య కు అంతరాయం కలిగిస్తుందనీ, బాల్యవివాహాల జాతీయ సగటు రేటు 23.3% గా ఉందని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే పేర్కొందనీ ఆర్డిఎస్ స్వచ్ఛంద సంస్థ అధ్వక్షురాలు చిన్నమ్మ థామస్ అన్నారు. వనపర్తిలో మంగళవారం అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా జరగనున్న బాల్యవివాహాల నిర్మూలన పై ఆర్డిఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. బాల్యవివాహాలకు ఏ మతం మద్దతు ఇవ్వదని, బాల్య వివాహాలను నిర్మూలించడంలో మత పెద్దలు, మత విశ్వాసకులను భాగస్వామ్యం కావాలన్నారు. దేశవ్యాప్తంగా మొత్తం 416 జిల్లాల్లో మత ఆధ్యాత్మిక వేత్తలతో ప్రార్థన స్థలాలు, కమ్యూనిటీ సెంటర్లు, మార్కెట్ల వద్ద బాల్య వివాహాలకు వ్యతిరేకంగా బ్యానర్లు, ప్లకార్డులను ప్రదర్శించడం, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. పండిట్, పూజారి, మౌలి, గ్రంధి లతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించడం జరుగుతుందన్నారు. బాల్య వివాహం చట్ట ప్రకారం నేరం శిక్షార్హమైనది అనే గుర్తు చేస్తూ వీడియోను రూపొందించడం జరుగుతుందని ఈ వీడియోను చైల్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా అనే హ్యాష్ టాగ్ తో సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయవలసిన అవశ్యకత ఎంతైన ఉందని పేర్కొన్నారు. బాల్య వివాహ రహిత భారతదేశం నిర్మాణం కోసం దేశవ్యాప్తంగా 2022 నుంచి 160 ఎన్జీవోలు కృషి చేస్తున్నాయనీ తెలిపారు. 20 30 నాటికి బాల్యవివాహాల రేటు ను 5% నికి తగ్గించడానికి ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందనీ అన్నారు. భారతదేశంలో 9 ప్రధాన మతాలు (హిందూ, ఇస్లాం, క్రైస్తవం, సి క్కు, జైనం, బౌద్ధం, జుడాయిజం, బహ, జోరాస్ట్రిఇజం)చెందిన 17 మంది మత పెద్దలు బాల్యవివాహాలను నిర్మూలించేందుకు ఏకతాటి పైకి వచ్చి బాల్యవవాహాలను నిర్ద్వంద్వం గా ఖండించారన్నారు. బాల్యవివాహాలను అంతం చేయడానికి దేశవ్యాప్తంగా 400 జిల్లాల్లో జస్ట్ రైస్ ఫర్ చిల్డ్రన్స్ పనిచేస్తుందనీ తెలిపారు. ఒక్కరోజులో భారతదేశం అంతట 23 కోట్ల మంది పౌరులు బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సమాజానికి అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారన్నారు. దేశవ్యాప్తంగా ఏకకాలంలో సుమారు రెండు లక్షల బాల్యవివాహాలను గ్రామస్థాయిలో అడ్డుకున్నారనీ తెలియజేశారు. బాల్య వివాహాలు మాత్రమే కాకుండా బాల కార్మిక వ్యవస్థ, పిల్ల ల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అనేక అవగాహన కార్యక్రమాలు, ప్రతిజ్ఞలు, పోస్టర్ విడుదల కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని చిన్నమ్మ థామస్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఎస్ స్వచ్ఛంద సంస్థ అధ్వక్షురాలు చిన్నమ్మ థామస్, సఖి లీగల్ అడ్వైసర్ కృష్ణయ్య, యాక్సిస్ టు జస్టిస్ వనపర్తి జిల్లా కోఆర్డినేటర్ ఎడ్విన్, మహబూబ్నగర్ జిల్లా కోఆర్డినేటర్ కన్నన్, గద్వాల్ జిల్లా కోఆర్డినేటర్ చంద్ర శేఖర్, సోషల్ మొబైలేజర్ రాజశేఖర్, ఆర్డిఎస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు శ్రీ లక్ష్మి ,పాల్గొన్నారు.

# వరంగల్ రజతోత్సవ సభ సూపర్ సక్సెస్ ఎమ్మెల్యే కృష్ణారావు



కూకట్పల్లి: నేడున్యూస్ గ్రామగ్రామం నుండి ప్రజలందరూ తండోపతండాలుగా కెసిఆర్ సభకు తరలివచ్చరని దేశ చరిత్రలోనే వరంగల్ బిఆర్ఎస్ సభలాంటి మీటింగ్ ఏనాడు జరుగలేదని పోలీసులు సభ ప్రయాణంలో ఒకరు లేకపోయి నా గులాబీ శ్రేణులు సైనికుల్లా పనిచేశారు.కెసిఆర్ సభ సక్స స్ తట్టుకోలేకనే ఆగమేఘాల మీద కాంగ్రెస్ మంత్రులు ప్రె స్ మీట్ పెట్టారు.జనాలు రాలేదు బాహుబలి సెట్టింగ్ అని కాంగ్రెస్ మంత్రులు అంటున్నారు.సిగ్గుశరం ఉంటే వరంగల్ కాంగ్రెస్ కార్యకర్తలను అడగండి ఎన్ని లక్షల మంది ప్ర జలు వచ్చారో. మీలాగా 420 హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభు త్వం తెలంగాణ ప్రజలను మోసంచేసింది.420 హామీలు ఇచ్చి 20 హామీలు కూడా నెరవేర్చకుండా కాంగ్రెస్ పార్టీ కేసీఆర్ ను విమర్శిస్తారా.

కాంగ్రెస్ ప్రభుత్వనికి చిత్తశుద్ధి ఉంటే ప్రజలకు ఇచ్చిన హామీలను నిరవేర్చాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సవాల్ విసిరారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడిస్తారని రేవంత్ సర్కార్ ఎన్ని అబద్ధాలు ఆడిన వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే అన్నారు.

## ఇటుక బట్టీలో విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



గుండ్ల పోచంపల్లి, నేడున్యూస్: మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి శివారులోని ఓ ఇటుక బట్టీలో కరెంటు షాక్ తో వ్యక్తి మృతి చెందాడు. ఇటుక బట్టి వ్యాపారి నిర్లక్ష్యం వల్ల నిండు ప్రాణం బలయింది. పెట్ బషీర్ బాగ్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గుండ్ల పోచంపల్లి శివారులోని నూజివీడు సీడ్స్ బ్యాక్ సైడ్ లో ఉన్న ఇటుక బట్టి తయారు చేసే స్థలం వద్ద విద్యుత్ షాక్ తో కాపురి చాన్ కట్ట ( 32) అనే ఒడిస్సా కి చెందిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇటుకల తయారీ కోసం మట్టిని నీటితో తడపడానికి మోటర్ ను వేసి తిరిగి బంద్ చేయడానికి కోసం వెళ్లినప్పుడు విద్యుత్ షాక్ తగిలింది. ఇటుక బట్టి యజమాని సాంబశివరావు నిర్లక్ష్యం వల్లనే ఈ ఘటన జరిగిందని పెట్ బషీర్బాగ్ పోలీసులు తెలిపారు. స్టార్టర్ మోటర్ ను తడి ప్రదేశంలో పెట్టడం వల్ల విద్యుత్ ఘాతం జరిగిందని పోలీసులు తెలిపారు. నాలుగు నెలల క్రితం ఇటుక బట్టి తయారు చేయడం కోసం ఒరిస్సా నుండి తన కుటుంబ సభ్యులతో పాటు భార్య ఇద్దరు పిల్లలతో గుండ్ల పోచంపల్లి కి వచ్చారు. రోజు మాదిరిగా సాయంత్రం 6:30 గంటల ప్రాంతంలో ఇటుకల తయారీ కోసం మోటర్ ను వేయగా ఈ ఘటన చోటు చేసుకుందని మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేస్ నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేట్ బషీర్బాగ్ పోలీసులు తెలిపారు.

## మండల అధ్యక్షుడుపై సొంత పార్టీ నాయకుల దాడి..

పోలీసులకు ఫిర్యాదు చేసిన అతని భార్య

నడికుడా,నేడున్యూస్: సోమవారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి నడికూడ మండల కేంద్రంలో జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమానికి నడికూడ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించగా ఆ సమావేశానికి హాజరై తన నివాసానికి తిరిగి వస్తుండగా నర్సక్కపల్లి బస్ స్టాప్ సమీపంలో ఉన్న రైస్ మిల్ వద్ద ఒక ఆల్టో కారు, పల్సర్ బైక్ పై నర్సక్కపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు నాగూర్ల శ్రీనివాస్, నాగూర్ల నగేష్, నాగూర్ల వెంకటేష్, లోనే వెంకటేష్ లు నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ ను అటకాయించి అతనిపై బండలు వేసి తీవ్రంగా గాయపరచడం జరిగిందని, తన భర్తకు వారితో ప్రాణహాని ఉందని, నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ భార్య నర్సక్క పల్లి ఎంపీటీసీ బుర్ర దీప పరకాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఆమె మాట్లాడుతూ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆశీస్సులతో కాంగ్రెస్ పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేస్తుంటాడని ఆయన పనితనం చూసి మండల అధ్యక్షుడిగా నియమించారని అలాంటి వ్యక్తిపై ఈరోజు తన పార్టీలోని వ్యక్తుల దాడి చేయడం తీవ్ర విషాదంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారితో తన భర్తకు ప్రాణహాన్ని ఉందని పరకాల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వారిని కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలి.

## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

మండల పశు వైద్యాధికారి డాక్టర్ అహ్మద్



మొయినాబాద్, నేడు న్యూస్: రైతులందరూ తమ పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ అహ్మద్ తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ అహ్మద్ అన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని ముర్తుజగూడ గ్రామంలో 295 పశువులకు టీకాలు వేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సహాయక సిబ్బంది ప్రసన్న కుమార్, భీంరావ్, పాడి రైతులు, ఘోరేమియా పాల్గొన్నారు.



## జాతీయ పతాకం కోసం ప్రాణాలర్పించిన సామా జగన్మోహన్ రెడ్డికి నివాళ్లు

మేడ్చల్,నేడున్యూస్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మేడ్చల్ జిల్లా చింతల్ శాఖ అధ్వర్యంలో చైతన్య కాలేజ్ లో సామా జగన్మోహన్ రెడ్డి వర్ధంతి ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కన్వీనర్ నగేష్ మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాలయం నడిబొడ్డున జాతీయ పతాకానికి జరిగిన అవమానాని ఎదిరించి ప్రాణాలర్పించిన మొట్టమొదటి జాతీయవాది సామా జగన్మోహన్ రెడ్డిన అని కొనియాడారు.1980వ సంవత్సరం జనవరి 26 గణతంత్ర దినోత్సవం రోజున కాకతీయ విశ్వవిద్యాలయంలో వైస్ఛాన్సలర్, ప్రొఫెసర్ల సమక్షంలో జాతీయ జెండాను ఎగురవేయనీయకుండా ఆర్ ఎస్ యూ కార్యకర్తలు అడ్డుకున్నారని,ఈ దేశద్రోహాన్ని సహించలేక సామా జగన్మోహన్ రెడ్డి ఆర్ ఎస్ యూ కార్యకర్తల చేతిలో నుంచి జాతీయ పతాకాన్ని లాక్కొని ఎగురవేశారని గుర్తు చేశారు.ఇలా రెండు సంవత్సరల తర్వాత 1982 లో ఏప్రిల్ 29న కోర్టు కేసుకు హాజరై వస్తున్న జగన్మోహన్ రెడ్డిని హనుమకొండ ప్రధాన రహదారి పై అత్యంత క్రూరంగా నక్సలైట్లు హత్య చేశారని తెలిపారు .త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించి జాతి గౌరవాన్ని నిలబెట్టే క్రమంలో ప్రాణాలర్పించిన యువకిశోరం అని కొనియాడారు .ఇలాంటి వారి కొసం విద్యార్థిలు నిరంతరం దేశం కోసం ప్రాణాలు అర్పించినటువంటి వారిని స్మరించుకుంటూ భారత్ మాత సేవలో నిమగ్నమై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్ ఫ్ ఎస్ కన్వీనర్ మృత్యుంజయ,నగర సంయుక్త కార్యదర్శి మహేష్,దివ్య తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## హంగార్గా గ్రామంలో దొంగల బీభత్సం..

బంగారంతో పాటు బైక్ చోరీ



పోతంగల్ ,నేడు న్యూస్ : హంగార్గా గ్రామంలో దొంగల బీభత్సం సృష్టించారు. వేసవి కాలం కావడంతో చల్లదనం కోసం దాబాపై కుటుంబ సభ్యులు పడుకుంటే.. కింద ఇంట్లో చొరబడి సొత్తు దోచుకెళ్లారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం హంగర్గా గ్రామానికి చెందిన పుట్టి రాములు కుటుంబీకులు వేసవి కాలం కావడంతో సోమవారం రాత్రి దాబాపై నిద్రించారు. తెల్లవారిలేచి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో అందోళన చెందారు. ఇంట్లోకి వెళ్లి చూస్తే బీరువా తెరిచి ఉంది. బీరువాలో దాచిన ఐదు తులాల బంగారం, ఆరు తులాల వెండి, కొంత నగదు మాయమైంది. బయట కొచ్చి చూస్తే సరికి ద్విచక్ర వాహనం కూడా కనబడలేదు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



మేడ్చల్,నేడున్యూస్:మేడ్చల్ మండలం రాజ్ బొల్లారం తాండ కు చెందిన దిరావత్ సక్కుబాయి కి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ 49,500 రూపాయల చెక్కును మాజీ మంత్రి ఎమ్మెల్యే సిహెచ్ మల్లా రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఆసరాగా నిలుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నేతలు మాలోత్ రవి నాయక్, గుగులోత్ రాజేందర్ నాయక్ దిరావత్ బాలరాజ్ నాయక్ మండల పార్టీ అధ్యక్షులు దయానంద్ యాదవ్ ప్రధాన కార్యదర్శి సుదర్శన్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్ మండల యూత్ ప్రెసిడెంట్ హరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీని సందర్శించిన డీసీసీబీ సీఈవో

బ్యాంకు విస్తరణకు అవసరాలకు స్థల పరిశీలన

కారేపల్లి నేడు న్యూస్. కారేపల్లి సహకార సంఘాన్ని ఖమ్మం డీసీసీబీ సీఈవో వెంకట అదిత్య మంగళవారం సందర్శించారు. సొసైటీ పరిసరాలు, ఎరువుల గోడౌన్ను పరిశీలించారు. డీసీసీబీ బ్యాంకు విస్తరణలో భాగంగా అవసరమైన భవననిర్మాణానికి కావల్సిన స్థలాలను ఆయన పరిశీలించారు. సొసైటీ కి చెందిన స్థలంలో బ్యాంకు నిర్వాహణకు కావల్సిన భవన నిర్మాణం చేయటంపై సాధ్యసాధ్యాలను ఆయన పరిశీలించారు. అనంతరం సొసైటీ కార్యాలయం, డీసీసీబీ బ్రాంచిలో సమీక్షని ర్వహించారు. సొసైటీ అందిస్తున్న సేవలు, రుణాలు, ఆర్థిక పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సొసైటీ ద్వారా దీర్ఘకాలిక రుణాలను అందించాలని కార్యదర్శిని ఆదేశించారు. కారేపల్లి సొసైటీ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ గా ఎంపికైందని ఎఫ్పీవో గా రైతులకు అవసరమైన ఉత్పత్తి, సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. సొసైటీలో నగదు రహిత లావాదేవీల నిర్వాహణపై యూపీఎ కంపెనీ ప్రతినిధులతో చర్చించారు. సీఈవో వెంట డీజీఎం వేణుగోపాల్, ఏజీఎం ప్రవీణ్కుమార్, కారేపల్లి బ్రాంచి మేనేజర్ బాల రవికుమార్, సూపర్వైజర్ కొంగర వేణు, కార్యదర్శి బొల్లు హనుమంతరావు తదితరులు ఉన్నారు.

# భూ భారతిపై అవగాహన

*కార్యక్రమలో పాల్గొన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షేట్కార్, ఎమ్మెల్యే మదన్ మోహన్



ఎల్లారెడ్డి,నేడున్యూస్: లింగంపేట మండలం శెట్పల్లి గ్రామం నందు నిర్వహించిన భూభారతి చట్టం అవగాహనా సదస్సు (పైలట్ ప్రాజెక్ట్) కార్యక్రమంలో ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్, ఎంపీ సురేష్ కుమార్ షేట్కార్ మాట్లాడుతులింగంపేట మండల ప్రాంతం భూభారతి చట్టం పైలట్ ప్రాజెక్ట్ గ ఎంపిక చేసినందుకు రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి మరియు మంత్రి శ్రీనివాస్ రెడ్డి ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజల తరపున ఎమ్మెల్యే మదన్ మోహన్,ఎంపీ సురేష్ కుమార్ షేట్కార్ ధన్యవాదాలు తెలిపారు. ధరణి పోర్టల్ వల్ల ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలు ముఖ్యంగా నియోజకవర్గ రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు అని తెలిపారు. భూభారతి చట్టం తేవడంతో రైతుల భూమి సమస్యలు తొలిగిపోతాయి అని ధీమా వ్యక్తం చేసారు. లింగంపేట మండలం భూభారతి చట్టం పైలట్ ప్రాజెక్ట్ గా ఎంపిక అయిన విషయం తమకు తెల్వగానే చాల సంతోషం అనిపించింది అని ఎమ్మెల్యే& ఎంపీ అన్నారు. ఎల్లారెడ్డి చరిత్రలో రెవెన్యూ మంత్రి రావడం ఇదే మొదటిసారి అని తెలిపారు. అతి తక్కువ సమయంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతు రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా, రైతుల భూ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు భూభారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు ఆయన వెల్లడించారు. మంత్రి మాట్లాడుతూ, కలెక్టర్లు మరియు రైతులతో సమగ్ర చర్చలు జరిపిన తర్వాత ఈ చట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు. ప్రజల నుండి స్వీకరించిన సలహాలను కూడా ఈ చట్టంలో పరిగణనలోకి తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు.

ఈ చట్టం అమలుకు ముందుగా, నాలుగు ప్రాంతాల్లో నాలుగు మండలాలను పైలట్ ప్రాజెక్టులుగా ఎంచుకున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన,ఎంపీ సురేష్ కుమార్ షేట్కార్ చొరవతోనే లింగంపేట మండలం పైలట్ ప్రాజెక్ట్ ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ పైలట్ ప్రాజెక్టుల ద్వారా భూ సమస్యలను పరిశీలించి, రైతుల సమస్యలను పూర్తిగా పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన భరోసా ఇచ్చారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు రాష్ట్ర వ్యవసాయ రంగంలో సానుకూల మార్పులను తీసుకొచ్చే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రంలో జిల్లా కలెక్టర్, ఎల్లారెడ్డి ఆర్డీఓ, జాయింట్ కలెక్టర్, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, యూత్ అధ్యక్షులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, శెట్పల్లి & చుట్టా పక్కన ఉన్న గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

## సంస్థ అభివృద్దే ప్రతి ఉద్యోగి లక్ష్యం



బోడుప్పల్, నేడు న్యూస్: ఆర్టీసీ సంస్థ అభివృద్దే ప్రతి ఉద్యోగి లక్ష్యం కావాలని ఆర్టీసీ చెంగిచెర్ల డిపో మేనేజర్ కే. కవిత తెలిపారు. ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో ప్రగతి చక్రం త్రైమాసిక పురస్కారాలలో భాగంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉత్తమ ఉద్యోగుల అభినందన సభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అత్యధిక ఆదాయం తీసుకువచ్చిన కండక్టర్లు, ఇందనం ఆదాచేసిన డ్రైవర్లు, బస్సులను సక్రమంగా మెయింటెనెన్స్ చేసిన మెకానిక్ లను శాలువాలతో సన్మానించి నగదు బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేసినప్పుడే సంస్థకు ఆదాయం పెంచుకోగలుగుతామన్నారు.

డ్రైవర్లు రోడ్డు ప్రమాదాలను నివారించి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రయాణికులను ఆదరించి వారి మన్నలను పొందడం ద్వారా ఆదాయాన్ని మరింత పెంచుకోవచ్చని కోరారు. సమయపాలన పాటించి ప్రయాణికుల మన్ననలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) చంద్రమౌళి, అసిస్టెంట్ మేనేజర్ (పర్సనల్) శేషి రెడ్డి, ఈడబ్ల్యుబి సభ్యులు పద్మావతి, వెంకటేష్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెల, మేకలకు ఉచితంగా ఇన్సూరెన్స్ ఇవ్వాలి

జి ఎం పి ఎస్ అధ్యక్షులు మేకల కుమార్ డిమాండ్



మేడ్చల్,నేడున్యూస్: గొర్రెల మేకలకు ప్రభుత్వమే ఉచితంగా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని జీఎంపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మేకల కుమార్, ఎక్కలదేవి కొమురయ్య డిమాండ్ చేశారు.జీఎంపీస్ మేడ్చల్ మండల రెండవ మహాసభను మేడ్చెల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మేకల కుమార్, ఎక్కలదేవి కొమురయ్య మాట్లాడుతూ జి ఎం పి ఎస్ కమిటీ అనేక సమస్యల పైన పోరాటం చేసిందని ఇప్పుడున్న పరిస్థితిలో గొర్రెల మేకల పెంపకం దారులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. గొర్రెలు మేకలు మేపడానికి స్థలం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం సబ్సిడీ మీద దాన సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గొర్రెల మేకలకు మూడు నెలలకు ఒకసారి నట్టల నివారణ మందులు తాగించాలని, ఆసుపత్రిలో వ్యాక్సిన్లు మందులు అందుబాటులో ఉండేలా చూడాలని పశువైద్యశాలను ఉదయం 7 గంటల నుండి ప్రారంభించేయల మార్పు చేయాలని 50 సంవత్సరం దాటిన గొర్రెల కాపరికి రూ 5 వేల పింఛన్ ఇవ్వాలని కోరారు. వివిధ ప్రమాదంలో చనిపోతున్న గొర్రెల కాపరికి 10 లక్షల ఎక్స్గ్రేషన్ ప్రభుత్వం చెల్లించాలని, కేంద్ర ప్రభుత్వం ఎన్ఎల్ఎం పథకంలో గొల్ల కురుమ యువతకు 50 శాతం రిజర్వేషన్లు గొర్రెల ఫామ్స్ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని, దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని మేడ్చల్ జిల్లా కేంద్రంలో పెట్టాలి డిమాండ్ చేశారు. అనంతరం మేడ్చల్ మండలం నూతన కమిటీని 25 మందితోని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సల్ల పెద్ద కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కౌడి శ్రీశైలం, గౌరవ అధ్యక్షులుగా బుల్లి వెంకటేశం ఉపాధ్యక్షులుగా కురుమ పర్వతాలు, మాసిని మల్లేష్, సందపురం మల్లేష్ ఎర్రోళ్ల అశోక్ ఎన్నికయ్యారు.

## దరఖాస్తుతో పాటు ధ్రువపత్రాలు సమర్పించండి

*రాజీవ్ యువ వికాస స్కీం కు దరఖాస్తు చేసుకున్నవారు సంబంధిత పత్రాలు సరి చూసుకోండి

*నేటి సాయంత్రంలోగా సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించండి: ఎంపీడీవో

గుండాల, నేడు న్యూస్: రాజీవ్ యువ వికాస పథకానికి దరఖాస్తు చేసుకున్న యువకులు సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించాలని గుండాల మండల ఎంపీడీవో దేవేందర్ రావు తెలిపారు. గుండాల మండలంలోని వివిధ గ్రామాల యువకులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస స్కీం కి అప్లికేషన్ పెట్టుకున్న యువకులు సంబంధిత అన్ని సర్టిఫికెట్లు వెంటనే సమర్పించాలని ఆయన కోరారు. రాజీవ్ యువ వికాస్ పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఆన్లైన్లో మాత్రం అప్లికేషన్ పెట్టుకుని ఎంపీడీవో కార్యాలయంలో కొంతమంది అప్లికేషన్ ఫామ్ మాత్రమే సబ్మిట్ చేశారని, రాజీవ్ యువ వికాస స్కీం కు సంబంధించిన సర్టిఫికెట్లు సమర్పించలేదని తెలిపారు. సంబంధిత ధ్రువపత్రాలైన ఆధార్ కార్డు, పాన్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువపత్రము, కులం ధ్రువ పత్రము, ట్రాన్స్పోర్ట్ యూనిట్ స్కీం కు అప్లై చేసిన వారు డ్రైవింగ్ లైసెన్స్, అగ్రికల్చర్ యూనిట్ స్కీంకు అప్లై చేసిన వారు పట్టాదారు పాసుబుక్ సర్టిఫికెట్లను సబ్మిట్ చేయనివారు (నేడు) 30 4 2025 రోజున సాయంత్రం ఐదు గంటలలోగా సంబంధిత పత్రాలు జతపరచుటకు అవకాశం ఉందని తెలిపారు. ఎవరైనా ఆన్లైన్ అప్లికేషన్ వెనకాల ఈ సర్టిఫికెట్లు సబ్మిట్ చేయనట్లయితే వెంటనే సంబంధిత ఆఫీసర్ ను కలిసి సబ్మిట్ చేయాలని ఎంపీడీవో దేవేందర్ రావు తెలిపారు.

## వీధి కుక్కల నియంత్రణకు నిర్దిష్ట చర్యలు తీసుకోండి



కమిషనర్ వై.ఓ నందన్

నెల్లూరు, బ్యూరో, నేడు న్యూస్:నగర పాలక సంస్థ పరిధిలో వీధి కుక్కల నియంత్రణకు నిర్దిష్టమైన చర్యలు తీసుకొని, శస్త్ర చికిత్సల కాలంలో వాటికి అవసరమైన ఆహారం, మందులను అందించి వేగవంతంగా కోలుకునేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ వైఓ నందన్ వెటర్నరీ వైద్యులను ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 5 వ డివిజన్ వైకుంఠపురం, సత్యనారాయణపురం, నేతనగర్, అహ్మద్ నగర్, అరవపాలెం, స్థానిక 6 వ డివిజన్ స్టోన్ హౌస్ పేట, చెన్నూరు వారి వీధి, సాలె వీధి తదితర ప్రాంతాలలో మంగళవారం పర్యటించారు. పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలోని ఏబిసి కేంద్రం ద్వారా వీధి కుక్కల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, వాక్సినేషన్ తప్పనిసరిగా ఇప్పించాలని సూచించారు. శస్త్ర చికిత్స సమయంలో తగిన మోతాదులో ఆహారం అందించి సంరక్షించాలని, అవసరమైన వైద్య సదుపాయాలు, మందులను తప్పనిసరిగా ఇప్పించి ఆరోగ్యవంతంగా తిరిగి కోలుకునేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. స్థానిక బోడి గాడి తోట, అహ్మద్ నగర్ ప్రాంతాలలో విద్యుత్ వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. డివిజన్ల వ్యాప్తంగా డ్రైను కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను క్రమం తప్పకుండా సిబ్బంది చేపట్టేలా పర్యవేక్షించాలని అధికారులను సూచించారు. స్థానికంగా నిర్మిస్తున్న నూతన అపార్ట్మెంట్ ను కమిషనర్ పరిశీలించి, బిల్డింగ్ ప్లాన్ అనుమతులను తనిఖీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్న ఫిర్యాదును కమిషనర్ పరిశీలించి తగిన పరిష్కారం చూపించాల్సిందిగా రెవెన్యూ విభాగం అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలోని అన్న క్యాంటీన్ కమిషనర్ సందర్శించి ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమాల్లో నగరపాలక సంస్థ వెటర్నరీ వైద్యులు డాక్టర్ మదన్ మోహన్, ఇంజనీరింగ్ విభాగం డిఈఈ ముజాహిద్దీన్, రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, పట్టణ ప్రణాళిక విభాగం, వార్డు సచివాలయ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు,సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి ఆత్మకూరు పర్యటన ఖరారు

నెల్లూరు, బ్యూరో, నేడు న్యూస్:మే 1 వ తేదిన జిల్లాలోని ఆత్మకూరు లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన అధికారికంగా ఖరారు అయ్యింది. షెడ్యూల్ ప్రకారం ఉదయం11:30 కు ఆత్మకూరు లోని బాలికల గురుకుల పాఠశాల లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ కు చేరు కుంటారు. అక్కడ ముఖ్యమంత్రికి ప్రజా ప్రతినిధులు, అధికారులు స్వాగతం పలుకుతారు. అనంతరం 11:50 కు నెల్లూరుపాలెం కు చేరుకుని ఎన్టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. 12:10 నుండి 12:30 వరకు నెల్లూరుపాలెం గ్రామం లోని బిల్డింగ్ వర్కర్స్ తో ముఖాముఖి మాట్లాడతారు. అనంతరం 12:35 కు నారంపేట ఏ పి ఐ ఐ సి కు చేరుకుని యం ఎస్యంఈ పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 1:30 నుండి 3:00 వరకు ప్రజావేదిక లో స్థానికులతో ముఖాముఖి లో పాల్గొంటారు. అనంతరం 3:05 కు టిడ్కోగ్రౌండ్ కు చేరుకుని 4:35 వరకు పార్టీ క్యాడర్ తో మాట్లాడిన అనంతరం 4:40 కు హెలిప్యాడ్ కు చేరుకుని 5:45 కు ఉండవల్లి లోని ముఖ్యమంత్రి నివాసానికి చేరుకుంటారు.

## కూచిపూడి నాట్యంలో రాణిస్తున్న మోక్షదృతి



ఘట్ కేసర్, నేడు న్యూస్: కూచిపూడి నాట్యాన్ని అద్భుతంగా చేసి అందరిని మెప్పించిన కళాకారిణి మోక్షదృతి అభినందనీయురాలని యక్షగాన కంఠీరవ, ప్రఖ్యాత కూచిపూడి నాట్యాచార్యులు పసుమర్తి శేషుబాబు తెలిపారు. ఘట్ కేసర్ మున్సిపాలిటీ ఎన్ ఎఫ్ సీ నగర్ కు చెందిన మోక్షదృతి నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రపంచ నృత్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన స్ఫూర్తి నేషనల్ డాన్స్ ఫెస్ట్2025 కార్యక్రమంలో కూచిపూడి నృత్య కళాకారిని మోక్షదృతి పాల్గొని అత్యంత ప్రతిభ పాటలను ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులు దోసపాటి శంకర్, ప్రవర్తి లను కూడ అభినందించి శాలువాలు, పుష్పగిచ్చాలతో సన్మానించారు. నాట్య కళాకారిణి మోక్షదృతిని ప్రఖ్యాత కూచిపూడి నాట్యాచార్యులు డాక్టర్ పసుమర్తి శేషుబాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అకుంఠిత దీక్ష, పట్టుదలతో అత్యుత్తమ ప్రదర్శనలు ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు సాధించాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, నృత్యాచార్యులు, నాట్య గురువులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి బ్రహ్మోత్సవాలకు సేవా కమిటి ఏర్పాటు

* ఎమ్మెల్యే ప్రశాంతమ్మ చొరవతో 12 మందితో ఏర్పడిన కమిటీ.
* మే 17 నుంచి 27 వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలు



బుచ్చిరెడ్డిపాళెం, నేడు న్యూస్: మండల పరిధిలోని జొన్నవాడ క్షేత్రంలోని శ్రీ కామాక్షితాయి అమ్మవారి ఆలయానికి నూతన సేవా కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రానున్న అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సేవా కమిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా, ఈ మేరకు కమిటీని ఏర్పాటు చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. శ్రీ కామాక్షితాయి అమ్మవారి సేవా కమిటీలో తిరువూరు అశోక్ రెడ్డి, కనపర్తి నాగేంద్ర, నక్కల శివకృష్ణ తిరువాయిపతి నందకుమార్, ముంగర సుధాకర్, శశి శేఖర్ శర్మ (అర్చక), పాలూరు చాముండేశ్వరి, కొల్లపూడి శారద, పెన్నత్తూరు సుమలత, గంద్రకోట రమాదేవి, జొన్నలగడ్డ వరలక్ష్మి, ఇమ్మడిశెట్టి సౌజన్య లక్ష్మి గార్లు ఎన్నికయ్యారు. వీరు మే 17 నుంచి 27 వరకు జరగనున్న అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో సేవలు అందించనున్నారు. ఈ సందర్భంగా సేవా కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ప్రశాంతమ్మకు, దేవాదాయ శాఖ మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలోనే ఈ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ప్రత్యేకంగా భేటీ కానున్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఉన్నతాధికారులు



భద్రత కట్టుదిట్టం చేయాలని అధికారులకు ఆదేశాలు

నెల్లూరు/ఆత్మకూరు, నేడు న్యూస్:రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆత్మకూరులో మే1న పర్యటన సందర్భంగా ముందస్తు భద్రతా సమన్వయంలో ఎఎస్ఎల్ భాగంగా సీఎం పర్యటించే ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణ కాంత్ పర్యటించారు. మంగళవారం ఉదయం ఆత్మకూరుకు విచ్చేసిన కలెక్టర్, ఎస్పీ ఆత్మకూరు బీసీ గురుకుల పాఠశాల వద్ద హెలీ పాడ్, పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాట్లను, నారంపేట ఎంఎస్ఎంఈ పార్కు వద్ద పైలాన్ ఆవిష్కరణ, సభ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్లకు సంబంధించి, భద్రతా పరంగా తీసుకోవలసిన జాగ్రత్తలపై అధికారులకు కలెక్టర్, ఎస్పీ పలు సూచనలు చేశారు. నెల్లూరు పాలెం గిరిజన కాలనీ వద్ద సీఎం స్వయంగా వెళ్లి పింఛన్ అందజేసే ఇంటిని, గిరిజన కాలనీని కలెక్టర్, ఎస్పీ సందర్శించారు. మేడే కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని నారంపేట ఎస్ఎంఈ పార్క్, నెల్లూరు పాలెం మధ్యలో నిర్మిస్తున్న కళ్యాణ మండపం వద్ద భవన నిర్మాణ కార్మికులతో సీఎం మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకుంటారు. ఈ ప్రాంతాన్ని కూడా అధికారులు పరిశీలించారు. సీఎం పర్యటన ప్రదేశాల్లో ఒక్కొక్క ప్రాంతానికి ఒక్కొక్క అధికారిని పర్యవేక్షణ అధికారిగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆనంద్ బాధ్యతలు అప్పగించారు. ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులకు సహకరిస్తూ వారి సూచనల మేరకు సీఎం పర్యటన ప్రాంతాల్లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో పావని, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, ఎపిఐఐసి జడ్ఎం శివకుమార్, పరిశ్రమల శాఖ జిఎం మారుతీ ప్రసాద్, ఆర్అండ్బి ఎస్ఈ గంగాధర్, విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్, తదితరులు పాల్గొన్నారు.


# రైల్వే నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్



తిరుపతి, బ్యూరో, నేడు న్యూస్:జిల్లాలో జాతీయ రహదారులకు మరియు రైల్వే లైన్ కు సంబంధించిన భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నందు జాతీయ రహదారి భూసేకరణ పురోగతి పనులపై జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తో కలిసి వర్చువల్ విధానంలో నేషనల్ హైవే పిడి లు, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓ లు రామ్మోహన్, కిరణ్మయి, భాను ప్రకాష్ రెడ్డి సంబంధిత మండలాల తాసిల్దార్లు తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జాతీయ రహదారులు నిర్మాణాలకు ఎంతో ప్రాధాన్యతను ఇస్తుందని అన్నారు. జిల్లాలో నిర్మితమవుతున్న పలు ప్రాజెక్టులు, జాతీయ రహదారుల సేకరణకు సంబంధించి పనులను ప్రాధాన్యత తీసుకొని వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. దీనికి సంబంధించి రెవెన్యూ డివిజన్ అధికారులు, తాసిల్దారులు, జాతీయ రహదారుల అధికారులతో సమన్వయం చేసుకొని పని చేయాలన్నారు. జాతీయ రహదారి భూసేకరణ పనులు త్వరిత గతిన పూర్తి కావడానికి ప్రణాళికను రూపొందించుకొని పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారుల నిర్మాణ పనులు పురోగతి ఉన్న రహదారి విస్తరణ పనులు కూడా వేగంగా చర్యలు తీసుకోవాలని భూ సేకరణకు సంబంధించిన పెండింగ్ పనులలో సంబంధిత ఆర్డీవోలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అలాగే గ్రామాల దగ్గర వచ్చే సర్వీస్ రోడ్డు లకు సూచిక బోర్డులను గ్రామ ప్రజలకు తెలిసేలా ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అధికారులకు సూచించారు.భూసేకరణ పెండింగ్ అవార్డు సంబంధించిన పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు.పీలేరు, కాలూరు, రేణిగుంట, నాయుడుపేట జాతీయ రహదారి పనులు ఎటువంటి అలసత్వం లేకుండా వెంటనే పనులు పూర్తయ్యేలా రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఎన్ హెచ్ అధికారులు సమన్వయంతో నిర్దేశించుకున్న గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రైల్వే ప్రాజెక్టులు నడికుడి శ్రీకాళహస్తి, గూడూరు రేణిగుంట, తిరుపతి పాకాల ప్రాజెక్ట్ కు సంబంధించిన భూ సేకరణ పనులు పూర్తయ్యేలా ఆర్డీఓ లు, తహసిల్దార్లు చర్యలు తీసుకోవాలని తెలిపారు .తిరుపతి రేణిగుంట బైపాస్ సంబంధించిన పెండింగ్ భూ సమస్యలను పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ లను ఆదేశించారు. ఈ సమావేశంలో తిరుపతి, నెల్లూరు, చెన్నై నేషనల్ హైవే పి డీలు తిరుపతి వెంకటేష్, ఎం కె చౌదరి, టెక్నికల్ మేనేజర్ జయలక్ష్మి , రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీరింగ్ రాధాకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యాన్ తయారీ కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం



* ఎగిసి పడ్డ మంటలు * మంటలను ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది
* తప్పిన ప్రాణాపాయం
* కోటి రూపాయలు నష్టం?

మేడ్చల్,నేడున్యూస్: గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని బాసరేగడి లో నిన్న అర్ధరాత్రి కేకేసి ఫ్యాన్ తయారీ కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కంపెనీలో మంటలు ఎగిసి పడ్డాయి. 5 ఫైర్ ఇంజన్లతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అర్ధరాత్రి ఒంటి గంట వరకు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనలో కోటి రూపాయల ఆస్తి నష్ట జరిగినట్లు తెలుస్తుంది. అయితే షార్ట్ సర్క్యూట్ జరిగిన సమయంలో కంపెనీలో కార్మికులు ఎవరు లేకపోవడంతో ప్రాణం నష్టం జరగలేదని తెలుస్తుంది. సాయంత్రం 6:30 ప్రాంతంలో కార్మికులు తమ విధులను ముగించుకొని ఇంటికి ఇంటికి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. రాత్రి 10:30 గంటలకు ఈ ఘటన చోటు చేసుకోవడంతో ప్రాణ నష్టం జరిగినట్లు తెలుస్తోంది.

### ఫైర్ పర్మిషన్ ఉందా?

కేకేసి ఫ్యాన్ తయారీ కంపెనీకి ఫైర్ పర్మిషన్ లేనట్లు తెలుస్తుంది. అగ్ని ప్రమాదం అనంతరం సంబంధిత అధికారులు ఫైర్ పర్మిషన్ ఉందా?లేదా? అని ప్రశ్నించగా మే 2 తేదీ వరకు చూపిస్తామంటూ సంబంధిత ఫ్యాని తయారీ కంపెనీ యజమానులు అధికారులకు చెప్పినట్లు తెలుస్తోంది.

### హైడ్రా అధికారుల పరిశీలన

అగ్ని ప్రమాదం జరిగిన కేకేసి ఫ్యాన్ తయారీ కంపెనీ హైడ్రా అధికారులు పరిశీలించారు. అగ్ని ప్రమాదం జరిగిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.






## అకౌంటింగ్ అవకతవకల నేపథ్యంలో ఇండస్ఇండ్ బ్యాంక్ డిప్యూటీ సీఈవో అరుణ్ ఖురానా సంచలన రాజీనామా

ముంబై: ప్రైవేట్ రంగంలోని ప్రముఖ బ్యాంకుల్లో ఒకటైన ఇండస్ఇండ్ బ్యాంక్లో ఇటీవల వెలుగు చూసిన అకౌంటింగ్ అవకతవకల వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో బ్యాంకు డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (డిప్యూటీ సీఈవో) అరుణ్ ఖురానా తన పదవికి హఠాత్తుగా రాజీనామా చేశారు. బ్యాంకు ట్రెజరీ ఫ్రంట్ ఆఫీస్ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్న ఖురానా, మార్చి 2025తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు భారీగా రూ.1960 కోట్ల నష్టాన్ని చవిచూసిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు.బ్యాంకు అంతర్గత డెరివేటివ్ పోర్ట్ఫోలియోలో గుర్తించిన అవకతవకలే ఈ రాజీనామాకు ప్రధాన కారణమని తెలుస్తోంది. ఈ మేరకు అరుణ్ ఖురానా బ్యాంకు బోర్డుకు తన రాజీనామా లేఖను పంపారు. ‘ఇటీవలి దురదృష్టకర పరిణామాల దృష్ట్యా, ట్రెజరీ ఫ్రంట్ ఆఫీస్ బాధ్యతలు, పూర్తి స్థాయి డైరెక్టర్ పదవి, డిప్యూటీ సీఈవో హోదా మరియు బ్యాంకు సీనియర్ మేనేజ్మెంట్లో భాగంగా నా పదవికి తక్షణమే రాజీనామా చేస్తున్నాను‘ అని ఆయన తన లేఖలో స్పష్టం చేశారు.ఈ రాజీనామా ఏప్రిల్ 28వ తేదీ నుండి అమల్లోకి వస్తుందని ఇండస్ఇండ్ బ్యాంక్ సోమవారం సాయంత్రం స్టాక్ ఎక్స్ఛేంజ్కు తెలియజేసింది. తనపై విశ్వాసం ఉంచి బ్యాంకులో కీలక బాధ్యతలు అప్పగించినందుకు ఖురానా బోర్డుకు కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా, బ్యాంకు భవిష్యత్తు విజయవంతంగా ఉండాలని ఆకాంక్షించారు. కాగా, ఏప్రిల్ 15న మరో అంతర్గత ఏజెన్సీ నివేదిక ప్రకారం, డెరివేటివ్స్ పోర్ట్ఫోలియోలో జరిగిన అవకతవకల కారణంగా బ్యాంకు నికర విలువపై రూ.1,979 కోట్ల ప్రతికూల ప్రభావం పడుతుందని ఇండస్ఇండ్ బ్యాంక్ వెల్లడించింది. అంతకుముందు, గత నెలలో బ్యాంకు తన డెరివేటివ్స్ పోర్ట్ఫోలియోలో అకౌంటింగ్ లోపాలు జరిగినట్లు నివేదించింది. ఈ లోపాల కారణంగా డిసెంబర్ 2024 నాటికి బ్యాంకు నికర విలువ దాదాపు 2.35 శాతం తగ్గుతుందని అంచనా వేసింది.అరుణ్ ఖురానా వంటి సీనియర్ అధికారి హఠాత్తుగా రాజీనామా చేయడం ఇండస్ఇండ్ బ్యాంక్లో నెలకొన్న సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేసే అవకాశం ఉంది. ఈ పరిణామాలు బ్యాంకు పనితీరుపై మరియు పెట్టుబడిదారుల సెంటిమెంట్పై ఎటువంటి ప్రభావం చూపుతాయో వేచి చూడాలి. బ్యాంకు భవిష్యత్తు కార్యాచరణ మరియు ఈ అకౌంటింగ్ అవకతవకలపై యాజమాన్యం తీసుకునే చర్యలు కీలకం కానున్నాయి.




# కొన్ని రంగాల్లో లాభాలు, మరికొన్నింటిలో నష్టాలు



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి దాదాపుగా స్థిరంగా (ఫ్లాట్గా) కొనసాగాయి. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సూచీ సెన్సెక్స్ స్వల్ప లాభంతో ప్రారంభమైనప్పటికీ, రోజంతా ఒడుదొడుకులకు లోనై చివరికి పెరుగుదలతో ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం ఇదే తరహా ధోరణిని ప్రదర్శించింది.సెన్సెక్స్ ఉదయం 80,396.92 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. ఇంట్రాడే ట్రేడింగ్లో ఒకానొక సమయంలో 80,122.02 పాయింట్ల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. అయితే, కొనుగోళ్ల మద్దతు లభించడంతో తిరిగి పుంజుకుని గరిష్ఠంగా 80,661.31 పాయింట్లను తాకింది. చివరికి, క్రితం ముగింపుతో పోలిస్తే 70.02 పాయింట్ల స్వల్ప లాభంతో 80,288.38 వద్ద స్థిరపడింది.అదేవిధంగా, నిఫ్టీ కూడా మంగళవారం ట్రేడింగ్లో స్థిరమైన ముగింపును నమోదు చేసింది. ఇది 7.45 పాయింట్లు స్వల్పంగా పెరిగి 24,335.95 వద్ద నిలిచింది. ట్రేడింగ్ జరిగినంత సేపు మార్కెట్లో కొనుగోళ్లు మరియు అమ్మకాలు సమానంగా కొనసాగాయి. మొత్తం ట్రేడింగ్ జరిగిన షేర్లలో దాదాపు 1766 షేర్లు లాభాలను పొందగా, 2012 షేర్లు నష్టాలను చవిచూశాయి.నిఫ్టీలో అత్యధికంగా లాభపడిన షేర్లలో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ , టెక్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎటర్నల్ మరియు ట్రెంట్ ఉన్నాయి. మరోవైపు, సన్ ఫార్మాస్యూటికల్స్, ఓఎన్జీసీ (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్), కోల్ ఇండియా, అల్ట్రాటెక్ సిమెంట్ మరియు డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ అత్యధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి.మొత్తం మార్కెట్ విస్తృతిని పరిశీలిస్తే, బీఎస్ఈ మిడ్క్యాప్ మరియు స్మాల్ క్యాప్ సూచీలు ఫ్లాట్గా ముగిశాయి. ఇది మధ్య మరియు చిన్న తరహా కంపెనీల షేర్లలో పెద్దగా కదలికలు లేవని సూచిస్తుంది.రంగాల వారీగా చూస్తే, కొన్ని రంగాలు సానుకూల ఫలితాలను చూపించాయి. క్యాపిటల్ గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) మరియు ఆయిల్ అండ్ గ్యాస్ రంగాలు 0.5 శాతం నుండి ఒక శాతం వరకు లాభపడ్డాయి. దీనికి విరుద్ధంగా, మెటల్, పవర్, టెలికాం మరియు ఫార్మాస్యూటికల్ రంగాలు 0.5 శాతం నుండి ఒక శాతం వరకు నష్టాలను నమోదు చేశాయి.మంగళవారం నాటి ట్రేడింగ్లో దేశీయ స్టాక్ మార్కెట్లు స్థిరంగా ముగియడం మిశ్రమ సంకేతాలను ఇస్తోంది. కొన్ని కీలక రంగాల్లో వృద్ధి కనిపిస్తున్నప్పటికీ, మరికొన్ని రంగాలు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ మరియు దేశీయ ఆర్థిక పరిణామాలు మార్కెట్ దిశను నిర్దేశించే అవకాశం ఉంది.

# బిజినెస్

## అక్షయ తృతీయ వేడుకలకు ముందు కొనుగోలుదారులకు ఎదురుదెబ్బ!

పవిత్రమైన అక్షయ తృతీయ పండుగ సమీపిస్తున్న వేళ బంగారం కొనుగోలు చేయాలని భావిస్తున్న వారికి ఊహించని షాక్ తగిలింది. మంగళవారం ఒక్కసారిగా పసిడి ధరలు ఆకాశాన్నంటాయి. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర ఏకంగా రూ.1,050 పెరిగి రూ.99,450కి చేరుకుందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. ఆభరణాల వ్యాపారులు మరియు స్టాకిస్టుల నుంచి డిమాండ్ అనూహ్యంగా పెరగడంతో ఈ ధరల పెరుగుదల చోటుచేసుకుంది.హిందూ సంప్రదాయం ప్రకారం వైశాఖ మాసంలోని శుక్ల పక్ష తృతీయ తిథిని అక్షయ తృతీయగా జరుపుకుంటారు. ఈ శుభ దినాన బంగారం మరియు వెండి కొనుగోలు చేయడం శుభసూచకంగా భావిస్తారు. ఈ సంవత్సరం అక్షయ తృతీయ ఏప్రిల్ 30న వస్తోంది. ఈ నేపథ్యంలో మార్కెట్లో కొనుగోళ్ల సందడి నెలకొంది.ఇక 22 క్యారెట్ల బంగారం ధర కూడా భారీగా పెరిగింది. తులం ధర ఏకంగా రూ.1,100 అధికమై రూ.99,000కు చేరుకుంది. ఈ ఏడాది ప్రారంభం నుంచి చూసుకుంటే బంగారం ధరలు తులంపై దాదాపు రూ.20,500 మేర పెరిగాయి. అంటే కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే దాదాపు 26 శాతం ధరలు పెరగడం గమనార్హం. గత ఏడాది డిసెంబర్ 31 నాటికి తులం బంగారం ధర రూ.78,950గా ఉంది.బంగారంతో పాటు వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. కిలో వెండి ధర ఏకంగా రూ.3,500 పెరిగి రూ.1,02,000కు చేరుకుంది. గత మూడు వారాల్లో వెండి ధర ఈ స్థాయిలో పెరగడం ఇదే మొదటిసారి. అంతకు ముందు కిలో వెండి ధర రూ.98,500 వద్ద కొనసాగింది. అక్షయ తృతీయ సందర్భంగా బంగారం మాదిరిగానే వెండికి కూడా భారీ డిమాండ్ ఉంటుందని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.అయితే అంతర్జాతీయ మార్కెట్లో మాత్రం భిన్నమైన పరిస్థితి నెలకొంది. స్పాట్ గోల్ ఒక శాతం తగ్గి ఔన్సుకు 3,311 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లో స్పాట్ సిల్వర్ ఔన్స్ 33.27 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. లాభాల స్వీకరణకు ట్రేడర్లు మొగ్గు చూపుతుండటంతో కామెక్స్లో బంగారం డిమాండ్ తగ్గింది. ప్రస్తుతం ఔన్సుకు 3310 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.అమెరికా, భారత్, జపాన్ వంటి దేశాల మధ్య వాణిజ్య ఒప్పందాలు జరుగుతున్నాయన్న ఆశలు మరియు వాణిజ్య యుద్ధం భయాలు తొలగిపోతున్న నేపథ్యంలో డిమాండ్ పడిపోతుందని ఎల్కేజీ సెక్యూరిటీస్ రీసెర్చ్ అనలిస్ట్, కమోడిటీ అండ్ కరెన్సీ వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది అభిప్రాయపడ్డారు. అయితే దేశీయంగా అక్షయ తృతీయ డిమాండ్ కారణంగా ధరలు పెరుగుతుండటం గమనార్హం.



# నాగ చైతన్య, శోభిత త్వరలో తల్లిదండ్రులు కాబోతున్నారా?



టాలీవుడ్లో ప్రస్తుతం హాట్ టాపిక్గా మారిన క్రేజీ జంట నాగ చైతన్య మరియు శోభిత. సమంతతో విడాకుల తర్వాత శోభితను వివాహం చేసుకున్న నాగ చైతన్య ఇప్పుడు ఆమెతో ఆనందంగా ఉన్నారు. శోభిత అతని జీవితంలోకి వచ్చినప్పటి నుండి అన్నీ మంచే జరుగుతున్నాయని అభిమానులు భావిస్తున్నారు. వారి వివాహం తర్వాత నాగ చైతన్య 'తండేల్' వంటి బ్లాక్బస్టర్ విజయాన్ని అందుకున్నారు. ఈ విజయాన్ని ఆస్వాదించడానికి ఈ జంట కలిసి యూరప్ ట్రిప్కు వెళ్లారు, ఆ ఫోటోలను చైతన్య తన ఇన్స్టాగ్రామ్లో పంచుకున్నారు.ఇటీవల, శోభిత తన పెంపుడు కుక్క హాష్తో ఆడుకుంటూ, వారి ఆదివారం ఎలా గడిచిందో తెలియజేస్తూ కొన్ని ఫోటోలను షేర్ చేశారు. ఈ ఫోటోలు నాగ చైతన్య మరియు శోభితల మధ్య ఉన్న అనుబంధాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. గతేడాది డిసెంబర్ 4న వివాహ బంధంతో ఒక్కటైన ఈ జంట గురించి ఇప్పుడు ఒక ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.శోభిత గర్భవతి అని, త్వరలోనే ఒక పండంటి బిడ్డకు జన్మనివ్వబోతున్నారని సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. అక్కినేని కుటుంబంలోకి వారసుడు రాబోతున్నాడని అభిమానులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ సందడి చేస్తున్నారు. అయితే, ఈ విషయంపై నాగ చైతన్య కానీ, శోభిత కానీ అధికారికంగా స్పందించలేదు. అక్కినేని కుటుంబం కూడా దీనిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. అయినప్పటికీ, ఈ వార్త మాత్రం ఇంటర్నెట్లో జోరుగా చక్కర్లు కొడుతోంది.అయితే, అక్కినేని కుటుంబానికి సన్నిహిత వర్గాల నుండి అందుతున్న సమాచారం ప్రకారం ఈ వార్తల్లో ఎటువంటి వాస్తవం లేదని తెలుస్తోంది. శోభిత ప్రస్తుతం గర్భవతి కాదని వారు స్పష్టం చేస్తున్నారు. ఇటీవల శోభిత తన పెంపుడు కుక్క హాష్తో ఉన్న ఫోటోలను ఇన్స్టాగ్రామ్లో షేర్ చేయగా, కొందరు నెటిజన్లు నాగ చైతన్య మరియు శోభిత త్వరలోనే శుభవార్త చెప్పబోతున్నారనే పుకార్లను సృష్టించారు. ఆ కారణంగానే శోభిత ఈ ఫోటోలను షేర్ చేశారని కొందరు కామెంట్ చేశారు.ఇక నాగ చైతన్య సినిమాల విషయానికి వస్తే, ఆయన తన తాజా చిత్రం 'తండేల్' విజయం తర్వాత 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వంలో ఒక మైథలాజికల్ థ్రిల్లర్ మూవీలో నటిస్తున్నారు.

ఈ సినిమాపై కూడా ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. అయితే, ప్రస్తుతం అందరి దృష్టి నాగ చైతన్య మరియు శోభితల వ్యక్తిగత జీవితంపై కేంద్రీకృతమైంది. వారు తల్లిదండ్రులు కాబోతున్నారనే వార్త నిజమా కాదా అనేది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే. అప్పటి వరకు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఈ వార్త కేవలం పుకారుగానే పరిగణించాల్సి ఉంటుంది.

# ఎలా ఉండే మహేష్ .. ఎలా అయిపోయాడు..



సూపర్ స్టార్ మహేష్ బాబు టాలీవుడ్ స్టార్ హీరోలలో ఒకరు. ఆయన గ్లామర్కి ఎవరైన ఫిదా కావల్సిందే. కృష్ణ నటవారసుడిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన మహేష్ తనదైన నటనతో స్టార్ హీరోగా ఎదిగాడు. ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు తన 29వ చిత్రం చేస్తున్న విషయం తెలిసిందే. ఇండియన్ సినిమా చరిత్రలోనే రాజమౌళి ఈ చిత్రాన్ని అత్యంత భారీ చిత్రంగా రూపొందిస్తున్నారు. ఏకంగా 1000 కోట్ల బడ్జెట్ లో ఈ చిత్రం తెరకెక్కుతుండగా, ఈ మూవీతని ఆఫ్రికా అడవుల నేపథ్యంలో యాక్షన్ అడ్వెంచర్ చిత్రంగా రాజమౌళి అత్యద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు.అయితే రాజమౌళి సినిమాలో హీరో లుక్ గత సినిమాల కన్నా భిన్నంగా ఉంటుందనే విషయం మనకు తెలిసిందే. ఇప్పుడు మహేష్ బాబు లుక్ ఎలా ఉంటుందనే చర్చ గత కొన్ని రోజులుగా నడుస్తుంది. ఈ క్రమంలో మహేష్ బాబు లేటెస్ట్ లుక్ లీక్ అయింది. ఇందులో హెయిర్, గడ్డం పొడవుగా కనిపిస్తున్నాయి. లేటెస్ట్ లుక్ మాత్రం ఫ్యాన్స్ కి షాకింగ్ గా ఉంది. అసలు అక్కడ ఉన్నది మహేష్ బాబా, ఇంకెవరా అని ఒక్కసారి ఆలోచనలో పడ్డారు సూపర్ స్టార్ ఫ్యాన్స్ . ఎంతో హ్యాండ్సమ్ గా కనిపించే మహేష్ ఈ లుక్ లో బీస్ట్ లాగా ఉన్నాడని, గుర్తు పట్టకుండా మారాడని కొందరు కామెంట్ చేస్తున్నారు.కొందరు ఫ్యాన్స్ అయితే మహేష్ లుక్ చూసి సింహాన్ని దగ్గర నుంచి చూస్తున్నట్లు ఉంది అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఏది ఏమైన కూడా మహేష్ లుక్ సోషల్ మీడియాలో వైల్ ఫైర్ లాగా వ్యాపించింది. ఇక సినిమా విషయానికి వస్తే చిత్రాన్ని రాజమౌళి ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ఆఫ్రికా అడవుల్లో మహేష్ తిరుగుతూ ప్రాణాంతక వ్యాధికి మెడిసిన్ తీసుకువచ్చే కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు అర్థం అవుతుంది. రామాయణంలో లక్ష్మణుడిని కాపాడేందుకు హనుమంతుడు సంజీవని పర్వతాన్ని తీసుకువస్తారు. ఆ పాయింట్ ఇన్స్పిరేషన్ తో విజయేంద్ర ప్రసాద్ ఈ కథ రాసినట్లు చెప్పుకొస్తున్నారు. ఒడిశాలో తొలి షెడ్యూల్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం రెండో షెడ్యూల్ మరి కొద్ది రోజులలో జరుపుకోనుంది.

## సినిమా

# పవన్ కళ్యాణ్ కుమారుడు ప్రమాదపు భయాలతో సతమతం

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ ఇటీవల పాఠశాలలో జరిగిన ఒక ప్రమాదం నుండి తృటిలో తప్పించుకున్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో మార్క్ శంకర్ చేతులు, కాళ్లకు స్వల్ప గాయాలు కావడంతో పాటు, దట్టమైన నల్లటి పొగను పీల్చడంతో వైద్యులు 'బ్రోన్కోస్కోపీ' అనే చికిత్స అందించారు. ప్రస్తుతం మార్క్ శంకర్ హైదరాబాద్లోని తన నివాసంలో ఉంటూ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నాడు. అయితే, ఈ ప్రమాదం కారణంగా మార్క్ శంకర్ మానసికంగా తీవ్రంగా ప్రభావితమయ్యాడని, పవన్ కళ్యాణ్ స్వయంగా వెల్లడించారు.మంగళగిరిలోని సీకే కన్వెన్షన్లో జరిగిన ఒక కార్యక్రమంలో పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారికి నివాళులర్పించిన పవన్ కళ్యాణ్, ఉగ్రవాదుల కాల్పుల్లో అన్యాయంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల పరిస్థితిని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా, తన కుమారుడు మార్క్ శంకర్ గురించి మాట్లాడుతూ, ప్రమాదం నుండి సురక్షితంగా బయటపడినప్పటికీ, ఆ సంఘటన తాలూకు భయం ఇంకా అతడిని వెంటాడుతోందని పవన్ కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు.'మార్క్ శంకర్ ఇప్పటికీ రాత్రి వేళల్లో నిద్రలో ఒక్కసారిగా ఉలిక్కిపడి లేస్తున్నాడు. భవనం పైనుంచి పడిపోయినట్లు కలలు కంటున్నాడు. ఈ భయాన్ని అధిగమించేందుకు సైకియాట్రిస్ట్ ద్వారా చికిత్స చేయిస్తున్నాం' అని పవన్ కళ్యాణ్ తెలిపారు.పహల్గాం ఉగ్రదాడిలో తమ కళ్ల ముందే కొందరు ప్రాణాలు కోల్పోతుంటే, వారి కుటుంబ సభ్యులు ఎంత భయానకంగా భావించి ఉంటారో ఊహించలేకపోతున్నానని పవన్ కళ్యాణ్ అన్నారు. ఆ భయానక సంఘటన నుండి ఇంకా అనేక కుటుంబాలు బయటపడలేదని, అలాంటి వారికి తోటివారు ధైర్యం చెప్పాలని ఆయన కోరారు.పవన్ కళ్యాణ్, రేణు దేశాయ్ విడాకుల అనంతరం రష్యాకు చెందిన నటి అన్నా లెజ్నేవాను వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. 2013లో వీరి వివాహం జరిగింది.

వీరికి పోలేనా అంజనా పవనోవిచ్ అనే కుమార్తె, మార్క్ శంకర్ పవనోవిచ్ అనే కుమారుడు ఉన్నారు.మార్క్ శంకర్ ప్రమాదం నుండి బయటపడినప్పటికీ, అతడి మానసిక ఆరోగ్యం పట్ల పవన్ కళ్యాణ్ తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చిన్నారిని ఆ భయం నుండి బయటపడేసేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తున్నారు. పిల్లల మానసిక ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ఎంత శ్రద్ధ వహించాలో ఈ సంఘటన తెలియజేస్తోంది.



## స్పోర్ట్స్

# ఐపీఎల్ 2025లో అద్భుతమైన ఫీల్డింగ్ విన్యాసాలు

### : గాల్లోకి ఎగిరి కళ్లు చెదిరే క్యాచ్తో దుష్మంత చమీరా సంచలనం!

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) యొక్క 18వ సీజన్ క్రికెట్ అభిమానులకు బ్యాటింగ్ మరియు బౌలింగ్ విన్యాసాలతో పాటు అద్భుతమైన ఫీల్డింగ్ ప్రదర్శనలను కూడా అందిస్తోంది. ముఖ్యంగా శ్రీలంక ఆటగాళ్లు తమ అసాధారణమైన అథ్లెటిసిజంతో మైదానంలో మెరుపులా కదులుతూ కళ్లు చెదిరే క్యాచ్లను అందుకుంటూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు.ఇటీవల చెన్నై సూపర్ కింగ్స్తో జరిగిన మ్యాచ్లో లంక ఆల్రౌండర్ కమిందు మెండిస్ ఎడమవైపు డైవ్ చేస్తూ ఒంటి చేత్తో పట్టిన అద్భుతమైన క్యాచ్ ఇంకా అభిమానుల మదిలో మెదులుతూనే ఉంది. ఆ క్యాచ్ ధాటిగా ఆడుతున్న డెవాల్ బ్రెవిస్ను పెవిలియన్కు పంపింది. తాజాగా, అదే తరహాలో శ్రీలంకకు చెందిన మరో పేస్ బౌలర్ దుష్మంత చమీరా తన అద్భుతమైన ఫీల్డింగ్తో అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాడు.మంగళవారం ముంబైలోని వాంఖడే స్టేడియంలో కోల్కతా నైట్ రైడర్స్తో జరిగిన ఉత్కంఠభరితమైన మ్యాచ్లో దుష్మంత చమీరా తన అద్వితీయమైన ఫీల్డింగ్ నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. మ్యాచ్ యొక్క చివరి ఓవర్, అనగా 20వ ఓవర్లో మిచెల్ స్టార్క్ బౌలింగ్ చేస్తుండగా, కోల్కతా బ్యాట్స్మన్ అనుకుల్ రాయ్ బలంగా షాట్ ఆడాడు. బంతి బౌండరీ లైన్ దిశగా వేగంగా దూసుకెళ్లింది.అక్కడ ఫీల్డింగ్ చేస్తున్న దుష్మంత చమీరా వేగంగా పరిగెత్తుకుంటూ వచ్చి, బంతిని అందుకోవడానికి అమాంతం గాల్లోకి ఎగిరాడు. తన రెండు చేతులను చాచి, పూర్తి నియంత్రణతో బంతిని ఒడిసిపట్టుకున్నాడు. చమీరా అందుకున్న ఆ క్యాచ్ ఎంత అద్భుతంగా ఉందంటే, బంతి అతని చేతుల్లోకి వచ్చిన క్షణం అనుకుల్ రాయ్తో పాటు కోల్కతా నైట్ రైడర్స్ డగౌట్లోని ఆటగాళ్లందరూ ఒక్కసారిగా షాక్కు గురయ్యారు. వారి ముఖాల్లో ఆశ్చర్యం స్పష్టంగా కనిపించింది.ఇక స్టేడియంలోని వేలాది మంది అభిమానుల కేరింతలు మిన్నంటాయి. కామెంటేటర్లు సైతం చమీరా యొక్క ఫీల్డింగ్ నైపుణ్యాన్ని కొనియాడుతూ 'వాట్ ఏ క్యాచ్!' అంటూ తమ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. చమీరా గాల్లోకి ఎగిరిన తీరు, బంతిని అందుకున్న విధానం నిజంగా కళ్లు చెదిరేలా ఉంది. ఇది ఐపీఎల్ చరిత్రలో నిలిచిపోయే అత్యుత్తమ క్యాచ్లలో ఒకటిగా నిస్సందేహంగా చెప్పవచ్చు.ఈ సీజన్లో శ్రీలంక ఆటగాళ్లు తమ అద్భుతమైన ఫీల్డింగ్తో ప్రత్యేకంగా నిలుస్తున్నారు. వారి అథ్లెటిసిజం, బంతిని అందుకోవడంలో వారికున్న నైపుణ్యం ప్రత్యర్థులను సైతం ఆశ్చర్యపరుస్తోంది. కమిందు మెండిస్ మరియు దుష్మంత చమీరా వంటి ఆటగాళ్లు తమ ఫీల్డింగ్ ద్వారా జట్టుకు ఎన్నో కీలకమైన వికెట్లను అందిస్తున్నారు. వారి ఫీల్డింగ్ విన్యాసాలు మ్యాచ్ల ఫలితాలను కూడా మార్చేస్తున్నాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ అద్భుతమైన క్యాచ్లు ఐపీఎల్ యొక్క ఉత్సాహాన్ని మరింత పెంచుతున్నాయి మరియు ప్రేక్షకులకు కన్నుల విందుగా ఉంటున్నాయి.



# ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపాలి

### అమాయకుల ఊచకోతపై భగ్గుమన్న హర్భజన్ సింగ్

పహల్గాంలోని బసరన్ లోయలో దారుణంగా ప్రాణాలు కోల్పోయిన అమాయక పౌరుల మరణానికి కారణమైన ఉగ్రవాదుల కోసం భారత సైన్యం ముమ్మరంగా గాలిస్తోంది. వారి ఆచూకీ తెలిపిన వారికి రూ. 20 లక్షల భారీ నజరానాను కూడా ప్రకటించింది. ఈ హృదయ విదారక ఘటనకు పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని దేశవ్యాప్తంగా ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. తాజాగా భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ కూడా ఇదే అభిప్రాయాన్ని బలంగా వ్యక్తం చేశారు.మంగళవారం మధ్యప్రదేశ్లోని ఉజ్జయినిలో కొలువై ఉన్న మహాకాళేశ్వరుడిని హర్భజన్ సింగ్ దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆయన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. 'భూతల స్వర్గంగా పిలువబడే జమ్మూ కాశ్మీర్కు వెళ్లిన అమాయక యాత్రికులను ఉగ్రవాదులు కాల్చి చంపడం అత్యంత దురదృష్టకరం. ఏకంగా 28 మందిని పొట్టనబెట్టుకున్న ఈ టెర్రరిస్టుల చర్య యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ దాడికి ప్రతీకారం తీర్చుకునేలా మనం తగిన చర్యలు తీసుకోవాలి. ఉగ్రవాదులు మన దేశంలోకి చొరబడి మన



ప్రజలను చంపుతుంటే మనం మౌనంగా ఉండకూడదు. ఆ దుర్మార్గులకు కఠినమైన శిక్ష పడేలా చూడాలి' అని హర్భజన్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఏప్రిల్ 22న మధ్యాహ్నం అటవీ మార్గం గుండా బసరన్ లోయలోకి చొరబడిన ఉగ్రవాదులు అత్యంత హేయమైన చర్యకు పాల్పడిన విషయం తెలిసిందే. వారు మహిళలు మరియు పిల్లలను విడిచిపెట్టి కేవలం పురుషులను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నారు. వారిని 'ఐడీ కార్డులు చూపించండి... మీ మతం ఏమిటో చెప్పండి... అల్లాహూ అక్బర్ అనండి' అని ఆదేశించి, చివరకు హిందువులుగా గుర్తించిన 26 మందిని నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపారు. ఈ అమానుషమైన ఉగ్రదాడిని హర్భజన్ సింగ్తో పాటు పలువురు మాజీ క్రీడాకారులు సైతం తీవ్రంగా ఖండించారు. బాధిత కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ భారత క్రికెటర్లు విరాట్ కోహ్లీ, సిరాజ్ మరియు గిల్ వంటి వారు సోషల్ మీడియా వేదికగా తమ స్పందనను తెలియజేశారు.

ఈ ఉగ్రదాడి కేవలం ఒక ప్రాంతానికి జరిగిన నష్టం కాదు, ఇది యావత్ భారతదేశంపై జరిగిన దాడి. అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకుని వారి ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదుల చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించకూడదు. ప్రభుత్వం మరియు భద్రతా బలగాలు ఈ దుర్ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి, వారికి తగిన శిక్ష విధించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా, భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా నిరోధించడానికి కఠినమైన భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. హర్భజన్ సింగ్ వంటి ప్రముఖుల స్పందన ఈ అంశంపై ప్రజల్లో ఉన్న ఆగ్రహాన్ని మరింత స్పష్టం చేస్తోంది. ఉగ్రవాదంపై పోరాటంలో దేశం ఒక్కటిగా నిలబడాల్సిన సమయం ఇది.

# బాల్యంలోనే మెరుపులు.. వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర శతకంతో సంచలనం!

చిన్న వయసులో పాలబుగ్గలతో కనిపించిన వైభవ్ సూర్యవంశీ తన బ్యాటింగ్తో ప్రపంచ క్రికెట్ను ఒక్కసారిగా నివ్వెరపరిచాడు. కేవలం 14 ఏళ్ల వయసులోనే రికార్డు శతకం సాధించి చరిత్ర పుటల్లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్లో అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తూ, 265.78 స్ట్రైక్ రేట్తో శతకం బాది ఈ యువ క్రికెటర్ ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాడు. తన మెరుపుల్లాంటి పవర్ హిట్టింగ్తో విధ్వంసకర శతకం బాదిన వైభవ్.. తాను కేవలం 'బేబీ బాయ్' కాదని, బ్యాటింగ్లో బీభత్సం సృష్టించగల సత్తా ఉన్న ఆటగాడినని నిరూపించాడు. జైపూర్లో గుజరాత్ టైటాన్స్ బౌలర్లపై వైభవ్ చేసిన విధ్వంసాన్ని ప్రత్యక్షంగా చూసిన వారంతా ఇప్పుడు ముక్తకంఠంతో ఇదే మాట అంటున్నారు.టీమిండియా దిగ్గజ ఆటగాడు రవిశాస్త్రి సైతం వైభవ్ ప్రతిభను కొనియాడాడు. భవిష్యత్తులో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించే ఆటగాళ్లలో వైభవ్ ఖచ్చితంగా ఉంటాడని ఆయన జోస్యం చెప్పాడు. ఇక భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ కూడా ఈ యువ ఆటగాడి ఆటతీరును మెచ్చుకున్నాడు. 'ఈ కుర్రాడు చాలా అనుభవజ్ఞుడిలా ఆడుతున్నాడు. అతడికి ఎంతోఉంది' అని ధోనీ తమతో చెప్పాడని రాజస్థాన్ జట్టు మేనేజర్ రోమి భిందెర్ వెల్లడించాడు.



మాజీ క్రికెటర్లు సైతం వైభవ్ అసాధారణ ప్రతిభను ఆకాశానికెత్తుతున్నారు. 'మీరు 14 ఏళ్ల వయసులో ఏమి చేసేవారు? వైభవ్ చూడండి, అతడు రికార్డులు బద్దలు కొడుతున్నాడు' అంటూ అతని ఆటను ప్రశంసిస్తున్నారు. ఓపెనర్గా ఈ బిహార్ కుర్రాడు నిలకడగా రాణిస్తుండటంతో రాజస్థాన్ రాయల్స్ జట్టుకు ఒక కొత్త సమస్య వచ్చి పడింది. కెప్టెన్ సంజూ శాంసన్ను ఏ స్థానంలో ఆడించాలి? జట్టులో ఎవరిని బెంచ్ కూర్చోబెట్టాలి? అనే విషయమై కోచ్ రాహుల్ ద్రవిడ్ మరియు అతని సహాయక సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు.

### ఇంపాక్ట్ ప్లేయర్గా అరంగేట్రం:

కెప్టెన్ సంజూ శాంసన్ గాయం కారణంగా లక్నో సూపర్ జెయింట్స్తో జరిగిన మ్యాచ్లో వైభవ్ ఇంపాక్ట్ ప్లేయర్గా బరిలోకి దిగాడు. 14 ఏళ్ల ఈ కుర్రాడిని చూసి లక్నో బౌలర్లు తేలికగా తీసుకున్నారు. 'ఈ పిల్లాడు ఏమి ఆడతాడులే' అని వారు అనుకున్నారు. అయితే, వారి అంచనాలను తలకిందులు చేస్తూ వైభవ్ తన మొదటి బంతికే శార్దూల్ ఠాకూర్ బౌలింగ్లో లాంగాఫ్లో స్టాండ్స్లోకి భారీ సిక్సర్ బాదాడు. అంతే.. స్టేడియంలోని ప్రేక్షకులు మరియు కామెంటేటర్లు ఒక్కసారిగా 'వాట్ ఏ షాట్' అంటూ కేరింతలు కొట్టారు. ఆ తర్వాత అవేశ్ ఖాన్ వేసిన ఓవర్లోనూ బౌండరీలు బాదిన వైభవ్ దురదృష్టవశాత్తు 35 పరుగుల వద్ద స్టంపౌట్గా వెనుదిరిగాడు. ఒకవేళ అలా జరగకపోయి ఉంటే ఆ మ్యాచ్లోనే ఈ చిచ్చరపిడుగు అర్ధ శతకం సాధించేవాడే.

తొలి మ్యాచ్లో చేజారిన హాఫ్ సెంచరీని వైభవ్ గుజరాత్ టైటాన్స్పై సాధించాడు. సీనియర్ పేసర్ ఇషాంత్ శర్మ వేసిన మొదటి బంతికే సిక్సర్తో స్వాగతం పలికిన అతడు ఆ తర్వాత కూడా ఫోర్లు మరియు సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. ఈ ఎడమచేతి వాటం బ్యాట్స్మెన్ ధాటికి 32 ఏళ్ల ఇషాంత్ శర్మ ఒకే ఓవర్లో 6, 6, 4, 6, 4 బాదించుకున్నాడు. ఈ 18వ ఎడిషన్లో తన తొలి మ్యాచ్ ఆడుతున్న కరీం జన్నత్ వేసిన ఓవర్లో వైభవ్ సిక్సర్ల వర్షం కురిపించి ఏకంగా 30 పరుగులు రాబట్టాడు. అతడు రెచ్చిపోయి ఆడుతుంటే అభిమానులే కాదు, బంతి కూడా బౌండరీ లైన్ దాటుతూ సంబరాలు చేసుకున్నట్లు అనిపించింది.

### వేగవంతమైన శతకం:

కేవలం 17 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించిన ఈ యువ సంచలనం తన తొలి అర్ధ శతకాన్ని సెంచరీగా మలిచాడు. కేవలం 35 బంతుల్లోనే శతకం పూర్తి చేసి ఐపీఎల్ చరిత్రలో రెండో వేగవంతమైన సెంచరీ సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు వైభవ్. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని, తన బ్యాట్ నుండి మరిన్ని మెరుపు శతకాలు వస్తాయని భరోసా ఇస్తున్న వైభవ్ ఆటను ప్రత్యక్షంగా చూసేందుకు కోట్లాది మంది క్రికెట్ అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఈ యువ కెరటం రానున్న రోజుల్లో భారత క్రికెట్లో ఒక ప్రత్యేక ముద్ర వేస్తాడని నిస్సందేహంగా చెప్పవచ్చు.

**Printed, Published and Owned by VELLENKI JAYAPAL REDDY**, Printed at M/s KAKATIYA PRINTERS, H.No: 24-91/72/1, Block No. 29, Plot Nos. 72,73 and 74, Laxminarayana NagarIDA Uppal, Uppal Mandal, Medchal-Malkajigiri Dist. Telangana- 39. Published at H.No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajigiri Dist. Telangana- 92,
**Editor: VELLENKI JAYAPALREDDY, Cell: 9133445456,9346984911 RNI NO : TELTEL/2023/84471,**
Website: www.nedudailynews com, **e-mail: vellenkijayapalreddy@gmail.com.**